ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఒంగోలు
epaper.vaartha.com WWW.VAARTHA.COM fb.com/vaartha Digital

**అమలులోకి పిఎం- రాహత్**
**బంగ్లా ప్రధానిగా రహ్మాన్ ఎంపిక లాంఛనమే** 9లో

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 14 పేజీలు: 12 వెల: 6.50

# సంపద సృష్టికి బాటలు

## విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం
## విశాఖలో 15 బిలియన్ల పెట్టుబడితో డేటా సెంటర్
## ఐదేళ్లలో 20లక్షల మందికి ఉద్యోగాలు
## పిపిపిలో నిర్మించినా హక్కులు ప్రభుత్వానివే
## గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఫిబ్రవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:**సంక్షేమం, అభివృద్ధి జరిగినప్పుడే సంపద సృష్టి జరిగి రాష్ట్ర బాగుపడుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.ఏపీని ఆర్థికంగా పరిపుష్టం చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందన్నారు.వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మామూలు విధ్వంసం జరగలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్య వాదాలు తెలిపే తీర్మానంపై ధన్యవాదాలు తెలిపే సందర్భంలో సీఎం మాట్లాడుతూ పీపీపీలో ఏదైనా నిర్మిస్తే నిర్థిష్టకాలం ప్రైవేటు వ్యక్తులు నిర్వహించి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారన్నారు. సంపద రావాలి అభివృద్ధి జరగాలి. సంపద కొంతమంది దగ్గరే పరిమితమవ్వడం సరికాదు. అందరూ శ్రద్ధగా పనిచేస్తే పీ4 దేశం లోనే ఆదర్శంగా మారుతుంది. ప్రతి ఇల్లు సోలార్ విద్యుత్ తయారు చేసేలా ప్రజాప్రతినిధులు ప్రోత్సహించాలి. త్వరలోనే ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్‌ను కేటాయిస్తాం. ఏం తినాలి ఏం చేయాలో ఏఐ డాక్టర్ చెబుతుంది. విశాఖలో 15 బిలియన్ల పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం. అసెంబ్లీలో నాకు జరిగిన అవమానానికి కన్నీళ్లు పెట్టుకున్నానని, నా మాదిరిగానే ఎంతో మంది కన్నీళ్లు పెట్టుకున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి ఏర్పాటు చేశామని వ్యాఖ్యానించారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా తనను అరెస్టు చేశారని, పవన్ కల్యాణ్ విశాఖ పర్యటనకు వెళ్తే అడ్డుకున్నారని సీఎం అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలిశాయని, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 94 శాతం స్ట్రైక్ రేట్ తో ఓటర్లు గెలిపించారని చంద్రబాబు గుర్తు చేశారు. నాడు మమ్మల్ని అడ్డుకున్నవాళ్లు ఈ రోజు నీతులు చెబుతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఈ అసెంబ్లీ బూతులకు నమూనాగా ఉండేదని అన్నారు. అభివృద్ధికి ఎల్లప్పుడూ మద్దతు ఇచ్చిన జనసేన, బీజేపీకి సీఎం ధన్యవాదాలు తెలిపారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని కానీ వారికి ఒక్క పైసా ఇవ్వలేదని అభివృద్ధి చేసి ప్లాట్లు ఇస్తామని చెప్పామని వివరించారు. అలానే రాష్ట్రంలో రౌడీయిజం, నక్సలిజాన్ని నిర్మూలించగలిగాం కానీ రాజకీయ నేతల ముసుగులో నేతలే నేరాలు చేస్తే ఎలా అని సీఎం ప్రశ్నించారు. ఎక్కడికి పోయినా దౌర్జన్యం చేయడం, రోడ్డం తా బ్లాక్ చేస్తున్నారని అన్నారు. గుంటూరు నుంచి విజయవాడ పోవాలంటే ఆరుగంటలా అయితే ఈ ఆరు గంటలూ ప్రజలు నరకం అనుభవించాలా అని ప్రశ్నించారు. జాతీయ రహదారులపై సమావేశాలు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా >>2



# బడ్జెట్ నేడే

## అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట
## దాదాపు రూ.3.50 లక్షల కోట్ల కేటాయింపులు!
## మరో ప్రధాన హామీ అమలుకు అవకాశం

**విజయవాడ.జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం 202627 వార్షిక బడ్జెట్ కసరత్తు తుది దశకు చేరుకుంది. అసెంబ్లీలో శనివారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. కాగా, ఈ సారి బడ్జెట్ అభివృద్ధి.. సంక్షేమానికి పెద్ద పీట వేయనున్నారు. దాదాపు రూ 3.45 నుంచి 3.50 లక్షల కోట్ల వరకు అంచనాలు ఉండే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో ప్రధాన హామీ అమలు దిశగా ఈ బడ్జెట్ లో ప్రకటన ఉండనున్నట్లు సమాచారం. అసెంబ్లీలో 14వ తేదీ ఉదయం 11.15కి శాసనసభలో ఏపీ బడ్జెట్ 2026 27 ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఆ తరువాత వ్యవసాయ శాఖ బడ్జెట్ ను మంత్రి అచ్చెన్నాయుడు సభ ముందు ఉంచనున్నారు. ఈ సారి ప్రత్యేకంగా ఇరిగేషన్ బడ్జెట్ ను సభలో ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. దాదాపు రూ 3.50 లక్షల కోట్ల వరకు అంచనాలుగా ఉండే అవకాశం కనిపిస్తోంది. అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే నాలుగు అమలు చేస్తున్నారు. పెండింగ్ లో ఉన్న ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు నూ 1500 పథకం పైన బడ్జెట్ లో ప్రకటన చేస్తారని అంచనా వేస్తున్నారు. అదే విధంగా ప్రాధాన్యత రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్ తరువాత రాష్ట్రానికి కేంద్రం నుంచి పన్నుల వాట, వివిధ రంగాల్లో వచ్చే నిధుల పైన స్పష్టత రావటంతో.. ఏపీ ప్రభుత్వం ఈ లెక్కల ఆధారంగా బడ్జెట్‌కు తుది రూపు ఇస్తోంది. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక >>2

# నంబూరు- మంగళగిరి రైల్వే ఫ్లై ఓవర్‌కు ఆమోదం

## అమరావతికి మరింత దగ్గరి మార్గం
## టెండర్లు పిలిచిన రైల్వేశాఖ

**రాజంపేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** గుంటూరు విజయవాడ రైల్వే సెక్షన్లో అతి ముఖ్యమైన నంబూరు మంగళగిరి రైల్వే స్టేషన్ మధ్య రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరు చేస్తూ కేంద్ర రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా శుక్రవారం గుంటూరు డివిజన్ రైల్వే అధికారులు 90.57 కోట్లతో ఈ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు టెండర్లు కూడా పిలిచారు. నాలుగు ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి సోమన్న లకు వివరించారు. అంతకుముందు ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కేంద్రమంత్రికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి రైల్వే అధికారులతోనూ చర్చించారు.

దీంతో రైల్వే అధికారులు త్వరితగతిన టెండర్లు పిలిచారు. ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ మార్గము గుండా నేరుగా అమరావతికి చేరుకునేందుకు ఎంతో అవకాశం ఉంటుంది.ముఖ్యంగా విఐటి, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుంది. నంబూరు మంగళగిరి రైల్వేమార్గం లో 14 రైల్వే క్రాసింగ్ గేటు వద్ద నిర్మిస్తారు 18 నెలల్లోగా రైల్వే బ్రిడ్జిని పూర్తి చేయాలని టెండర్ నిబంధనలో పేర్కొన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత 48 నెలలు డిఫెక్ట్ లైబిలిటీ షరతును రైల్వే అధికారులు విధించారు.






# పార్లమెంటు మార్చి 9కి వాయిదా

## లోక్‌సభ స్పీకర్‌పై విపక్షాల అవిశ్వాస తీర్మానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ముగిశాయి. రాష్ట్ర పతి ప్రసంగం నుంచి రోజు మినహా మిగిలిన అన్ని రోజులూ ఉభయ సభల్లో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం, వాగ్వాదం, వాయిదాలతో నడిచింది. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రిటైర్డ్ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన పుస్తకం చేతబట్టి అందులోని అంశాలను సభలో ప్రస్తావనతో మొదలైన రభస కొనసాగింది. చివరకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ లోక్‌సభలో రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై ప్రసంగించ కుండానే ఆమోదించేశారు. ఇదిలా ఉండగా, రాహుల్‌గాంధీకి మాట్లాడే అవకాశం కల్పించాలంటూ కాంగ్రెస్ సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు నినాదాలతో చేస్తూ స్పీకర్ పోడియంను చుట్టుముట్ట >>2



# 'తపోవనం' స్వామీజీ సచ్చిదానంద సరస్వతి శివైక్యం

## పార్థివ దేహాన్ని దర్శించిన మాజీ మంత్రి యనమల, పలువురు ప్రముఖులు

**తుని, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన తుని మండలం కుమ్మరి లోవ తపోవనం పీఠాధిపతి శ్రీసచ్చిదానంద సర స్వతి స్వామీజీ శుక్రవారం గుండెపోటుతో శివైక్యం అయ్యారు. ఆధ్యాత్మిక లోకానికి పున్నమి వెలుగులు నింపిన సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శివైక్యం చెందడంతో ఆయన భక్తులు,శిష్యులు శోక సంద్రంలో తల్లడిల్లిపోయారు. శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ శిష్యుడైన శ్రీసచ్చిదానంద సర స్వతి స్వామీజీ బ్రహ్మచర్య దీక్ష >>2

# 'పోలవరం' వచ్చేయేడు పూర్తి

## క్వాంటం నైపుణ్యాల కోర్సుకు 60వేలమందిపైగా రిజిస్ట్రేషన్
## గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి రాష్ట్రం రోల్‌మోడల్
## కానిస్టేబుల్ స్టైపెండ్ రూ.12,500కు పెంపు
## అసెంబ్లీలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి:** క్వాంటం నైపుణ్యాల కోసం కోర్సు నిర్వహిస్తుంటే 60 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీలో వెల్లడించారు. ప్రస్తుతం ఇందన రంగంలో ట్రాన్సిషన్ సమయం నడుస్తోంది. హరిత ఇంధనానికి డిమాండ్ ఉంది. గ్రీన్ హైడ్రోజన్ గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి ఏపీ, మహారాష్ట్ర ఓ మోడల్ అవుతాయి. ఏపీలో ప్రొజ్యూమర్ విధానంలో ఇంధన ఉత్పత్తి చేయాలని భావిస్తున్నాం. సోలార్ ప్యానళ్లను ఇళ్లపై ఏర్పాటు చేసుకుని గ్రిడ్‌కు అనుసంధానిస్తాం. సంజీవని ప్రాజెక్టుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. జనాభా నిర్వహణపై ఈ అసెంబ్లీ సెషన్లోనే పాలసీ తెస్తాం. డెమో గ్రాఫిక్ డివిడెండ్‌ను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా సంపద సృష్టించేందుకు అవకాశం ఉంటుంది. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఏడాదిలోగానే టీచర్లకు పోస్టింగులు ఇచ్చాం. కానిస్టేబుళ్ల నియామకాలు కూడా పూర్తి చేసి స్టైఫండ్‌ను రూ.4500 నుంచి రూ.12500 కు పెంచాం. భూమి ఇవ్వకుండా, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు, ఉద్యోగాలు ఎలా వస్తాయి? ప్రముఖ పరిశ్రమలకు భూములిస్తుంటే కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేలా ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీకే వచ్చాయంటే ఏపీ బ్రాండ్ విలువ ఏమిటో అందరూ అర్థం చేసుకోవాలి. గత పాలకుల వేధింపుల కారణంగా అమర్ >>2



బెంగళూరు సమీపంలో బోల్తా పడిన లారీ

# ప్రాణాలు తీసిన జాలీ రైడ్

## కారు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం
## మృతుల్లో ఆరుగురు మైనర్ విద్యార్థులే
## బెంగళూరు సమీపంలో దుర్ఘటన
## 150కి.మీ అతివేగంతో నడిపిన కారు

**హిందూపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** జాలీ రైడింగ్ కు వెళ్లి న మైనర్ విద్యార్థులు భీకరమైన రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందిన పెను విషాదం శుక్రవారం తెల్లవారుజామున బెంగళూరు రూరల్ జిల్లా పరిధిలో జాతీయ రహదారి పై చోటుచేసుకుంది. హృదయ విదారకరమైన ఈ దుర్ఘటనకు సంబంధించి వివరాలు ఇలాఉన్నాయి. బెంగళూరు నగరం కొత్తూరు చెందిన >>2

# కంటైనరే కాలయముడు!

## బైక్‌ను తప్పించబోయి, కారుపై బోల్తా పడిన కంటైనర్
## కారు నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి

**చిత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి ఇరువారం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజాము ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బెంగళూరు నుండి తన స్వగ్రామం గుడిపాల మండలం 189 రామాపురం గ్రామంకు కారులో వెళ్తున్న అనుదీపక్(18)ను కంటైనర్ రూపంలో కాలయముడు పరలోకానికి తీసుకెళ్ళిపోయాడు. ఉదయం నిర్మానుష్యంగా వున్న ప్రదేశంలో ఒక్కసారిగా వెళ్తున్న కారుపై కంటైనర్ బోల్తా పడటంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. భారీ బరువు వున్న కంటైనర్ మొత్తం కారుపై పడటంతో కారును డ్రైవ్ చేస్తున్న అనుదీపక్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. వివరాలిలా వున్నాయి. గుడిపాల మండలం 189 రామాపురం గ్రామంకు చెందిన అనుదీపక్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ >>2

# నీట్ ద్వారా నర్సింగ్ ప్రవేశాలు

## ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ.జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:**విద్యా రంగానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలను నీట్‌యూజీ పరీక్ష ఆధారంగా నిర్వహించాని నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు.20266 27 విద్యా సంవత్సరానికి గాను నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ పరీక్షను విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఉన్నతాధికారులతో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నర్సింగ్ ప్రవేశాలకు ఉత్తమ విధానంపై చర్చించారు. అనంతరం నీట్ పై కీలక నిర్ణయం తీసుకున్నారు.



# సంపద సృష్టికి బాటలు

>> పట్టించుకోవట్లేదని సీఎం మండిపడ్డారు.

**లడ్డూ కల్తీకి హెరిటేజ్‌కు ఏం సంబంధం:** రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కొంతమంది కావాలనే భక్తుల మనోభావాలు దెబ్బ తీస్తున్నారని దుయ్యబట్టారు. తిరుమల లడ్డూ కల్తీకి హెరిటేజ్ కు ఏం సంబంధమని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా హెరిటేజ్ అడగలేదన్న చంద్రబాబు పేపర్ ఉంది కదా అని పెద్ద హెడ్ లైన్ లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాండ్ డ్యామేజ్ చేస్తే హెరిటేజ్ కు నష్టం వస్తుందని వాళ్ల భావన అని, నాడు వివేకాను చంపి కూడా నారాసుర రక్తచరిత్ర అని రాశారని సీఎం గుర్తు చేశారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా 10 సూత్రాలు అమలు చేసి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా పని చేస్తున్నామని క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఈ విషయంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ రెండేళ్లలో సాధించిన విజయాలను గుర్తు చేసుకుని రాబోయే మూడేళ్ల లక్ష్యాలను నిర్దేశించుకుందామని అన్నారు. వైఎస్సార్సీపీకి 11 సంఖ్యతో అవినాభావ సంబంధం ఉందని అందుకే 11 నిమిషాలకే బయటకు వెళ్లారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం, భూ అక్రమాలను చంద్రబాబు ఎండగట్టారు.

**పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజముద్ర:** అప్పుడు చేసిన రెవెన్యూ పాపాలు కడగడానికే ప్రభుత్వానికి ఏడాది సమయం పట్టిందన్నారు. మద్యం విషయంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షి ంచబోమని సీఎం హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో డబ్బుల కోసం ప్రాణాలను తీసుకున్నారని, కోట్ల రూపాయల ప్రజాధనం దోచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఇసుక విధానంపైనా కూటమి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజముద్ర వేయించి ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దడానికి సుమారు ఏడాది పట్టిందని చెప్పారు. ఎవరూ ట్యాంపరింగ్ చేయని విధంగా చేసి లబ్ధిదారులకు అందించామని గుర్తు చేశారు. చట్టసభ అనేది ప్రజా దేవాలయమని విద్యార్థులను అసెంబ్లీకి అనుమతించటం ప్రత్యేకమని సీఎం చంద్రబాబు అన్నారు. ఇటీవల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారని, సభలో సభ్యులకంటే వారే బాగా ప్రసంగించారని గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయాల పట్ల అవగాహన కల్పించటంపై హర్షం వ్యక్తం చేశారు. రాబోయే మూడేళ్లలో ఉత్తరాంధ్రలో అన్ని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాయలసీమలోని ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. తెలుగురాష్ట్రాల మధ్యవివాదాల పరిష్కారానికి కూర్చొని మాట్లాడుకోవాలన్న చంద్రబాబు, నల్లమల సాగర్ కు తెలంగాణ ప్రభుత్వం అడ్డుపడటం సరికాదన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఉంటే అభివృద్ధి సులభంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**గుంటూరు నుంచి విజయవాడకు 6 గంటలా? ప్రజలు నరకం అనుభవించాలా?: చంద్రబాబు**

రాజకీయాల ముసుగులో నేతలే నేరాలు చేస్తే ఎలా అని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్, వైకాపా నేతలను ఉద్దేశించి అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ నేత రోడ్డుపైకి వస్తున్నాడంటే ఏం జరుగుతుందోననే భయం ప్రజల్లో నెలకుంటోందన్నారు. ఎక్కడికి వెళ్లినా దౌర్జన్యం, రోడ్డంతా బ్లాక్ చేయడం వంటివి చేస్తున్నారు. గుంటూరు నుంచి విజయవాడ వెళ్లాలంటే ఆరు గంటలా? ఆ సమయంలో ప్రజలు నరకం అనుభవించాలా? జాతీయ రహదారులపై సమావేశాలు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా పట్టించుకోవడం లేదు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సున్నితమైన సమస్య. దీనిపై ఎక్కువ మాట్లాడకూడదనుకున్నా. కొంతమంది కావాలనే భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. వేంకటేశ్వరస్వామి విషయంతో తెలిసి కానీ, తెలియక కానీ తప్పు చేయను. నిద్ర రానప్పుడు ఆయన్ను తలచుకుంటే వచ్చేస్తుంది. రాష్ట్రంలోని అన్ని ఆలయాలను ప్రక్షాళన చేశాం. తిరుమల లడ్డూ కల్తీకి హెరిటేజ్‌కు ఏం సంబంధం? ప్రభుత్వం నుంచి ఆ సంస్థ ఒక్క పైసా కూడా అడగలేదు. పత్రిక ఉంది కదా అని పెద్ద హెడ్‌లైన్లు పెడుతున్నారు. వాళ్ల ఉద్దేశం బ్రాండ్ దెబ్బతీయడమే. బ్రాండ్ డ్యామేజ్ చేస్తే హెరిటేజ్‌కు నష్టం వస్తుందనేని వాళ్ల భావన అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.



శుక్రవారం తపోవనం స్వామీజీ పార్థివ దేహం వద్ద నివాళి అర్పిస్తున్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి యనమల

# 'తపోవనం' స్వామీజీ శివైక్యం

>> తీసుకుని జీవితకాలమంతా ఆధ్యాత్మిక సేవలో కొనసాగారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు, హిందూమత అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారు. స్వామీజీ అనుగ్రహ భాషణం ద్వారా ఎందరో ఉద్యోగ, వ్యాపార, రాజకీయ ప్రముఖులు స్వామీజీకి పరమా భక్తులుగా మారారు. తెలంగాణ రాష్ట్రంలో ధర్మపురిలో మొదట ఆశ్రమాన్ని ప్రారంభించిన సరస్వతీ స్వామీజీ ఆంధ్రప్రదేశ్లోని కాకినాడ జిల్లా తుని వద్ద తాండవ నది పరివాహక ప్రాంతంలో తపోవనం ఆశ్రమాన్ని స్థాపించారు. ఈ ఆశ్రమాల ద్వారా స్వామీజీ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామీజీ ఆశ్రమంలో పలువురు దేవతామూర్తుల ఆలయాలు, వేద విద్యార్థుల కోసం వేదపాఠశాల, గోసంరక్షణ కోసం గోశాల ఏర్పాటుచేసి ఆధ్యాత్మిక సేవలో తరించారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా, భారత దేశం నలు మూలల నుండి ఎందరో భక్తులు స్వామీజీని దర్శించి తరిస్తారు. స్వామీజీ శివైక్యం పొందిన విషయం తెలుసుకున్న భక్తులు వేలాదిగా తరలివచ్చి ఆయన పార్థివదేహాన్నిదర్శించారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు స్వామీజీని దర్శించిన వారిలో ఉన్నారు. తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తపోవనం చేరుకుని స్వామీజీ పార్థివ దేహాన్ని దర్శించి కన్నీటి పర్యంతమయ్యారు. మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు స్వామీజీ పార్థివ దేహాన్ని దర్శించి నివాళులర్పించారు.

# పార్లమెంటు మార్చి 9కి వాయిదా

>> దం, ప్రధాన మంత్రి సీటు వద్ద ఆందోళన చేయడం ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రధానిపై దాడికి కుట్ర అంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభలో ప్రకటన చేయడం రాజకీయ వివాదానికి దారితీసింది. దీనిపై అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటలయుద్ధం సాగింది. అంతటితో ఆగకుండా స్పీకర్ చాంబర్‌లోకి విపక్ష ఎంపీలు చొరబడి స్పీకర్‌ను, ప్రధాని మోడీని హెచ్చరిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వీడియోలు విడుదల చేసి ఆరోపణలు గుప్పించారు. దీనిపైనా ఇరుపక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగాయి. స్పీకర్‌పై విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చాయి. ఈ తీర్మానంపై చర్చ ముగిసేంతవరకు తాను సభకు హాజరు కానని స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. అవిశ్వాస తీర్మానంపై మార్చి 9న చర్చకు అనుమతించే అవకాశముందని స్పీకర్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చలో భాగంగా ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రస్తావించడం రాజకీయ దుమారం చెలరేగింది. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి రాజీనామా చేయాలంటూ ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. తానే తప్పు చేయలేదని అటు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా లోక్‌సభలో ఏ విధమైన చర్చ లేకుండానే 13 రోజులు సభ సాగింది. అటు రాజ్యసభలో ఆరంభంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య రభస చోటుచేసుకున్నా, ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపైనా, బడ్జెట్‌పైనా చర్చ సాగింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో పాల్గొని ప్రసంగించారు. బడ్జెట్‌పైనా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం(తాత్కాలిక)పై వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ ప్రకటన చేశారు. శుక్రవారం ఉభయ సభల్లో ఎలాంటి చర్చల్లేకుండానే వాయిదా పడటం విశేషం. దీంతో బడ్జెట్ సమావేశాలు తొలివిడత ముగిశాయి. మార్చి 9నుంచి రెండో విడతసమావేశాలు ఆరంభం కానున్నాయి.

## బడ్జెట్ నేడే

>> శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్రరాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బడ్జెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్స హించేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. తల్లికి వందనం, దీపం2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది.

# 'పోలవరం' వచ్చే యేడు పూర్తి

>> రాజా బ్యాటరీస్ పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయింది. విశాఖలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ పరిశ్రమలు వస్తున్నాయి. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నారు. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ కూడా రూ.70 వేల కోట్లతో రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. భాగస్వామ్య సదస్సులో రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులు 610ఎంఓయూలు చేసుకున్నాం. మొత్తంగా రూ.20లక్షలకోట్ల పెట్టుబడులద్వారా 23లక్షల ఉద్యోగాలు వస్తాయి. 20లక్షల ఉద్యోగాలను ఐదేళ్లలో ఇస్తామన్న హామీని నిలబెట్టుకుంటాం.

**సాగునీటి ప్రాజెక్టులన్నింటిని మరో మూడేళ్లలో పూర్తి చేసి తీరుతాం**

గత పాలకులు సమర్థంగా నీటి నిర్వహణ చేపట్టలేదు. ఎన్టీఆర్ హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ లాంటి ప్రాజెక్టు లతో రాయలసీమలో ప్రాజెక్టులు చేపట్టారు. వచ్చే మూడేళ్లలో ఉత్తరాంధ్రలో అన్ని ప్రాజెక్టులకూ పూర్తి చేస్తాం. పోలవరం-వంశధారను లింక్ చేస్తాం. ఎడమ కాలువ ద్వారా ఈ ఏడాది అనకాపల్లి వరకూ నీటిని తీసుకెళ్తాం. హంద్రీనీఈవా కాలువలను పూర్తి చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకువెళ్లాం. చెరువులు నింపాం. రాయచోటికి కూడా నీరు తీసుకెళ్లాం. గాలేరు నగరి ద్వారా వచ్చే ఏడాది కడపకూ నీళ్లు తీసుకెళ్తాం. ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎమ్మెల్యేలు కూడా ప్రత్యక్షంగా చూడాలని కోరుతున్నాను. గత పాలకులు రాజకీయ కక్షతో పోలవరాన్ని గోదాట్లోనే ముంచేశారు. డయాఫ్రాం వాల్ ధ్వంసం చేశారు. ఇప్పుడు రూ.1000 కోట్లతో మళ్లీ డయాఫ్రాం వాల్ నిర్మిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నెలలోగా జాతికి అంకితం చేస్తాం. ఏటా 3500 టీఎంసీల గోదావరి వరద జలాలు సముద్రంలోకి వృధాగా పోతున్నాయి. అందులో 200 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తరలిస్తాం. తెలంగాణా అభ్యంతరం చెప్పటం సరికాదు. తెలుగుజాతిగా రెండు రాష్ట్రాలూ నీటిని సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైతే ఈ అంశాన్ని సంప్రదింపుల ద్వారా ఓ నిర్ణయానికి రావచ్చు. ఒకటి రెండు అంశాలు పరిష్కారం అయితే కూర్చుని మాట్లాడుకుందామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ప్రతిపాదించారు. నల్లమల సాగర్ ప్రాజెక్టుటకు అడ్డుపడటం సరికాదు. పిఎంఆర్‌సిఎస్ రూ.1 లక్ష కోట్లతో రాయలసీమను ఉద్యాన హబ్‌గా తయారు చేస్తాం. రూ.30 వేల కోట్ల మేర ప్రభుత్వ నిధులు రూ.70వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడులతో సీమలో హార్టీకల్చర్ అభివృద్ధి చేస్తాం. ప్రస్తుతం ఏడాదికి 400 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఫలాల ఉత్పత్తి జరుగుతోంది. భవిష్యత్తులో 1000 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తులకు కేంద్ర స్థానంగా రాయలసీమ ఎదుగుతుంది. అక్వా కల్చర్ గత పాలనలో ఒడిదుడుకులు ఎదుర్కొంది. రూ.1.50 యూనిట్ చొప్పున విద్యుత్‌ను ఆక్వాకు ఇస్తున్నాం. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆక్వాకల్చర్ హబ్‌గా మన ప్రాంతం తయారవుతుంది. ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో డబ్బులు చెల్లించింది కూడా కూటమి ప్రభుత్వమే. కోకోనట్, కోకో, కాఫీ లాంటి పంటలపై కేంద్రం దృష్టి సారించింది. దీనిపై మరింత శ్రద్ధపెట్టి వ్యాల్యూ అడిషనల్ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఏపీలో రైతుల ఆత్మహత్యకు నివారించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి ఘటననూ ఆడిట్ చేయిస్తాం. విద్యార్థులు కూడా ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు ఎదుర్కోవాలి. ఆత్మహత్యలు దేనికీ పరిష్కారం కాదని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. లాజిస్టిక్స్ రంగంలో పెనుమార్పులు సాధించేలా నిర్ణయం తీసుకుంటున్నాం. రైల్వే రంగంలో రూ.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రెండేళ్లలో ఇచ్ఛాపురం నుంచి దిగువ వరకూ నాలుగు లేన్ల ట్రాక్ వచ్చే అవకాశం ఉంది. తద్వారా కార్గో ప్రయాణికుల మార్గాలు విస్తృతం అవుతాయి. జాతీయ రహదారులు కూడా పెద్దఎత్తున నిర్మించేలా కేంద్రం ప్రాజెక్టులు ప్రతిపాదించింది. డబుల్ ఇంజన్ సర్కారులో ట్రిబుల్ ఫలితాలు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను రూ.4 వేల కోట్లతో అనుసంధానిస్తున్నారు.

**మరో మూడేళ్ళు విద్యుత్తు చార్జీలు పెంచేది లేదు**

గత పాలకులు రూ.32,166 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాంకం వల్ల విద్యుత్ వాడకుండానే సోలార్, విండ్ ప్రాజెక్టుల్లో రూ.9వేల కోట్లు కట్టాల్సి వచ్చింది. ఫ్యూయల్ సర్చార్జి భారం రూ.12,617 కోట్ల మేర వేశారు.

మొత్తంగా రూ.1,22,422 కోట్లను గత ప్రభుత్వం విద్యుత్ బకాయిలు పెట్టింది. 78 నుంచి 90 శాతం మేర కరెంటు ఛార్జీల భారం ప్రజలపై వేశారు. మేం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పాం దానికి కట్టుబడి ఉన్నాం. రూ.4860 కోట్ల ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఆ భారాన్ని ప్రభుత్వమే కడుతున్నాం. వచ్చే మూడేళ్లలోనూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు.

## ఎపిఎస్ ఆర్టిసీ విసి, ఎండిగా సీనియర్ ఐపిఎస్ అధికారి ఎన్.బాలసుబ్రహ్మణ్యం

**విజయవాడ.ఫిబ్రవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీ విసి,ఎండీగా సీనియర్ ఐపిఎస్ అధికారి ఎన్.బాలసుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన తక్షణమే బాధ్యతలను చేపట్టాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పదవిలో ప్రస్తుతం అదనపు బాధ్యతలపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముద్దా తిరుమల కృష్ణబాబు వ్యవహరిస్తున్నారు.

# కంటైనరే కాలయముడు!



కంటైనర్ కింద చితికిపోయిన కారును జెసిబి సహాయంతో వెలుపలికి తీస్తున్న దృశ్యం

>> ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అనుదీపక్ శుక్రవారం తన సొంత గ్రామం 189 రామాపురం రావాలని భావించి బెంగళూరులో శుక్రవారం తెల్లవారుజాము బయలు దేరాడు. మరో 15 నిముషాల పాటు ప్రయాణం సాగి వుంటే అనుదీపక్ సురక్షితంగా స్వగ్రామంలో వున్న తన ఇంటికి చేరుకునే వాడు. అయితే కంటైనర్ కాల యముడి రూపంలో వచ్చి అనుదీపక్‌ను పంలోకాలకు తీసుకెళ్ళిపోయింది. చిత్తూరు-గుడియాత్తం రోడ్డు వైపు నుండి ఒక ద్విచక్ర వాహనదారుడు నిర్లక్ష్యంగా వాహనంను నడుపుతూ వస్తుండటం, ఆ సమయంలో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో భారీ కంటైనర్‌తో పాటు ఒక కారు వెళ్తున్నది. ఈ క్రమంలో కంటైనర్ డ్రైవర్ చిత్తూరు-గుడియాత్తం రహదారి వైపు ద్విచక్ర వాహనంలో నిర్లక్ష్యంగా వస్తున్న అతనిని రక్షించడానికి కంటైనర్‌ను కొద్దిగా ప్రక్కకు తిప్పాడు. అయితే కంటైనర్ అదుపు తప్పి ఒక్కసారిగా ప్రక్కనే వెళ్తున్న కారుపై బోల్తా పడింది. ఒక్కసారిగా కంటైనర్ మొత్తం కారుపై పడటంతో కారు అక్కడికక్కడే నుజ్జు నుజ్జు అయ్యింది. కారు మొత్తం కంటైనర్ కింద చితికిపోయింది. కారులోనే అనుదీపక్ వుండటంతో స్థానికులు సత్వరం జెసిబిని రప్పించి కంటైనర్ కింద చిక్కుకున్న కారును వెలికితీయడానికి సర్వశక్తులు ఒడ్డారు. చివరికి కంటైనర్ కింద నుండి కారును తీయగా డ్రైవింగ్ సీటులో అనుదీపక్ అమాయకంగా కుర్చొని వున్నట్లు వున్నాడు. అనుదీపక్ షాక్‌లో వున్నాడని సత్వరం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స అందిస్తే ప్రాణాపాయం వుండదని భావించి స్థానికులు 108కు ఫోన్ చేసి పిలిపించి అనుదీపక్‌ను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అయితే అనుదీపక్ అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించడంతో అనుదీపక్ మృతదేహంను పోస్టుమర్టం నిమిత్తం పోస్టుమార్టం గదికి తరలించారు.

## అంబటి మురళికి నోటీసులు ఇవ్వండి:జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

**విజయవాడ.ఫిబ్రవరి13,ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి నేత అంబటి రాంబాబు సోదరుడు మురళికి బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు పోలీసులను ఆదేశించారు. పిటిషనర్‌పై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు నిరూపణ జరిగితే ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని గుర్తు చేశారు. ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేశారు. గుంటూరులోని బజరంగ్ జూట్ మిల్ భూములకు సంబంధించి యాజమాన్యం, కార్మికుల మధ్య జరుగుతున్న వివాదంపై తాను దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారని, కులం పేరుతో దూషించారన్నారు.

## ముఖ్యమంత్రి తల్లిపై అంబటి వ్యాఖ్యలు చిన్న మాటలా : మంత్రి లోకేశ్

**విజయవాడ.ఫిబ్రవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** "ఒక తల్లిని అవమానిస్తూ మాట్లాడితే అవి రెండు చిన్న మాటలు ఎలా అవుతాయి?" అంటూ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి తల్లిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబును అరెస్ట్ చేయడాన్ని సమర్థించారు. వైసీపీ అధినేత జగన్ ఈ అంశాన్ని చిన్నదిగా చూపే ప్రయత్నం చేస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. శుక్రవారం నాడు శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, బొమ్మి ఇజ్రాయేల్ చేసిన ఆరోపణలను లోకేశ్ గట్టిగా తిప్పికొట్టారు. అధికార, ప్రతిపక్ష సభ్యులెవరైనా మహిళలను కించపరిచేలా మాట్లాడకూడదని, అలాంటి వారిని ఎవరూ ప్రోత్సహించవద్దని ఆయన సభకు విజ్ఞప్తి చేశారు. "ఇప్పుడైనా చెప్పండి, అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు తప్పా ఒప్పా? మీరు దాన్ని సమర్థిస్తున్నారా?" అని వైసీపీ సభ్యులను సూటిగా ప్రశ్నించారు. జగన్ రెడ్డి తల్లి అయినా, ఎవరి తల్లైనా, అక్కాచెల్లెళ్లయినా వారిని కించపరిస్తే ప్రజాప్రభుత్వం సహించబోదని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారని లోకేశ్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "మాజీ మంత్రి అంబటి రాంబాబు గౌరవ ముఖ్యమంత్రి గారి తల్లిని అవమానించారు. ఇది వాస్తవమా కాదా? ముఖ్యమంత్రి తల్లిని అంత దారుణంగా మాట్లాడితే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా? అలాంటి వాళ్లను వదిలిపెడతామా? సభ లోపలైనా, బయటైనా మహిళలను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని స్పష్టం చేశారు. మహిళల గౌరవానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పునరుద్ఘాటించారు.

# ప్రాణాలు తీసిన జాలీ రైడ్





తుక్కుతుక్కు అయిన ఎక్స్ యు వి 700 కారు, మృతులు అయాన్, భరత్,అశ్విన్, జార్జ్ (ఫైల్)

>> అయాన్(16), తన మిత్రులైన భరత్ (18), జార్జ్(17), అశ్విన్ నాయర్ (17), షరీఫ్ (16) మరొక విద్యార్థి పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ చదువుతున్నారు. కార్ డ్రైవింగ్ పై విపరీతమైన మోజు ఉన్న అయాన్ తన మామకు చెందిన ఎక్స్.యు.వి. 700 కారును ఇంట్లో వారికి చెప్పకుండా తీసుకొని తన మిత్రులతో కలిసి గురువారం అర్ధరాత్రి జాలీ రైడింగ్.. అంటే గంటకు 150 కిలోమీటర్లు పైన వేగంతో కారు నడుపుతూ బయలుదేరారు. హుసకోట దేవనహల్లి జాతీయ రహదారి పై సత్యవార గ్రామ సమీపంలోని టోల్గేట్ దాటుకొని కారు అతివేగంగా వెళుతూ ముందువైపు వెళుతున్న హీరో హోండా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఓ కంపెనీలో డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్తున్న ద్విచక్ర వాహన దారుడు గగన్ గాల్లోకి ఎగిరిపడి దుర్మరణం చెందాడు. బైకును ఢీ కొట్టగానే అదుపు తప్పిన కారు ఎదురుగా ముందువైపు వెళుతున్న క్యాన్టర్ లారీని బలంగా ఢీకొంది. కారు వేగంగా ఢీకొనడంతో లారీ వెనుక చక్రాలు జాయింట్ వీల్ ఊడిపోయి రోడ్డుపై పడిపోయాయి అంతేకాకుండా లారీ అదుపుతప్పి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడిపోయింది. ఊడిన లారీ చక్రాలు రోడ్డుపై వేగంగా వెళుతూ రోడ్డు పక్కన ఆగి ఉన్న బ్రీజ్ కారును ఢీకొట్టగా అందులో ఉన్న వారికి స్వల్పంగా గాయాలు తగిలాయి. అతివేగంతో వెళ్లిన ఎక్స్ యు వై 700 కారు హైవేపై 500 మీటర్ల దూరం వెళ్లి నుజ్జు నుజు అయి పడిపోయింది. ఈ భీకరమైన చైన్ యాక్సిడెంట్ లో కారులో ప్రయాణిస్తున్న టీనేజ్ విద్యార్థులందరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కార్ డ్రైవింగ్ చేసిన అయాన్ కు సహా ఎవరికీ డ్రైవింగ్ లైసెన్స్ లేదని బెంగళూరు రూరల్ ఎస్పీ చంద్రకాంత్ మీడియాకు తెలిపారు. ఈ దుర్ఘటన శుక్రవారం తెల్లవారుజామున 4 15 నుంచి 4:30 మధ్యలో జరిగిందని ఆయన చెప్పారు. కారులో ఎయిర్ బ్యాగులు ఓపెన్ అయినప్పటికీ ఏ ఒక్కరు కూడా ప్రాణాలతో బయటపడలేదు. కారు డ్రైవింగ్ పై అయాన్ కు విపరీతంగా మోజు ఉండేదని, గతంలో తాను డ్రైవింగ్ చేసే సమయంలో కారు స్పీడోమీటర్ వీడియో తీసి తమకు షేర్ చేసేవాడని అతని మిత్రులు తెలిపారు. జాలి రైడింగ్ కోసం అతివేగంతో డ్రైవింగ్ చేసి అర్ధాంతరంగా తనువులు చాలించి, బాధిత కుటుంబాల్లో తీరని విషాదం నింపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హోసకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి ఆవరణ వద్ద తమ వారి మృతదేహాలను చూసి వారి కుటుంబీకుల రోదనలు చూపరుల హృదయాన్ని కలచివేశాయి.

# సాగరమాల ద్వారా హార్బర్ల ఆధునీకరణ

**- ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి**

**- ముత్యాలమ్మపాలెం మిని జెట్టిపై సిఐసిఈఎఫ్ ప్రీ-ఫిజిబిలిటి అధ్యయనం**

**- శాసనసభలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు సమాధానం చెప్పిన మంత్రి అచ్చెన్నాయుడు**



**సచివాలయం,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త :** పిఎంఎంఎస్‌వై (ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన), సాగరమాల వంటి కేంద్ర పథకాల సహకారంతో రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్నామని వ్యవసాయ, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్‌బాబు పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో మిని జెట్టి/ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కోస్తా ప్రాంతాభివృద్ధి, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ స్థితిగతులు, ముత్యాలమ్మపాలెం ప్రాజెక్టు పురోగతి గురించి స్పష్టత ఇవ్వాలని కోరారు. దీనికి సమాధానంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి 12కోస్తా జిల్లాల్లో కలిపి 1053.07కిమీ తీరప్రాంతం కాగా, 350ల్యాండింగ్ సెంటర్లు, ఫిషింగ్ హార్బర్లు గుర్తించబడ్డాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 10ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టామని, 2020సంవత్సరం జూలై 15నుంచి ఫిషింగ్ హార్బర్లు మత్స్యశాఖ నుంచి పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖకు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. తొలిదశలో జువ్వలదిన్నె, ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్లు నిర్మాణంలో ఉండగా, రెండో దశలో బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, వోడరేవు హార్బర్లు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. పిఎంఎంఎస్‌వై, సాగరమాల, విశాఖపట్టణం పోర్టు అథార్టి సహకారంతో విశాఖ హార్బర్ ఆధునీకరణ పనులు రూ.178.51కోట్లతో కొనసాగుతున్నాయని, కాకినాడ హార్బర్ ఆధునీకరణకు రూ.58.95కోట్లతో డిపిఆర్ సిద్ధం చేయడానికి సిఐసిఈఎఫ్ అంగీకరించిందని వివరించారు. అలాగే ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల విషయంలో అంతర్వేది పల్లిపాలెం, గుండాయపాలెంలో జెట్టీ సౌకర్యాలతో కార్యకాలపాలు సాగుతున్నాయని, భావనపాడు ఎఫ్ఎల్‌సి కు నది ముఖద్వారం స్థిరీకరణకోసం అవసరమైన సాంకేతిక చర్యలను ఏపిఎంబి కు తెలియజేశామని చెప్పారు. పిఎంఎంఎస్‌వై కింద రూ.126.91కోట్లతో దొండువాక, ఉప్పలంక, భీమిలి, రాజయ్యపేట, చింతపల్లి, రాయదరువులో ఎఫ్ఎల్‌సి అభివృద్ధి టెండరింగ్ దశలో ఉందన్నారు. మచిలీపట్నం, బియ్యపుతిప్ప ఎఫ్ఎల్‌సి పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం ప్రాంతానికి సంబంధించి ప్రజల అభ్యర్థన మేరకు సిఐసిఈఎఫ్ ద్వారా ప్రీ-ఫిజిబిలిటీ అధ్యయనాలు నిర్వహించబడినాయి. తుది నివేదికలు అందాల్సి ఉన్నాయనినివేదికలు వచ్చిన వెంటనే సాంకేతిక సాధ్యత ఆధారంగా మిని జెట్టీ/ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## వారం - వర్జ్యం

14-02-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
ద్వాదశి మ.3.58
పూర్వాషాఢ సా.6.12
వర్జ్యం : రా.2.43-4.25
దు.ఉ.6.35-8.09
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఓర్పు, నేర్పులతోనే కార్యసాధన జెతుంది. సహనమునకు పరీక్షలు ఎదురు అవుతాయి. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**వృషభం:** ముఖ్యముగా గంటలు - గంటలుగా ప్రతీ విషయంలో ఆలోచించే విధానానికి స్వస్తి చెప్పండి.

**మిథునం:** మీ సలహాలు, నైపుణ్యము మీకుకాక ఇతరులకు ఉపయోగ పడతాయి. వస్తు భద్రత పట్ల జాగ్రత్త.

**కర్కాటకం:** మీకు రావలసిన ప్రతిఫలము కొద్దిగా మాత్రమే చేతికి అందుతుంది. సోదరులు నుండి సాయం అందుకుంటారు.

**సింహం:** న్యాయబద్ధముగా రావలసిన ధనము వాయిదాల పద్ధతిలో డొనేషన్స్‌ను స్వీకరించినట్లుగా తీసుకోవలసి వస్తుంది.

**కన్య :** గత అనుభవం ద్వారా కొన్ని సమస్యల నుండి తప్పించుకోగలుగుతారు. శుభవార్తలు అందుకుంటారు.

**తుల:** కుటుంబ సభ్యుల అభివృద్ధికై మీరు ఎక్కువ శ్రమ చేయవలసి వస్తుంది. ఆర్థిక పరిస్థితి సాధారణంగా వుంటుంది.

**వృశ్చికం:** మీ గురించి చెడుగా ప్రచారం చేసే వ్యక్తుల నుండి దూరంగా వుండడం మంచిది. ఉద్యోగులకు బదిలీలు.

**ధనుస్సు:** అనుకూల ఫలితాలు ప్రతికూల ఫలితాలు సరిసమానంగా ఉంటాయి. పనులు సకాలంలో పూర్తి.

**మకరం:** బాధ్యతల వెనుక ఉన్న క్లిష్టమైన సమస్యలు ఒక్కొకటిగా మీ ముందుకు వస్తాయి. కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**కుంభం:** నిర్వహించలేక పారిపోతారని ఇతరులు వేసిన అంచనాలు తలక్రిందులు చేస్తారు. శ్రమ అధికం ఉంటుంది.

**మీనం:** నూతన బాధ్యతలు సంతోషం కలిగిస్తాయి. వాక్చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుంటారు. వస్త్ర లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

వార్త

విజయానికి రెండు ప్రధాన సూత్రాలున్నాయి. ఆచరణకు ముందు ఆలోచించాలి. ఆ తరువాత ఆలోచనలు ఆత్మవిశ్వాసంతో ఆచరణలో పెట్టాలి.

-రవీంద్రనాథ్ ఠాగూర్

# 'కంగాళీ' ఒప్పందమేనా?

రెండు దశాబ్దాలు... 

రెం డువేల నలభైఏడు నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలని ఆశిస్తున్న భారత్ తన వాణిజ్య విస్తరణకు ఎంతో ప్రాధాన్యతనిస్తోంది. రష్యా నుండి ముడి చమురు కొంటూ భారత్ ఉక్రెయిన్ రష్యాల యుద్ధానికి ఆర్థిక సంపత్తిని సమకూరుస్తోందన్నది అమెరికా వ్యాఖ్య. అందుకే రష్యా చమురు కొనుగోలుకు స్వస్తి చెప్పాలని శ్వేతసౌధాధినేత ట్రంప్ హుకుం జారీ చేశారు. యూరోపియన్ యూనియన్‌తో పాటు మరికొన్ని దేశాలతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు చేసుకుని భారత్ వాణిజ్య విపణిని విస్తరించింది.యుఎఇ, న్యూజిలాండ్, ఒమన్, బ్రిటన్ వంటిదేశాలతో ఈ ఒప్పందాలు ఉభయ తారకంగా ఉంటాయని విశ్వసిస్తోంది. ఎఫ్.టి.ఏ లన్నిటిలోనూ అమెరికాతో చేసుకున్న ఒప్పందాల్లో ఎన్నో మెలికలున్నాయని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఎన్నో సందేహాలకు జవాబు దొరకడం లేదు. ముందుగా ఏక పక్షంగా వాణిజ్య ఒప్పంద విశేషాలను ట్రంప్ ఎంతో దూకుడుగా ప్రకటించారు. ఆ వెనువెంటనే భారత్ ఆ ప్రతిపాదనలపై సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. జాతి జనులలో చులకన కాకుండా భారత్ ఆ మేరకు ఎన్నో వివరణలిచ్చుకుంది. ప్రధానంగా వ్యవసాయోత్పత్తులకు సంబంధించి పోటీపడే పరిస్థితి వస్తే భారతీయ రైతాంగం కుదేలయిపోతుంది. దీని విషయంలో భారత ప్రధాని నరేంద్రమోడీ చెప్పిన దానికి, ఆ తర్వాత అమెరికాతో ఒప్పంద విషయాలు బయటపడ్డాక ఎన్నో వ్యత్యాసాలున్నాయని అవన్నీ భారతీయ రైతు ప్రయోజనాలకు దెబ్బేనని తేలింది. 'ఒప్పందాలు వేరు, పర్యవసానాలు వేరు' అనే ట్రంప్ ధోరణిని నిలువరించేవారు లేరు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ఎర్రజొన్నలు, సోయాబీన్ నూనె, డ్రైఫ్రూట్స్‌ను భారతీయ మార్కెట్‌కు అనుమతిస్తే ఇక్కడి రైతు ఉత్పత్తులను కొనేవారెవరూ లేరు. దాని వలన పౌల్ట్రీ, డైరీ రంగాలు నష్టపోతాయి. ఒకప్పుడు 5 శాతమే ఉన్న సుంకాలు పెరిగి పెరిగి తిరిగి ట్రంప్ దయాదాక్షిణ్యాలతో తగ్గి 18కి చేరాయి. ఇదంతా ఈ మధ్యకాలంలో వచ్చిన పరిణామాలు. ఎలా విశ్లేషించినా ఇవి రైతు ప్రయోజనాలకు భంగం కలిగించేవే. భారత్ నుంచి ఈ ఒప్పంద అంశాలపై తీవ్ర వ్యతిరేకతలు వ్యక్తమైన సందర్భంలో మళ్లీ ఉభయ దేశాలు 'ఫ్యాక్ట్ షీట్‌ను విడుదల చేయడం ప్రత్యేకించి చర్చించాల్సిన అంశం. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి కట్టు బడి ఉన్నామంటూనే భారత్ నేతలు అదే సమయంలో భారతీయ రైతుల ప్రయోజనాలకు ఏ మాత్రం భంగం కలిగించని రీతిలో తమ ముసాయిదా ఒప్పందం తయారైందని భారత్ నమ్మబలుకుతోంది. అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులు భారత్‌ను ముంచెత్తితే భారత్ పరిస్థితి ఏంటని విపక్షనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో కేంద్రంపై విరుచుకపడ్డారు. వ్యవసాయం, ఇంధన రంగాలను అమెరికాకు అప్పగించారంటూ దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్‌పై చర్య సందర్భంగా రాహుల్ అన్నమాటల్ని అధికార పక్షం ఎంత తిప్పికొట్టినా భారతీయ రైతాంగంలో ఉన్న అనుమానాలు తొలగిపోలేదు. అమెరికా వస్తూత్పత్తులపై భారత్ టారిఫ్‌లు సున్నా స్థాయికి చేరడం ఖజానాకు నష్టమే. మార్కెట్‌లో పోటీలో భారత్‌తట్టుకోలేని పరిస్థితి ఉంటుంది. ఇప్పటికీ భారత్ కొన్ని ప్రాధాన్య రంగాల్లో స్వయం సమృద్ధి సాధించలేదు. అమెరికా దిగుమతులు 46 బిలి యన్ డాలర్ల నుంచి 146బిలియన్ డాలర్లకు పెరుగుతున్నాయంటే అది ఎంతో ఆందోళనకరమైన విషయం. పైగా ట్రంప్ బెదిరింపులకు ఏమాత్రం లొంగకపోయినా సుంకాల బాదుడు ఉంటుంది. ఇతర దేశాలతో సౌహార్ద సంబంధాల విషయాల్లో ఏ మాత్రం మొహమాటం కానీ, అవగాహన కాని దేశాధినేత ఎవరైనా ఉన్నారంటే అది ట్రంపే. అమెరికా ముందుగా వదిలిన 'ఫ్యాక్ట్‌షీట్'ను మళ్లీ మార్పు చేసి 'సవరణ ఫాక్ట్‌షీట్'ను విడుదల చేయడం నేపథ్యమేమిటో ఎవరికీ అర్థంకాదు. సవరించి జాబితాలో 'కొన్ని తృణధాన్యాలు' అనేపదాన్ని తొలగించింది.అమెరికా ఎగుమతులకు భారత్ 'కట్టుబడి' ఉందన్న పదాన్ని 'కొనాలని భావిస్తోంది' అని మార్చారు. కేవలం భారత్‌లో పెరుగుతున్న వ్యతిరేకతలను చల్లబరచడానికే ఈ మార్పులుగా స్పష్టమవుతోంది. మరికొద్ది కాలం తర్వాత ట్రంప్ భారత్‌కు మరిన్ని షరతులు పెట్టబోదన్న గ్యారంటీ ఏమీ లేదు. అమెరికా నుంచి తృణధాన్యాలను దిగుమతి చేసుకుంటే భారతీయ రైతాంగం ఎంతగానో నష్టపోతుంది. ఒకపక్క ప్రభుత్వం తృణధాన్యాలు మంచి ఆహారమని, వాటి సాగుకు ప్రోత్సహిస్తోంది. అదే సమయంలో తృణధాన్యాలు భారత్‌కు వచ్చిపడితే భారత్ రైతుకు అధోగతే. భారత్‌తో వాణిజ్య ఒప్పందమంతా తప్పుల తడక అని ఫ్యాక్ట్‌షీట్‌లు చెబుతున్నాయి. ఈ ఒప్పంద విషయాల్లో భారతీయులు ఆందోళన పడే పలు అంశాలకు తాజా ఫ్యాక్ట్‌షీట్‌లో సమాధానం లభించినట్లే. భారతీయుల్లో తమ దేశ నేతల్ని చులకన చేసేందుకు ఇలాంటి కంగాళీ ఒప్పందాలను అమెరికా ఆఘమేఘాల మీద ప్రకటించేసింది. మద్యం తయారీకి అవసరమైన ఎర్రజొన్నలు,డ్రైఫ్రూట్, తాజా పండ్లు, ఫలరసాలు, సోయానూనె, వైన్ తదితరాలపై భారత్ 'జీరో' సుంకాల తో కొనుగోలు చేస్తుందని చెప్పేశారు. ఆనక భారత్‌లో అలజడి బయలుదేరడంతో భారత్ నేతలు అమెరికాతో మాట్లాడి తాజాఫ్యాక్ట్ షీట్‌ను విడుదల చేయించినట్లు అర్థం చేసుకోవాలి. భారత్ లక్ష్యాలకు భిన్నంగా అమెరికా ప్రకటనలు సామాన్య ప్రజానీకానికి సైతం గందరగోళ పరిస్థితిలోకి నెట్టివేసింది. దీన్నుంచి గట్టెక్కడానికి కొంత కాలం పట్టేట్టుంది.

# రాస్తారోకోలతో జనం విలవిల!

*ఒక్కరేమిటి రాస్తారోకోల్లో ఇరుక్కొని లక్షలాది మంది పడే మానసిక ఒత్తిడి వర్ణనాతీతం. గంటల తరబడి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్నారు. ఎంతసేపు స్తంభింప చేస్తే అంత గొప్పగా చెప్పుకునే పరిస్థితులు దాపురించాయి. ఈ రాస్తారోకోల పట్ల ప్రజల్లో వ్యతిరేక భావం పెరిగిపోతున్నది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల న్యాయస్థానాలు, దేశ అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసాయి. ప్రభుత్వాలు కూడా సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నాయి. తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడంలో ఏమాత్రం తప్పులేదు. కానీ అందుకో పద్ధతి ఉండాలి. దానినే ఆచరించాలి. అంతేకానీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తామనడం సమంజసం కాదు. ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏ రకంగా చూసినా న్యాయం కాదు. పెద్దలందరూ విజ్ఞతతో ఆలోచించాలి.*

దామెర్ల సాయిబాబ

ఎం కిపెళ్లి సుబ్బిచావుకు వచ్చినట్లుంది. ఎందరో నాయకుల ఆత్మబలిదానంతో, నిర్విరామకృషితో సాధించి పెట్టిన సమ్మె, రాస్తారోకో, ధర్నాలు లాంటి నిరసన కార్యక్రమాలు కొన్నిసార్లు సామాన్యుల జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఏ నిబంధనలంటూ లేకుండా ఎవరికి వారు, ఎక్కడపడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు ఈ కార్యక్రమాలు చేపడుతుండడంతో మామూలు ప్రజలు అల్లాడిపోతున్నారు. రానురాను ఈ సంస్కృతి పెరిగిపోతుండడంతో ఆందోళన కలిగించే అంశం. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం ఒక నిర్దిష్ట కార్యక్రమం ప్రకారం ముందు తెలిపి సమ్మెలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిర్వహించడంలో కొంత అర్థంఉంది.అందుకు అన్ని వర్గాలు సహకరించాల్సిన అవసరం కూడా ఉంది. ఇందులో మరో వాదనకు తావులేదు. అయితే చర్చల ద్వారా తమ సమస్యలు పరిష్కారం కానప్పుడు మరో దారి లేనప్పుడు సమ్మె మార్గాన్ని ఎంచుకోవడాన్ని తప్పుపట్టలేం. కానీ చెప్పాపెట్టకుండా ఆకస్మికంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడితే సామాన్య ప్రజలు ఎంతటి ఇబ్బందులకు గురవుతున్నారో పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరం. ఎవరికి ఏ సమస్య వచ్చినా రోడ్లమీదకు వచ్చేస్తున్నారు. రాకపోకలను స్తంభింపచేస్తున్నారు. గంటల తరబడి ఎర్రటి ఎండలో రోడ్లమీద గడపడం ప్రయాణికులు తట్టుకోలేకపోతున్నారు. తాజాగా శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో మున్సిపాలిటీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిని అధికార పార్టీ నేతలు ఎత్తుకెళ్లారని ఆరోపణలతో ఆందోళనకు గిగిన ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలు ఖమ్మం- వరంగల్ ప్రధాన రహదారిపై దాదాపు రెండు గంటలకు పైగా రాకపోకలు స్తంభింపజజేశారు. సుమారు 3 కిలోమీటర్లకు పైగా ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోయాయి. నగరాల్లోనే కాదు పట్టణాల్లోనే కాదు చివరకు పల్లెల్లో కూడా రోడ్డుకు అడ్డంగా వస్తున్నారు. ముఖ్యంగా ఆస్పత్రికి వెళ్లే రోగులు సకాలంలో చేరుకోలేక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇలా ఎందరో తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రతిసమస్యకు సమ్మె ముఖ్యంగా రాస్తారోకోలు చేస్తే తప్ప ప్రభుత్వ దృష్టిని ఆకర్షించలేమని నమ్మకం రానురాను పెరిగిపోవడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. తెలంగాణలో ఇటీవల కాలంలో యూరియా దొరకక రైతులు రోడ్లెక్కుతున్నారు. గంటల తరబడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. అవి గ్రామీణ రోడ్లా, జాతీయ రహదారుల అనే విషయం కూడా పట్టించుకోవడం లేదు. వాస్తవంగా ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకొని స్థానికంగానే సమస్య పరిష్కారం వైపు అడుగులు వేస్తే ఇటువంటివి జరిగే అవకాశాలు ఉండవు. ఏదిఏమైనా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ ధర్నాలు, రాస్తారోకోలు రానురాను పెరిగిపోతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు వీటి పట్ల అసహనం పెరిగిపోతున్నది. వినడానికే కటువుగా అని పించినా ఇది వాస్తవం. సమ్మెలు, నిరసన కార్యక్రమాల ఆవిర్భావానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. రాజులు, సంస్థానాలు, పెత్తందారుల కాలంలో కొన్ని వర్గాలు దోపిడీకి గురై కట్టు బానిసలుగా బడుగు జీవులుగా జీవనం సాగిస్తున్న రోజుల్లో 1853లో ఆంగ్లేయులు ఇండియాలో రైలు మార్గాన్ని వేయడంతో పరిశ్రమలు, వ్యాపారసంస్థలు నెలకొల్పడం ఆరంభమైంది. వాటితో పాటు కార్మిక వర్గం సమస్యలు మొదలయ్యాయనే చెప్పొచ్చు. 1857లో విద్యుచ్ఛక్తితోపాటు

## ఒక్క మాట

పారిశ్రామికీకరణ పెరగడంతో కార్మికవర్గం ఊపందుకుంది. కార్మికుల సమస్యలు అదేస్థాయిలో పెరిగిపోయాయి. దానికితగ్గట్టు అప్పట్లో కార్మికుల ప్రయోజనాలకు ఉద్దేశించిన చట్టాలు ఏమీ లేవు. యాజమాన్యం చెప్పిందే వేదం. వారు ఇచ్చిందే జీతం. పదహారు నుంచి పద్దెనిమిది గంటలు పనిచేయాల్సిందే. 1858లో భారతదేశంలో బ్రిటిష్ ప్రత్యక్ష పాలన ప్రారంభం కావడంతో భారతీయ కార్మికుల కోసం 1859లో 'వర్క్‌మెన్ బీచ్ ఆఫ్ యాక్ట్' చట్టం వచ్చింది. ఆతర్వాత ఫ్యాక్టరీ కార్మి కుల కోసం 1881లో ఫ్యాక్టరీ చట్టం అమలులోకి వచ్చింది. ఇది భారతదేశంలో అవతరించిన తొలికార్మిక చట్టం. దీంతో కార్మికులకు కొంత స్వేచ్ఛ లభించింది. కానీ ఆశించిన మేరకు పరిస్థితులు మెరుగుపడలేదు. 1890లో బెర్లిన్‌లో జరిగిన అంతర్జాతీయ కార్మిక మహాసభ భారతదేశంలో కార్మికుల పరిస్థితులను మెరుగు పరచాలని చర్చల అనంతరం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అప్పటికి చట్టపరంగా సంఘాలు ఏర్పాటు చేసుకునే అవకాశాలు లేకపోయినా లోకమాన్య బాలగంగాధర్ తిలక్‌కు బ్రిటిష్ పాలకులు ప్రవాస శిక్ష విధించడంతో ముంబయిలోని కార్మికలోకం సంఘటితమై నిరసన సమ్మె మొదలుపెట్టారు. సమ్మె అలా ఆరంభమైందని చెప్పొచ్చు. ఆ తర్వాత ధరలు పెరిగినా అందుకు అనుగుణంగా జీతాలు పెంచకపోవడంతో 1919లో దేశంలో మొదటిసారి వేతనాల కోసం సమ్మె సైరన్ మోగింది. 1920లో ట్రేడ్ యూనియన్ డిస్ప్యూట్ యాక్ట్ అమలులోకి వచ్చింది. అయినా చట్టాలు నిబంధనలు కార్మికుల హక్కులను కాపాడలేకపోవడంతో 1926లో కొత్త కార్మిక చట్టాలకు రూపకల్పన చేశారు. అయితే ముందున్న ట్రేడ్ యూనియన్ యాక్ట్‌లో కొన్ని మార్పులు చేయాలని తలపెట్టడంతో 1929 ఏప్రిల్‌లో జరిగిన సమావేశంలో భగత్‌సింగ్ బాంబు విసిరి వ్యతిరేకత తెలిపారు. మొత్తంమీద స్వాతంత్ర్యం అనంతరం ఇదే చట్టం పారిశ్రామిక వివాదాల చట్టంగా రూపాంతరం చెందింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కార్మికుల సంక్షేమ హక్కులు కాపాడేందుకు అనేక చట్టాలు చేశారు. నిబంధనలు విధించారు. ఇలా ఎందరో మహానుభావుల అవిరామ కృషి, త్యాగాలతో ఈ సమ్మె, ఇతర నిరసన కార్యక్రమాలు చేపట్టే హక్కు లభించింది. ఆనాటి సమ్మెలకు కానీ, నిరసన కార్యక్రమాలకు కానీ, ధర్నాలకు కానీ ప్రజల మద్దతు ఉండేది. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా, సాధ్యమైనంత వరకు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూసుకునేవారు. రానురాను పరిస్థితి మారిపోతున్నది. కొందరు ఈ హక్కులను దుర్విని యోగం చేస్తున్నారేమోననిపిస్తున్నది. పదిమంది కూడి వారి సొంత సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. పట్టుమని పదిమంది కూడా లేకుండానే చెప్పాపెట్టకుండా రోడ్డుపై కూర్చొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే సంప్రదాయం మితిమీరిపోతున్నదేమోనని అపిస్తున్నది. ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేయడానికి పోలీసులు గంటల తరబడి శ్రమపడాల్సి వస్తున్నది. ఇది గ్రామాలకు కూడా విస్తరించింది. గ్రామాల్లో వీధిలైట్లు వెలగడంలేదనో, పారి శుధ్యం సక్రమంగా నిర్వహించడం లేదనో రోడ్లపైకి వచ్చేస్తు న్నారు. గంటల తరబడి రాస్తారోకో పేరుతో వాహనాలను స్తంభింపచేస్తున్నారు. అందువల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు, కష్టాలను పట్టించుకోవడం లేదు. చివరకు ఇంటి నుంచి బయలుదేరిన వారు గమ్యానికి చేరడానికి ఎంత సమయం పడుతుందో, ఏ రాస్తారోకోలో ఇరుక్కుపో తారో, తర్వాత ట్రాఫిక్ ఎంతసేపటికి క్లియర్ అవుతుందో చెప్పలేని దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా అత్యవసరంగా ఆస్పత్రులకు వెళ్లేవారు, సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు ఎంతోముందుగా టిక్కెట్లు బుక్ చేసుకొని సకాలంలో రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలని తపన పడుతున్నవారు, విమానప్రయాణికులు, కార్యలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు ప్రధానంగా పరీక్షల కాలంలో విద్యార్థులు పడుతున్న టెన్షన్ అంతాఇంతా కాదు. ఇలా ఒక్కరేమిటి రాస్తారోకోలో ఇరుక్కొని లక్షలాది మంది పడే మానసిక ఒత్తిడి వర్ణనాతీతం. గంటల తరబడి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్నారు. ఎంతసేపు స్తంభింపచేస్తే అంత గొప్పగా చెప్పుకునే పరిస్థితులు దాపురించాయి. ఈ రాస్తారోకోల పట్ల ప్రజల్లో వ్యతిరేక భావం పెరిగిపోతున్నది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల న్యాయస్థానాలు, దేశ అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసాయి. ప్రభుత్వాలు కూడా సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నాయి. తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడంలో ఏమాత్రం తప్పు లేదు. కానీ అందుకో పద్ధతి ఉండాలి. దానినే ఆచరించాలి. అంతేకానీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తామనడం సమంజసం కాదు. ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏ రకంగా చూసినా న్యాయం కాదు. పెద్దలందరూ విజ్ఞతతో ఆలోచించాలి. ●

# డిజిటల్ మీడియాలో ఫేక్ వార్తలకు చెక్ పెట్టాలి

సి.హెచ్.ప్రతాప్

నే టి ఆధునిక సాంకేతిక యుగంలో సమాచార ప్రసారం మునుపెన్నడూ లేనంత వేగంగా జరుగుతోంది. స్మార్ట్ ఫోన్ ఇంటర్నెట్ విప్లవం వల్ల ప్రతి ఒక్కరూ సమాచార సృష్టికర్తలుగా మారిపోయారు. అయితే ఇదే సమయంలో 'ఫేక్ న్యూస్' లేదా నకిలీ వార్తల వ్యాప్తి సమాజానికి ఒక పెద్ద సవాలుగా పరిణమించింది. సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజానిజాలు నిర్ధారించుకోకుండానే సమాచారం క్షణాల్లో లక్షలమందికి చేరుతోంది.ఈ తప్పుడు సమాచారం కేవలం వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా దేశ భద్రతకు, సామాజిక సామరస్యానికి ప్రజారోగ్యానికి పెద్ద ముప్పుగా మారుతోంది. డిజిటల్ మాధ్యమాల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్ల కలిగే నష్టాలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. ఫేక్ వార్తలు ప్రధానంగా రాజకీయ లబ్ధి కోసం, మతపరమైన విద్వేషాలు రగిల్చడం కోసం లేదా ఆర్థిక ప్రయోజనాల కోసం సృష్టించబడుతున్నాయి. ఆధునిక కాలంలో 'డీప్ ఫేక్' సాంకేతికత ద్వారా ఒక వ్యక్తి ముఖాన్ని లేదా గొంతును మరొకరితో మార్చి అసలైన దానికంటే మిన్నగా నకిలీ వీడియోలను సృష్టిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియలైన ఎన్నికల వంటి సందర్భాల్లో ఓటర్లను తప్పుదోవ పట్టించడానికి ఉపయోగపడుతోంది. అదేవిధంగా ఆరోగ్య రంగంలో తప్పుడు చిట్కాలు వ్యాప్తి చేయడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది.ఏదైనా ఒకసంఘటన జరిగినప్పుడు దాని వెనుకఉన్న వాస్తవాలను తెలుసుకోకుండా కేవలం సంచలనం కోసమే వార్తలను ప్రసారం




చేయడం వల్ల సామాజిక అశాంతి కలుగుతోంది. తప్పుడు సమాచారంవల్ల ప్రజల్లో భయాందోళనలు పెరిగిపోతున్నాయి. ఈ డిజిటల్ మహమ్మారికి అడ్డుకట్ట వేయడంలో ప్రతి పౌరుడికి ప్రత్యేక బాధ్యత ఉంది. మన ముందుకు వచ్చే సమాచారం ఏ మూలం నుంచి వచ్చింది?ఆ వార్తా సంస్థకు ఉన్న గుర్తింపు ఏమిటి? వంటి అంశాలను పరిశీలించాలి. ఫ్యాక్ట్‌చెకింగ్ వెబ్ సైట్లు లేదా ప్రభుత్వ అధికారిక పోర్టల్స్ ద్వారా సమాచారాన్ని ధ్రువీకరించుకోవడం ప్రాథమికసూత్రంగా మారాలి. ప్రభుత్వం కూడా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాలను మరింత కఠినతరం చేస్తూ నకిలీ వార్తలను సృష్టించే వారిపై, వాటిని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సోషల్ మీడియా సంస్థలుకూడా తమ ఆల్గారిథమ్స్‌లో మార్పులు తీసుకువచ్చి తప్పుడు సమాచారాన్ని ముందే గుర్తించి హెచ్చరించే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. సామాజిక స్పృహ డిజిటల్ అక్షరాస్యత ద్వారానే ఈ సమస్యకు శాశ్వతపరిష్కారం లభిస్తుంది. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సోషల్ మీడియాను ఎలా బాధ్యతగా ఉపయోగించాలో నేర్పించాలి. ప్రజలు తాము చూసే ప్రతి అంశాన్ని విమర్శనాత్మక దృక్పథంతో ఆలోచించడం నేర్చుకోవాలి. అనామక మూలాల నుంచి వచ్చే సందేశాలను ఇతరులకు ఫార్వార్డ్ చేయకుండా ఉండటమే మనం చేసే అతిపెద్ద సహాయం. సమాజంలో శాంతియుత వాతావరణం ఉండాలంటే సమాచార విశ్వసనీయత ఎంతోముఖ్యం. సాంకేతికతను మానవ వికాసానికి, సమాజ శ్రేయస్సుకు వినియోగించుకున్నప్పుడే డిజిటల్ యుగం నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది. ప్రతిఒక్కరూ ఒక బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరించినప్పుడే ఫేక్ వార్తలకు శాశ్వతంగా చెక్ పెట్టడం సాధ్యమవుతుంది. ●

పేరు, ప్రఖ్యాతులు పెరుగుతున్న కొద్దీ తలదించుకునే నడవాలి. కానీ తలకెక్కించుకోకూడదు.



హరివంశరాయ్ బచన్

నేరస్తులను శిక్షించుటే ప్రధానం కాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.



ఆల్బర్ట్ కామూ

# ప్రజావాక్కు



### ఇంటి పన్నుపై చర్చ జరగాలి

ముఖ్యమంత్రిగారు నిన్న ఎమ్మెల్యేలు అందరిని ఉదయం తొమ్మిదికిఅసెంబ్లీ సమావేశాలకు రావాలని, సమస్యలను సిరియస్‌గా చర్చించాలని ఆదేశించటం అభినందనీయం. అయితే వారు ఏ సమస్యలమీద చర్చిస్తారో తెలియదు. ముఖ్యంగాపట్టణాలలో హౌస్‌టాక్స్ విషయం చర్చించాలి. గతప్రభుత్వం హౌస్‌టాక్స్ ప్రతిసంవత్సరం 15 శాతం పెంచుతూ బిల్‌తెచ్చింది. ప్రస్తుతప్రభుత్వం కూడా దానినే కొనసాగిస్తుంది.అనగా ప్రతిసంవత్సరం15 శాతం ఇలాపెంచుకుంటూ పోతే చివరికి సామాన్యుడికి టాక్స్ కట్టలేని స్థితివస్తుంది.హౌస్‌టాక్స్ కట్టలేక ఇల్లు అమ్ముకునే పరిస్థితి రావచ్చు. ఈ సమస్య అందరిదీ శాసనసభ్యులకు కూడా ఇదే పరిస్థితి.కనుక తక్షణమే 15 శాతం ఇంటి పన్ను కలుపుతూ పోయ్యే ఈబిల్లు రద్దుపరచే విధంగా అసెంబ్లీలో చర్చించాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రహసనంగా మారుతున్న సమావేశాలు

దేశపార్లమెంట్‌రోజూరోజుకు ఒకప్రహసనంగా మారుతోంది. ప్రపంచంలో అతిపెద్దప్రజాస్వామిక దేశం అని చెప్పుకుంటున్న భారత్ లాంటి దేశంలో జరగడం విచారకరం. బడ్జెట్ సమావేశాలలోనరవనేరాసినబుక్‌చర్చనీయాంశం అయ్యింది. ఇది అత్యంత విచారకరం.ప్రజల సంక్షేమం వాణిజ్య ఒప్పందాలు రైతుల మీద ప్రభావంపీటి గురించి చర్చ జరగకుండా ఒక అధికారిరాసిన బుక్‌పైన చర్చజరగడం దానికి మీడియా కూడా అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ఎంతవరకు సమంజసం. పార్టీలు పార్లమెంట్ సమావేశాలను ఒక పిక్నిక్ లాగ భావిస్తున్నాయా అన్నది ప్రశ్న.

- భారత అవినాష్, జనగామ

### అపరిచిత వ్యాధులు

వైద్య విజ్ఞాన ప్రగతి వల్ల మనిషి సగటు ఆయుర్దాయం గణనీయంగా పెరిగింది. అయితే, ఒకవిరుద్ధమైన పరిస్థితి ఏమిటంటే, ఆయుష్షు పెరుగుతున్నప్పటికీ కొత్త రకమైన అపరిచిత వ్యాధులుమానవాళిని వెంటాడుతూనే ఉన్నాయి. కేవలం జీవించిన సంవత్సరాల సంఖ్య పెరగడం వల్లనేజీవితానికి పరిపూర్ణత లభించదు.పెరిగిన ఆయుర్దాయానికి సాటిమనిషి పట్లసానుభూతి,కరుణ సోదరభావం తోడైనప్పుడే ఆ జీవితం అర్థవంతంగా మారుతుంది.

-సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### కృత్రిమ బురద

కృత్రిమ మేధని ఉపయోగించి తయారుచేసిన వీడియో, ఫోటో లేదా కంటెంట్‌పై స్పష్టంగా లేబిల్‌ఉంచాలని సామాజిక మాధ్యమాలను ఆదేశిస్తూ కేంద్రప్రభుత్వం కొత్త నిబంధనల్ని ఈనెల నుండి అమలు పరచబోతుంది. ఆమేరకు ఐటీచట్టాన్ని సవరిస్తోంది. ఇది మంచి నిర్ణయం. కృత్రిమ మేధ అందుబాటులోకి వచ్చింది లగాయతు సామాజిక మాధ్యమాల నిండా ఏఐ జెనెరేటెడ్ కంటెంట్ వెల్లువెత్తుతుంది. ఏది వాస్తవమో,ఏది నకిలీయో తెలుసుకోవడంఆలోచనాపరులకు కూడా కష్టమైపోతుంది. ప్రముఖులు మాట్లాడినట్టు చూపించే వీడియోలద్వారా మరింత నకిలీ సమాచారం చలామణి అయిపోతోంది. వివాదాస్పద, రాజకీయ పక్షపాత సందేశాలు నేతల నోటినుండి వచ్చినట్టు చూపించడం, అవి వైరల్ అవుతూ సామాజిక గందరగోళానికి దారితియ్యడంరొటీన్ వ్యవహారమైపోయింది. ఈ నేరాలకు అడ్డుకట్ట వెయ్యడంలో సమాజం వెనకబడే ఉంది.

-డా. డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### సభా కాలాన్ని వృథా చేయొద్దు

పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీని మాట్లాడడానికి సమయమివ్వని స్పీకరు ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెసుతో కూడిన ఇండీ బ్లాక్ వారు వంద మందికి పైగా సంతకం చేసి సంచలనం సృష్టించారు.మంచిమెజారిటీ కలిగిన పాలకపక్షం వారిచేతిలో ఈ అవిశ్వాసంవీగిపోతుందని తెలుసున్న విషయమే. అయితే ఇది సభాపతి అయిన స్పీకరు గౌరవానికి ఓమాయని మచ్చగామిగిలిపోతుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత లోక్‌సభ సభాపతులుగా వ్యహరించిన మావలాంకర్,అనంతశయనం అయ్యంగారులాంటివారు సభను ఎంతో హుందాగా సంప్రదాయాన్ని పాటిస్తు నడిపారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### జాతి వివక్ష

మూడేళ్ళ క్రితం అమెరికాలో సియాటెల్‌లో పరిమితికి మించిన వేగంతో పోలీసు వాహనం నడిపి భారతీయ విద్యార్థిని కందుల జాహ్నవి మృతికి కారణమైన కేసులో ఆ పోలీసు అధికారి ఈమె సాధారణ వ్యక్తి. ఈ ప్రాణానికి విలువ లేదు అని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి.జాతి వివక్షతో కూడినటువంటి ఆవ్యాఖ్యలను భారత్‌తో సహా అనేకదేశాలు ఖండించాయి.ప్రజాస్వామ్య దేశాలలోపౌరులకుస్వేచ్ఛా స్వాతంత్రాలతో పాటు వ్యక్తి గౌరవం, వారి ప్రాణాలకు ప్రాధ్యాన్యత ఉండాలి.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బహుభాషా సామర్థ్యాలు అవసరమే!

దాడిశెట్టి శ్యామ్ కుమార్

స మాజం నుండి ఎదురయ్యే ప్రతి విషయాన్ని భిన్న కోణాల్లో ఆలోచిస్తూ విభిన్నమైన ధోరణిలో భావవ్యక్తీకరణను ప్రతిబింబించేలా మాతృ భాషా అనేది స్వీయ భావనలకు స్వతంత్ర ఆలోచనలకు అనుగుణంగా సృజనాత్మకమైన భావప్రసారాలకు సరళీకృతంగా ఉంటుందనేది భిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ, దేశంలో స్వదేశీ భాషల కన్నా విదేశీ భాషలు చాలా కాలంనుండి ప్రభుత్వ ప్రైవేటు విద్యా ఉపాధి వ్యవస్థల్లో ఎంతో కొంత ప్రాధాన్యతను కలిగి ఉంటున్నాయి. ప్రధానంగా తల్లిదండ్రుల నుండి వచ్చే భాషని మొదటి మాతృభాషగా భావవ్యక్తీకరణకు అనువైనదిగా భావిస్తారు. బాల్యదశ నుండి విద్యార్థి దశకు వచ్చేటప్పుడు సమాజంలో మాతృభాషతోపాటు సమాజంలో చుట్టూ ఉన్న పరిసరాల్లోని వివిధ ప్రాంతంలో వ్యక్తులు మాట్లాడే భాషలు ప్రభావితం చేస్తుంటాయి. ఈ క్రమంలో పాఠశాల స్థాయిలో ఎక్కువ ఆధిపత్య ధోరణిని ప్రదర్శించే భాషలో మాతృభాష చాలావరకు విషయాన్ని నేర్చుకోవడానికి అర్థం చేసుకోవడానికి అనుకూలంగా విద్యార్థులు ప్రతిస్పందిస్తుంటారు. అంతేకాకుండా భారతదేశంలోని అనేక జాతీయ విద్యా కమిషన్‌లోని నిష్ణాతులైన ప్రముఖులు కొందరు మొదట ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలని సూచించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా విభిన్న జాతుల మధ్య వారి సంస్కృతి సాంప్రదాయాలు,వారి మాతృభాషలోనే ఉండడం సహజంగా గోచరిస్తుంది. కొన్ని భాషలకు లిపి లేకపోయినా భాషాపరమైన జీవన విధానాలు స్వదేశంతోపాటు విదేశాల్లో కూడా కనపడుతుంటాయి. ఇప్పటికీ మాతృభాష ఆధారంగా విభిన్నమానవ జాతులు సమూహాలుగా ఏర్పడి జీవన విధానాలను కొనసాగిస్తూ ఉండడం ఆధునిక ప్రపంచంలో కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. సమాజం పట్ల ఆలోచనాత్మక ధోరణి కలిగి అర్థం చేసుకునే స్వభావం తద్వారా భావాన్ని నిర్మోహమాటంగ చెప్పేవిధంగా మాతృభాష దోహదం చేస్తున్నప్పటికీ, ప్రస్తుతం ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని జీవన విధానాలు సంస్కృతి సాంప్రదాయాలు ఆలోచనా విధానాలు పరస్పరం పంచుకోవడానికి వేరే ఇతర భాషల పట్ల కూడా ఆసక్తి కనబరిచే వారు లేకపోలేదు. ఎక్కువగా భారత దేశంలో స్వదేశీ మాతృభాషకు తగినంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ , విద్యా రంగంలో గతంతో పోలిస్తే ఆంగ్ల విద్యా విధానంలోనేచదివే విద్యార్థుల సంఖ్య అధికమవుతుంది. దీనికి ప్రధానంగా సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులో వస్తున్న నేపథ్యంలో ఇతరభాషల ప్రాధాన్యత తెలుసుకోవడం,స్వదేశీ భాషతో పాటు ఇతర విదేశీ భాషల్లో కూడా తమ సంస్కృతి సాంప్రదాయాలను ఆచార వ్యవహారాలను అనుసంధాన




పరిచి ఇతరులు కూడా అర్థం చేసుకునేవిధంగా ఇతర భాషలను నేర్చుకోవడం వల్ల మానవీయ సంబంధాలు కూడా పురోగతి చెందుతున్నాయి.అయినప్పటికీ చాలావరకు మాతృ భాష మాట్లాడే వారిసంఖ్య అధికంగానే ఉంటుంది అనడంలో అతిశయోక్తి లేదు. దేశంలో ఆయా రాష్ట్రాల్లో ఉండే మాతృభాషా ఆధారంగా బోధన మాధ్యమాలు సర్వ సాధారణంగా ఉంటాయి. అయితే గత రెండు దశాబ్దాల నుండి ఇంగ్లీష్ మీడియం ప్రాధాన్యత క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో కొంత మినహా ప్రైవేట్ పాఠశాలలో దాదాపు బోధన ఇంగ్లీష్ మాధ్యమాల్లోనే ఉంటుండడం విశేషం. అయితే రాష్ట్రాల్లో ప్రైవేట్ పాఠశాలల సంఖ్యగణనీయంగా పెరగడం ఎక్కువ మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం వైపు మొగ్గుచూపుతున్న సహజంగా ఏదైనా అంశంలో మాతృభాషలో భావవ్యక్తీకరణను అనర్గళంగా చెప్పగలిగేంత విదేశీ భాషల్లో చెప్పడం కొన్ని సందర్భాల్లో అంతగా కుదరకపోవచ్చు. భాషద్వారా భావవ్యక్తీకరణ అనేది ఇతరుల భావాలను అనుభవాలను పంచుకునే విధంగా సమస్యలను ఆలోచించిపరిష్కరించుకునే రీతిలో భాషా పదజాలం భాష భావం విభిన్న సంస్కృతులు కలిగినటువంటి దేశంలో విభిన్న జాతుల మధ్య సమైక్యత సమగ్రత సహకారం పెంపొందించడానికి అవకాశం ఉంటుంది. అయితే భారతదేశంలో హిందీ రాష్ట్ర భాషగా ఉంటున్నప్పటికీ, ఆయా రాష్ట్రాల్లోని మాతృభాషతో పాటు ఇంగ్లీష్, హిందీ కూడా ఒక భాషగా తప్పనిసరిగా నేర్చుకోగలిగితే దేశంతోపాటు ప్రపంచ స్థాయిలో మాతృభాష పదజాలంతో పాటు విదేశీ భాషల్ని కూడా సమాంతరంగా ఉపయోగించగలిగితే బహుభాషా నైపుణ్యం మంచి భావప్రసార వ్యాప్తికి మరింత దోహదం చేస్తుందేమో. ఇప్పటి కూడా అంతర్జాతీయ వేదికల్లో దేశ ప్రధానులు విదేశీ వ్యవహారాల్లో వివిధ దేశాల మధ్య సంబంధాల అంగీకార విషయాల్లో అధికారిక కార్యక్రమాల్లో కూడా ఎక్కువగా ఆయా దేశాల నాయకత్వం వారి మాతృ వ్యవహారిక భాషలోనే మాట్లాడడం జరుగుతూ వస్తున్నది అంటే మాతృభాషలో భావవ్యక్తీకరణను అనర్గళంగా చెప్పగలిగేంత ప్రాముఖ్యత ఉండడమే ప్రధాన కారణం అనిపిస్తుంది. ఏది ఏమైనప్పటికీ భాషా దినోత్సవాలు తరుచూ అధికారికంగా జరుపుకుంటున్న మాతృభాషాతో పాటు ఇతర భాషలు అనుసంధానంగా ఇతర భాషలపై ఎంతో కొంత పరిజ్ఞానం పెంపొందించుకుంటే, భారతదేశంలోని అనేక వేలసంవత్సరాల నాటి నాగరికత, సాహిత్యం, సంస్కృతి, సాంప్రదాయాలు పరిజ్ఞానం , వైజ్ఞానిక తత్వవేత్తలు గురించి తదితర అనేక విషయాల్లో ఉన్న ఔన్నత్యాన్ని ప్రపంచంలోని విభిన్న జాతుల వారికి వివరించడానికి విభిన్న భాషా పరిజ్ఞానం కొంతైనా ఉపయుక్తంగా ఉంటుందనేది వాస్తవమైనప్పటికీ మాతృ భాషాతో పాటు ఇతర భాషల మీద పట్టుఉన్నవారికి అన్ని రంగాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ప్రపంచవ్యాప్తంగా గోచరిస్తున్నాయి. అంతేకాకుండా భారతదేశంలోని ప్రాంతీయ భాషలపై పట్టు సాధిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భాషల పట్ల ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తూ స్వదేశంలో రాష్ట్రాల్లో ఉన్న మాతృభాషకు మరింతగా ఆదరణ ప్రాధాన్యతను ఇవ్వవలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. ●

## పాకల బీచ్ ఫెస్టివల్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు : ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



14, 15 తేదీలలో సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌లో నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ సందర్భంగా చేపట్టిన భద్రతా, ట్రాఫిక్ సముద్ర స్నానాల ఏర్పాట్లను ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజుతో పాటు జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య శుక్రవారం పరిశీలించారు. ఫెస్టివల్‌కు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని బీచ్ పరిసర ప్రాంతాలు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు మరియు కార్యక్రమాల వేదికల గురించి అధికారులతో ఎస్పీ సమీక్షించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక మార్గాలు, వేర్వేరు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన చోట్ల ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.సముద్ర స్నానాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే స్నానాలకు అనుమతి ఇవ్వాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మెరైన్ సిబ్బంది, గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖ సూచనలు తప్పనిసరిగా పాటించి, ట్రాఫిక్ నిబంధనలు అనుసరించాలని, మీతోటి సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా నడుచుకోవాలని, మద్యం సేవించి సముద్రంలోకి వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. పాకాల బీచ్ ఫెస్టివల్‌ను సురక్షితంగా, ఆనందంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112/100 నంబర్లను సంప్రదించాలని ప్రజలను కోరారు.

## సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి 1.10కోట్ల బంగారం బహుకరణ

- చీరాలకు చెందిన సుధీర్ కుమార్ దంపతులు 6బిస్కెట్లు బహుకరణ
- స్వామివారికి కిరీటం తయారు కొరకు మంగళగిరి స్వర్ణకారునికి అందజేత

**అద్దంకి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**





ప్రకాశం జిల్లాలో ప్రసిద్దిగాంచిన అద్దంకి మండలం, సింగరకొండలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి వారికి బంగారం కిరీటం కొరకు చీరాలలోని కొత్తపేటకు చెందిన ముప్పవరపు సుధీర్‌కుమార్, ధర్మపత్ని ప్రత్యూషలు 1.10కోట్ల విలువ కలిగిన 6 బంగారు బిస్కెట్లను శుక్రవారం ఆలయ సహాయ కమీషనర్ ఎం.తిమ్మానాయుడు,చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, పాలకమండలి సభ్యులకు అందజేశారు. స్వామివారికి బంగారు కిరీటం తయారు కొరకు మంగళగిరికి చెందిన స్వర్ణకారుడు కాటూరి సుబ్బారావుకు ఆలయ సహాయ కమీషనర్ దాతల సమక్షంలో వెంటనే అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## వైభవంగా ప్రారంభమైన మహాశివరాత్రి మహోత్సవాలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు, సంతపేట శ్రీషిర్డీ సాయిబాబా మందిర ప్రాంగణంలో వేద పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి శాస్త్రి బ్రహ్మత్వంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 13వ తేదీ శుక్రవాం ఉదయం ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు 16వ తేదీ సోమవారం పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవంతో ముగుస్తాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను కనులారా తిలకించి మహాశివుని అనుగ్రహానికి పాత్రులు కావాలని వేదపురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి శాస్త్రి తెలియజేశారు. 13వ తేదీ శుక్రవారం ఉదయం మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రుద్ర యాగం, చండీయాగం, నారాయణ యాగం, అష్టలక్ష్మీ యాగములను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం విశేష హారతులను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహాశివుని అనుగ్రహానికి పాత్రులు అయ్యారు. మహాశివరాత్రి పర్వదినం రోజున శివునికి విశేష అభిషేకాలు, లింగోద్భవ సమయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకము, 16వ తేదీ సోమవారం పూర్ణాహుతి, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని వేద పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి శాస్త్రి పేర్కొన్నారు. భక్తులు వేలాదిగా హాజరై మహాశివుని అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు.

## వెట్టిచాకిరి నిర్మూలనకు 50 ఏళ్లు స్వేచ్ఛ జీవనానికి స్వర్గ యుగం: మండల తహసిల్దార్. పి. సింగారావు

**జె. పంగులూరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**




ఒకప్పుడు పేదలు, దళితులు, బలహీన వర్గాల బలవంతపు శ్రమకు గురైన దుస్థితి నుండి విముక్తి పొందేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం వెట్టి చాకిరి నిర్మూలన చట్టమనీ పంగులూరు మండల తహసిల్దార్ పి. సింగారావు అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద డిబిఆర్సి జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన వెట్టిచాకి నిర్మూలన 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కరపత్రాల ఆవిష్కరించి తాసిల్దార్ పి. సింగారావుకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ చట్టం అమలు వలన అనేక కుటుంబాలు స్వేచ్ఛగా జీవించే హక్కు పొందినట్లు తెలియజేశారు. మండల డిప్యూటీ తహసీల్దార్ డి. అర్జున్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ లో ఈ చట్టం కీలకపాత్ర పోషించిందని భవిష్యత్తులో కూడా బలహీన వర్గాల హక్కులను కాపాడటంలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లేబర్ లైన్ ప్రతినిధి ఏ కిరణ్ కుమార్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి గొట్టిపాటి కృషితో రూ. 4.5 కోట్లతో సబ్‌స్టేషన్ పనులకు శ్రీకారం

**జె.పంగులూరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతోను మరియు సహకారంతో మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడులో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి అడుగులు పడి సుమారు 4.5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థానిక సర్పంచ్ ఇనికిపాటి శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్ రావు శుక్రవారం ఘనంగా శంఖుస్థాపన చేశారు. మాజీ జడ్పిటిసి సభ్యులు కర్రీ. వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా చేపట్టిన 200 సబ్‌స్టేషన్ల నిర్మాణంలో భాగంగా ఈ ప్రాజెక్టును మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఎనికపాటి శ్రీనివాసరావు, ఎనికపాటి అశోక్, పెంట్యాల సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు ఆంజనేయులు, సింగర్ నాయకులు గుర్రం శేఖర్, కుక్కపల్లి కొండలు, ఓబుల్ రెడ్డి, రావూరి రమేష్, కరి సుబ్బారావు, బాలిన రామ సుబ్బారావు, వలి, పిచ్చి రెడ్డి, బాచిన సురేష్ పలువురు నేతలు భూమిపూజలో పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ ప్రాంత రైతులు, గృహ వినియోగదారుల దశాబ్దాల కలను నిజం చేస్తున్నారని, ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లో వోల్టేజీ సమస్యలు తొలగి, రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్ రావు, ఏడీ దామోదరం మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు అత్యున్నత ప్రమాణాలతో, యుద్ధ ప్రాతిపదికన ఈ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంగులూరు అసిస్టెంట్ ఇంజనీర్ పి. ఆంజనేయులు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు, పలు గ్రామాల తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.





ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## క్విస్ కళాశాలలో క్రిప్టోగ్రఫీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ బూట్ క్యాంప్

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో క్రిప్టో గ్రఫీ, నెట్ వర్క్ సెక్యూరిటీ బూట్ క్యాంప్ ప్రారంభమైనట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. రెండు రోజుల పాటు ఈ బూట్ క్యాంప్ జరగనుంది. ఈ బూట్ క్యాంప్‌లో వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శిక్షణలో క్రిప్టోగ్రఫీకి సంబంధించిన ప్రాథమిక, ఉన్నత స్థాయి అంశాలను విద్యార్థులకు బోధిస్తారు. ముఖ్యంగా ఎన్‌క్రిప్షన్ పద్ధతులు, డిజిటల్ సంతకాలు, హాషింగ్ అల్గారిథమ్స్, నెట్‌వర్క్ సెక్యూరిటీ తదితర అంశాలను వివరించారు. ప్రాయోగిక శిక్షణ సెషన్ల ద్వారా విద్యార్థులు ఎన్‌క్రిప్షన్ టూల్స్, నెట్‌వర్క్ మానిటరింగ్ టెక్నాలజీ, వల్నరబులిటీ అసెస్‌మెంట్ పద్ధతులపై ప్రాక్టికల్ గా తెలుసుకోనున్నారు. అకడమిక్ ఎడ్యుకేషన్, పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించేందుకు ఇలాంటి వర్క్ షాప్ లు ఎంతగానో ఉపయోగపడతాయని ఐటీ డిపార్ట్మెంట్ హెచ్ వోడీ డాక్టర్ సెంథిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాకల బీచ్ ఫెస్టివల్‌ను జిల్లా ప్రజలు జయప్రదం చేయాలి

### - రాష్ట్ర మారి టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య పిలుపు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లాలో మొట్టమొదటిసారిగా బీచ్ ఫెస్టివల్ పాకల బీచ్ లో ఏర్పాటు చేశామని జిల్లా నలుమూలల నుండి ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య పిలుపునిచ్చారు నేడు రేపు జరగనున్న పాకల బీచ్ ఫెస్టివల్ ను చాలా ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఏదైనా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అక్కడ ఉన్న వనరులను మనం ప్రమోట్ చేసుకొని సరైన ఆలోచన విధానంతో కార్యక్రమాలు రూపొందించుకుని నిర్వహిస్తే ఆ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని సత్య అభిప్రాయపడ్డారు వెనుకబడిన ప్రకాశం జిల్లాలో నేడు చీరాల, బాపట్ల సూర్యకి బీచ్ బీచ్ కూడా ఎక్కువగా .ప్రసిద్ధిగాంచాయని జిల్లాలో వనరులను చూసుకుంటే పాకల బీచ్ అనువైన ప్రాంతం ఒక అద్భుతమైన ప్రదేశంగా ఉందన్నారు టూరిజం ఎస్టేట్‌గా ప్రకాశం జిల్లాకి భవిష్యత్తులో సుందర ప్రదేశంగా మారనున్నదని పేర్కొన్నారు కేవలం హైవే కి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండడం ఒక ప్రత్యేకం అలాగే ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహకారంతో రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు ఈ విషయమై త్వరలో టెండర్లు కూడా పిలవబోతున్నారని జిల్లా కలెక్టర్ తగు శ్రద్ధ తీసుకొని పాకల బీచ్ అభివృద్ధికి తన వంతు కృషిని అందజేస్తున్నారని అన్నారు. పాకల బీచ్ కు శివరాత్రి రోజున 15 వేల మంది సముద్ర స్నానాలకు వస్తారని ఇటువంటి సందర్భంలో పాకల బీచ్ ఫెస్టివల్ను ఏర్పాటు చేయడం ద్వారా బీచ్ అభివృద్ధికి పర్యాటకుల కు తగిన ఆహ్లాదాన్ని పంచేందుకు కార్యక్రమాలను రూపొందిద్దామని మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి మరియు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి టూరిజం బోర్డ్ చైర్మన్ నూకసాని బాలాజీ మరియు మారి టైం బోర్డుల సమన్వయంతో ఈ బీచ్ ఫెస్టివల్ ను అద్భుతంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు ఇందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి. బీచ్ ఫెస్టివల్ను కేవలం కొండేపి నియోజకవర్గానికి పరిమితం కాకుండా జిల్లా వ్యాప్తంగా పర్యాటకులు పాల్గొనేలా వారికి ఆనందాన్ని ఆహ్లాదాన్ని పంచే విధంగా ప్రచార కార్యక్రమాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చే కరపత్రాల ఆవిష్కరణ చేసి తదనంతరం పొదిలిలోనూ కందుకూరులోనూ టూ కే రన్ నిర్వహించి ప్రజల్లో ప్రచారాన్ని వ్యాప్తి చేశామని మారి టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య అన్నారు గత పాలకుల నిర్లక్ష్యంలో ప్రకాశం జిల్లాలో అభివృద్ధి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు నేడు జిల్లా అభివృద్ధి చెందాలంటే మన ప్రాంతాలలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి తగిన అవకాశాలు వస్తాయని అన్నారు. మన యొక్క సంస్కృతి సంప్రదాయాలను ప్రమోట్ చేసుకోవడం ద్వారా మన రాష్ట్రానికి తగిన పరిశ్రమలను తీసుకుని వచ్చే బాధ్యత మనకు ఉందన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైజాగ్ ఉత్సవాలను అరకు ఫెస్టివల్ను అమరావతిలో ఆవకాయ ఆవశ్యతతో కూడిన సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు అన్నారు ప్రజలు కూడా రోజు 10 14 గంటలు ఫోన్ తోనే గడుపుతున్నారని అటువంటి వారికి సాంస్కృతిక వైభవాలను ఆవిష్కరించటం ద్వారా వారిలో నూతన చైతన్యాన్ని కలిగించడం ఈ ఫెస్టివల్ల ముఖ్య ఉద్దేశం అన్నారు బీచ్ ఫెస్టివల్ ను ఎంపీ మాగుంట ప్రారంభిస్తారని ఇక్కడ నిర్వహించే కార్యక్రమాలలో హెలికాప్టర్ రైడ్ ఒకటి, వాటర్ వాటర్ స్పోర్ట్స్ ఎంగేజ్మెంట్ పార్కు మరియు ఫుడ్ కోర్ట్ వంటి కార్యక్రమాల తో ఫెస్టివల్ ప్రారంభం అవుతుందని ఈ కార్యక్రమాలతో బోటు ప్రత్యేకంగా ప్రతిరోజు సాయంత్రం సముద్ర హారతి ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందన్నారు అలాగే రాష్ట్రంలో పేరు ఎన్నింటికి కన్నా కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించి ప్రదర్శించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమాలు కొనసాగుతూనే 15వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించడంతో పాటుఆధ్యాత్మిక విలువలతో కూడిన అనేక కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు సత్య పేర్కొన్నారు ఈ కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు డోల బాల వీరాంజనేయ స్వామి, ఆనం రామ నారాయణ రెడ్డి గొట్టిపాటి రవికుమార్ జిల్లాలలోని శాసనసభ్యులు జిల్లా అధికారులు పాల్గొంటారని ఇందుకోసం అనుకూలమైన ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం చేసిందని కాబట్టి ఈ కార్యక్రమంలో జిల్లా వాసులందరూ పాల్గొని పాకల బీచ్ ఫెస్టివల్‌ను జయప్రదం చేయాలని మారి టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య పిలుపునిచ్చారు.

### జీ రాంజీ పేరు మార్పుతో

# పథకాన్ని నీరుగార్చే యత్నం: వైయస్ షర్మిళ





### - పాకలలో ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర

**సింగరాయకొండ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను బలహీనపరచే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఏపీ పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల పేర్కొన్నారు. కొండేపి నియోజకవర్గం, సింగరాయకొండ మండలంలోని పాకల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల ఉపాధి కల్పించే లక్ష్యంతో అమలు చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఈ ఉపాధి హామీ పథకాన్ని విబి జీ రాంజీ పేరుతో నూతన చట్టం ద్వారా మార్పులు చేసి అమలు చేయాలనుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన విధంగా ఉపాధి హామీ నిధులు నేరుగా పేదల ఖాతాల్లో జమ కావడంతో బీజేపీకి చెందిన నాయకులు, కాంట్రాక్టర్లకు అవకాశం లేకుండా పోవడంతోనే పథకాన్ని బలహీనపరచే యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.కాంగ్రెస్ హయాంలో ఉపాధి హామీ నిధులను రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రం మంజూరు చేసేదని పేర్కొన్నారు. ప్రస్తుతం నూతన చట్టం ప్రకారం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు.గతంలో గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామ అవసరాలకు అనుగుణంగా రోడ్లు, చెరువుల పూడికతీత, పారం పండ్స్ గుంటలు, పొలం పనులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు ఉపాధి హామీ ద్వారా చేపట్టేవారని వివరించారు. ఈ పథకం గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు.ఉపాధి హామీ పథకాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని షర్మిల స్పష్టం చేశారు. అనంతరం యాత్ర దర్శికి బయలుదేరి వెళ్లింది.ఉపాధి హామీ కూలీలు తమ సమస్యలను వెల్లడిస్తూ పనికి తగ్గ వేతనం అందడం లేదని, ఆరు రోజులు పని చేస్తే మూడు రోజులకు మాత్రమే కూలి ఇస్తున్నారని, జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసినా పదేళ్లు గడిచినా మంజూరు కాలేదని వాపోయారు.ఈ కార్యక్రమంలోకొండేపి ఇంచార్జి శ్రీపతి సతీష్, స్టేట్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ శ్రీపతి ప్రకాశం, జనరల్ సెక్రటరీ ఇదా సుధాకర్ రెడ్డి, ప్రకాశం జిల్లా ఇంచార్జ్ తాటి కొండ వెంకటేశ్వర్లు,ఓబీసీ స్టేట్ చైర్మన్ శొంఠి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ సైదా షేక్, మండల్ ప్రెసిడెంట్ షేక్ నాయబ్ రసూల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో గ్రామ సమస్య పరిష్కారం.. ప్రశాంతంగా ఉండండి

### - డీఎస్పీ శ్రీనివాసరావు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న

**కొత్తపట్నం ఫిబ్రవరి 13. ప్రభాతవార్త**



రాజుపాలెం గ్రామంలో తలెత్తిన సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందని అప్పటివరకు అందరూ ప్రశాంతంగా ఉండాలని ఒంగోలు డి.ఎస్.పి శ్రీనివాసరావు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం రాజుపాలెం గ్రామాన్ని సందర్శించి అన్ని సామాజిక వర్గాల పెద్దలు అభిప్రాయాలను తెలుసుకున్నారు. మొదట గ్రామ చావడి నందు గౌడ ఎస్సీ సామాజిక వర్గాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వాస్తవ విషయాలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 14 15 తేదీలు పాకల బీచ్ ఫెస్టివల్ జరుగుతున్నదని దీనితోపాటు ఆదివారం శివరాత్రి కావడంతో తిరునాళ్లకు పోలీసులు బందోబస్తు విధులలో ఉన్నారని ఈ రెండు రోజులు అయిన తర్వాత గ్రామ సమస్యకు మరొకసారి గ్రామస్తులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ గ్రామంలో తలెత్తిన సమస్య సానుకూలంగా పరిష్కరిస్తామని ఈ విషయాలను జిల్లా కలెక్టర్ రాజబాబు,ఎస్పీ హర్షవర్ధన్ రాజు, దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు మా పరిధిలో సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తున్నామని కుదరని పక్షంలో జిల్లా ఎస్పీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వివరాల్లోకి వెళితే రాజుపాలెం గ్రామస్తులు అందరూ కలిసి ఒంగోలు కలెక్టర్, ఎస్పీ లను కలవడానికి రావాలని అనుకుంటున్నారని మాకు తెలియడంతో అంతమంది టౌన్ కి రావాలంటే ఇబ్బందిగా ఉంటుందని మేమే మీ గ్రామానికి వచ్చామని మీ యొక్క సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని వచ్చామన్నారు.దీనిపై రామచంద్ర గౌడ్ అధికారులకు వివరిస్తూ గ్రామంలో ముక్కు మాధవి అనే మహిళ 12 లక్షల రూపాయలను కాటూరి వెంకయ్యకు అప్పుగా ఇచ్చిందని తిరిగి అడిగితే నువ్వు ఎవరివో నాకు తెలియదని అన్నారు. ఇతను గ్రామంలో మేస్త్రిగా పనిచేస్తూ మహిళలను కారుమంచి టంగుటూరు వంటి గ్రామాలకు పనులకు తీసుకుని వెళుతూ ఉంటాడు మాధవి కూడా ఆయన వద్ద సూపర్వైజర్ గా పనిచేస్తుండడంతో ఆమెతో చర్చించి ఆమె వద్ద డబ్బులు తీసుకోవడం జరిగింది. దీనిపై కుల పెద్దలు కూర్చొని మాట్లాడుతుండగా బిల్లా చెన్నయ్య అనే వ్యక్తి పోలీస్ సైరన్ వేసుకొని వచ్చి ఇది కులాల గొడవగా చేయాలని చూశారన్నారు, వెంకయ్య రెండవ కుమారుడు కాటూరి రాకేష్ శంకువనిగుంట గ్రామానికి చెందిన సాత్విక ఎస్సీ మహిళను ఆరు నెలల క్రితం వివాహం చేసుకోవడం జరిగింది. ఎస్సీ మహిళను పెళ్లి చేసుకున్నందుకు గాను కుల బహిష్కరణ చేశారంటూ అవాస్తవు ప్రచారం చేశారని, మా గ్రామంలో కులాంతర వివాహాలు చాలా జరిగాయని మాకు కుల విభేదాలు ఎటువంటివి లేవు దీనివల్ల వెంకయ్య గ్రామంలో చేసిన అప్పును ఎగ్గొట్టాలని కాటూరి వెంకయ్య అతని కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని ఆరోపించాడు ఇతను బిల్లా చెన్నయ్య చేసిన అవాస్తవు ప్రచారం వల్ల మా గ్రామానికి చెడ్డపేరు వచ్చిందని అన్నారు. అతను చేసినటువంటి ప్రచారం పూర్తిగా అవాస్తవమని దీనిపై గ్రామంలో విచారించి వీరిపై తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలో ఎస్సీ పెద్దలు, ఇతర సామాజిక వర్గానికి చెందిన పెద్దలు అందరూ వారి అభిప్రాయాలను అధికారులకు తెలిపారు గ్రామంలో ఎలాంటి కుల బహిష్కరణ జరగలేదని తేల్చి చెప్పారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని డిఎస్పి శ్రీనివాసరావు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నాయబ్ రసూల్ కొత్తపట్నం ఎస్ఐ వి సుధాకర్ ఆర్ఐ వర కుమార్ వీఆర్వోలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేథ రంగంలో పబ్లిక్-ప్రైవేటు పెట్టుబడులపై మాగుంట ప్రశ్న

**ఒంగోలు, ప్రభాతవార్త**




దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కృత్రిమ మేథ రంగంలో పబ్లిక్- ప్రైవేటు పెట్టుబడులు, ప్రతిపాదించిన ప్రాజెక్టులు, పనిచేయుచున్న దేశీయ - అంతర్జాతీయ సంస్థలు, నైపుణ్యం- సామర్థ్యం పెంపు చర్యలు, సాధించిన ఫలితాలు గురించి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ సమాచార సాంకేతికత మంత్రిత్వ శాఖ సహాయక మంత్రి జితిన్ ప్రసాద్ సమాధానమిస్తూ.. స్టాన్ ఫోర్డ్ విశ్వ విద్యాలయ నివేదిక ప్రకారం కృత్రిమ మేథ రంగంలో పోటీతత్వం- పర్యావరణ చైతన్యంలో 2025లో భారతదేశం 3వ స్థానంలోను, ప్రాజెక్టుల విషయంలో 2వ తేదీ అతి పెద్ద వాటాదారుగా ఉన్నదని తెలిపారు. దేశంలో కృత్రిమ మేథ రంగం అభివృద్ధికి రూ.10,372 కోట్లతో కేంద్రం ఇండియా కృత్రిమ మేథ మిషన్‌ను ప్రారంభించిందని, కంప్యూటర్ దృశ్యాలు, డేటాను వేగంగా ప్రాసెస్ చేసే 38,000 గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను దేశీయ ప్రారంభ సంస్థలకు తక్కువ ధరకు అందించబడుచున్నవని తెలిపారు. కృత్రిమ మేథ అభివృద్ధి, వాడకం, రక్షణ చర్యలపై అంతర్జాతీయ సదస్సును 16-02-2026 నుండి 20-02-2026 వరకు మన దేశం నిర్వహించుచున్నదని తెలిపారు. కృత్రిమ మేథ రంగ అభివృద్ధికి, ప్రైవేటు రంగ సంస్థలకు 2013-2024 సంవత్సరాలలో భారతదేశం 11.1 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టిందని తెలిపారు. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్లు, మహారాష్ట్రలో టాటా గ్రూపు 15 బిలియన్ డాలర్లు పెట్టుబడులతో కేంద్రాల స్థాపనకు ప్రకటనలు చేశాయని తెలిపారు. ఈ రంగంలో 500 మంది పీహెచ్‌డీలు, 5000 మంది మాస్టర్స్ డిగ్రీ, 8000 మంది పట్టభద్రులను తయారుచేయుటకు ఇండియా మిషన్ లక్ష్యంగా పెట్టుకొందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## నూతన పెన్షన్ దరఖాస్తుదారులకు శుభవార్త

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పింఛన్ల దరఖాస్తుదారులకు శుభవార్త తెలిపింది జిల్లాలో క్రొత్తగా వృద్ధాప్య, వితంతు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నా వారికి ఇది శుభవార్త ఈ విషయమై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శాసన మండలిలో ఒక కీలక ప్రకటన చేశారు వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్లు విధివిధానాలను ప్రభుత్వం ఇప్పటికే సిద్ధం చేసింది త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు అర్హులైన దరఖాస్తుదారులందరూ పెన్షన్ సౌకర్యం పొందేందుకు అవకాశం ఏర్పడనున్నది.

7_7.qxd 2/14/2026 12:19 AM Page 1



## సకాలంలో ఇళ్ల పనులు చెల్లించి గ్రామాభివృద్ధికి పాటుపడండి



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
గ్రామస్తులు సకాలంలో ఇళ్ల పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి పాటుపడాలనిసంతనూతలపాడు ఎంపీడీవోడి.సురేష్‌బాబు కోరారు. సంతనూతలపాడు మండలం పి.గుడిపాడు గ్రామంలో శుక్రవారం నాడు ఎంపీడీవోసురేష్‌బాబుశానిటేషన్ ప్రక్రియను పరిశీలించి అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్నిఆయన సందర్శించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానంను ఈ సందర్భంగా ఎంపీడీవో పరిశీలించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన ఇఎంపీడీవో సురేష్‌బాబు కోరారు.ఈ కార్యక్రమంలో గుడిపాడు పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.జ్యోతి, వీఆర్వో కే.రవికుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పీఎం జీవనజ్యోతి, ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ చేసిన బ్యాంకు మేనేజర్ రాజు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం మద్దులూరు గ్రామంలో శుక్రవారం నాడు ప్రధాన మంత్రి జీవనజ్యోతి, భీమా యోజనకు సంబంధించి రెండు లక్షల రూపాయలు విలువ చేసి ఇన్సూరెన్స్ చెక్కును బాధితురాలు సన్నపరెడ్డి లక్ష్మీకి మద్దులూరు ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ విజయ్ రాజు పంపిణీ చేశారు. మద్దులూరు గ్రామానికి చెందిన సన్నపురెడ్డి రమణారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల మద్దులూరులో బ్యాంకులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాధితుడు బ్యాంకులో దీనిపై ఇన్సూరెన్స్ నమోదు చేసుకున్నారు. ఇందులో భాగంగా బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్‌ను మంజూరు చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌షన్ డైరక్టర్ వి.ఆంజనేయులు, చీమకుర్తి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్‌లు ఎస్.అమృతరాజు,ఏ.చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితురాలు సన్నపురెడ్డి లక్ష్మీ మద్దులూరు ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ విజయ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన 108 సిబ్బంది



**దర్శి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
ఏపీ 108 అంబులెన్స్ సర్వీస్‌లో ఉద్యోగులుగా పని చేస్తున్న ఈఎంటీ, పైలెట్‌లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం అప్పటికే ఉన్న ఉద్యోగి యొక్క జీతంకు అదనంగా ఉద్యోగికి నెలకు 2000 రూపాయలను పెంచడంతో పాటు 5 సంవత్సరాలు, 10 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ స్లాబ్ అప్‌గ్రేడేషన్ చేయాలని నిర్ణయించడం ద్వారా వారికి మరింత ఆర్థిక వెసులుబాటు అందించారు. ఈనెల నుండి స్లాబ్ అప్‌గ్రేడ్ చేసిన జీతాలు చేతికి అందడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు అందరూ ఆంధ్రప్రదేశ్‌లో 108 సర్వీస్‌లో ఏకైక ఘం అయిన ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగ సంఘం ధన్యవాదాలు తెలిపారు. దర్శి 108 సిబ్బంది కురంగి నరేష్, బాలజ్యోతి పాల్గొన్నారు.

## టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఉదయం తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ పథకాల గురించి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ వివరించారు. అనేక పథకాలతో సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని తెలియజేశారు. మండలం, గ్రామ, బూత్ లెవల్ నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సూచించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ.

## దర్శి నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉచిత మెడికల్ క్యాంపు

**- విద్యార్థులు, సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు**

**- ఆరోగ్య అవగాహనతో పాటు కంటి సంరక్షణపై సూచనలు**

**- కార్యక్రమంలో పాల్గొన్న ఏజీఎం ఎన్.పెద్దిరెడ్డి, ప్రిన్సిపాల్ పి.అంజిరెడ్డి, హెచ్‌ఆర్ మస్తానయ్య**



**దర్శి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
దర్శి పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోమెడికల్‌క్యాంపు విజయవంతంగా పూర్తైంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల యాజమాన్యంఆధ్వర్యంలోఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంపులో డెంటల్ డాక్టర్ సమీర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎంఎన్.పెద్దిరెడ్డి ప్రిన్సిపాల్ పి.అంజిరెడ్డి,హెచ్‌ఆర్ మస్తానయ్య పాల్గొని ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వారు పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరూ సోలార్‌లు బిగించుకుని కరెంటు ఆదా చేసుకోండి

**- విద్యుత్ ఈఈ పాలగిరి శ్రీనివాసులు**



**ముండ్లమూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
మండలంలోని ప్రజలందరికి ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సబ్సిడీపై సోలార్లు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని దీనిని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని కరెంటు ఆదా చేసుకోవాలని విద్యుత్ ఈఈ పి.శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యుత్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ఆయన మాట్లాడుతూ మండలంలో ఓవర్ డ్యూ, ట్రాన్స్‌ఫార్మర్లు కావాలన్నా నూతన స్తంభాల ఏర్పాటు చేసుకోవాలన్న అధికారులు సంప్రదించాలని వెంటనే ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. అదే విధంగా గ్రామాల్లో ఇళ్లపై ఏవైనా విద్యుత్ లైన్లు ఉంటే వాటి సమస్య పరిష్కారం చేస్తామన్నారు. అదేవిధంగా కరెంటు బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన తెలియజేశారు. విద్యుత్‌కి సంబంధించిన సమస్యలు ఉన్న వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ అంకబాబు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



**ముండ్లమూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
మండలం నందు ఒంగోలు డీఎల్‌డీఓ సువార్త పంచాయతీ కార్యదర్శుల తోటి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశం నందు ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని నగదు రహిత లావాదేవీ చేసి ఇంటి పన్నులను క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపు చేయులాగున చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. గ్రామ పంచాయతీలలో శానిటేషన్ ప్రతి రోజు ఇంటి ఇంటికి గార్బేజి కలెక్షన్ జరగాలని ఐవీఆర్‌ఎస్ కాల్స్ నందు ప్రగతి సాధించాలని, రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు లేకుండా చూడాలని తెలియపరిచి ఉన్నారు. సమావేశం నందు డీఎల్‌డీఓ సువార్త, డిప్యూటీ ఎంపీడీవో జనార్ధన్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా కనిగిరి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ దంతులూరి ప్రకాశం



**కనిగిరి, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎంపీపీ దంతులూరి ప్రకాశం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడి కృపతో ప్రతి కుటుంబంలో శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నియమ నిష్టలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగగా పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తి భావంతో పండుగను జరుపుకుని ఐక్యతతో ముందుకు సాగాలని, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, అలాగే ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గం సర్వాంగసుందరంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కనిగిరి ప్రజలకు మరోసారి మహాశివరాత్రి శుభాభినందనలు తెలియజేశారు.

## శివనామస్మరణతో అంగరంగ వైభవంగా శ్రీశైల మల్లన్న తలపాగా గ్రామోత్సవం





**వేటపాలెం ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
మహాశివరాత్రి పండుగ సందర్భంగా వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట గ్రామంలోని దేవస్థానంలో శ్రీశైల మల్లన్న తలపాగా వస్త్రం గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా తలపాగా వస్త్రం వేసిన బాపట్లజిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుసం శ్రీనివాసరావు ఇంటి వద్ద నుండి గ్రామ శివాలయంనకు మేళతాళాలతో బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా సాంప్రదాయ పద్ధతిలో శివాలయంనకు చేర్చడం జరిగింది. శివాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం తలపాగా వస్త్రంను గ్రామంలో ఊరేగించడం జరిగింది. ఈ యొక్క తలపాగ వస్త్రంను శ్రీశైల మల్లిఖార్జున భ్రమరాంబిక కళ్యాణ మహోత్సవంనకు ముందుగా ఆలయ శిబిరంనకు, నవనందులను కలుపుతూ లింగోద్భావ సమయంలో దేవాంగపురి పంచాయతీ హస్తినాపురం గ్రామస్తులు పృద్వి వెంకట సుబ్బారావు వివస్త్రులై చిమ్మ చీకటిలో అలంకరణ చేయడం జరుగును. తదుపరి శ్రీశైల మల్లిఖార్జున బ్రమరాంబిక కళ్యాణ మహోత్సవం వేలాది మంది భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా శివరాత్రి పర్వదినం రోజు రాత్రి జరుగును. ముందుగా సంవత్సర కాలంలో ప్రతి రోజు ఉదయాన్నే స్నానమాచరించి శివనామాలు ధరించి అత్యంత నియమనిష్టలతో రోజుకు ఒక మూర చొప్పున సంవత్సర కాలం పాటు వస్త్రాన్ని తయారు చేసిన పిదప పండుగకు రెండు రోజులు ముందుగా ఈ యొక్క తలపాగా వస్త్రంను శ్రీశైల దేవస్థానం వారికి అందజేయడం జరుగుతుంది. ఈ రోజున దేశాయిపేట గ్రామ ఊరేగింపునకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుమర్తి మల్లిఖార్జునరావు, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం చేనేత విభాగం అధ్యక్షులు పిచ్చుక శ్యామ్, రాష్ట్ర కార్యదర్శి బల్లా వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పృద్వి రవి, రాష్ట్ర నాయకులు చింతాపట్ల గంగా సత్యనారాయణ, కుమ్మరిపాలెం ఈశ్వరన్, దేవల మనుబ్రహ్మదేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఒలుకుల మోహన రావు, ఆపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుర్మా రాహుల్జి, కార్యదర్శి యారాసు అరుణ్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ బుసం శ్రీనివాసరావు, కోశాధికారి చింతారావు, గౌరవ సలహాదారులు నాసిక వీరభద్రయ్య, పన్నెం మోహన్‌జావు, ఉపాధ్యక్షులు గుత్తి వీర ప్రసాదరావు, నాసిక జగన్, చల్లా విజయ్, యూత్ ప్రెసిడెంట్ పిచ్చుక భార్గవ రామ్, యూత్ సెక్రటరీ దోగుపర్తి రాజేష్, కోఆర్డినేటర్ గుంటూరు బ్రహ్మం, లీగల్ అడ్వైజర్ బొడ్డు రుద్ర కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్ నాసిక శైలజ, కార్యవర్గ సభ్యులు బట్ట శివ, లేళ్ళ సాంబశివరావు, పెరిసేట్ల శ్రీహరి, మాచర్ల సాంబశివరావు, గుత్తి ధనుంజయ, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఎర్ర శివనాగ మల్లేశ్వరి, దేవన విజయ, ఉపాధ్యక్షులు బుద్ది దుర్గా, గ్రామ సేనాధిపతులు, ప్రజలు పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్‌లో విజయవంతంగా ముగిసిన 3 రోజుల ఐడియాథాన్



**వేటపాలెం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాలలో గత 3 రోజులుగా నిర్వహిస్తున్న ఐడియాథాన్ విజయవంతంగా ముగిసినట్లుకళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్ బాబు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం వారి ఆధ్వర్యంలో 3 రోజుల పాటు బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇన్నోవర్సిటీ, విజయవాడ వారి సహకారంతో ఐడియాథాన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్, హెచ్లాట్ రీసెర్చ్ సెంటర్ సీఈఓ డాక్టర్ కే.రాశేఖర్ పాల్గొని ఐడియాథాన్‌పై తన సందేశాన్ని విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆయనను దుశ్శాలువాతో సత్కరించి మెమొంటో అందించారు. ఈ వర్క్ షాపులో ఇన్నోవర్సిటీ నుండి ఆర్.గోపికృష్ణ, వాహబ్, ఏ.హేమంత్, ఏ.హర్షవర్ధన్ పాల్గొని విద్యార్థులు సమకాలీన సమస్యలకు, వినూత్నంగా ఉండి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే పరిష్కారాలను కొనుగొనుటలో విద్యార్థులకు పోటీలను నిర్వహించి అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ డి.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ పోటీలలో విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి వివిధ సమస్యలను, వాటి పరిష్కారాలకు సంబంధించి చార్టులను, పవర్ పాయింట్ ఫ్రోగ్రామ్‌లను ఉత్సాహంగా తయారు చేసినట్లు తెలిపారు. ఈ ఐడియాథాన్‌కు ఆర్.హరీష్ కన్వీనర్‌గా వ్యవహరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.సుబ్బారావు, డైరక్టర్ వి.దొరనాగసాయినాథ్, చార్లర్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరోపణలు

**- బయట దళిత సంఘాల నిరసనలు**



**మార్కాపురం, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**
మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించిన అంశాలపై అసెంబ్లీలో ఒకవైపు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేయగా, మరోవైపు దళిత సంఘాల నేతలు తీవ్రంగా ఖండిస్తూ ప్రకటనలు చేయడంతో మార్కాపురం ప్రజల్లో అయోమయ పరిస్థితి నెలకొంది.అసెంబ్లీలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ (జేసీ) సరిగ్గా పనిచేయడం లేదని ఆరోపించారు. తర్లుపాడు మండలం పోతలపాడు రైతుల భూములకు సంబంధించిన రికార్డుల్లో ఊరి పేరు మారడంతో ఆ భూములు దేవదాయశాఖవిగా మారాయని, దీంతో రైతులు భూములు అమ్ముకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఈ అంశంపై 67 అర్జీలు ఇచ్చినా ఒక్కదానికీ పరిష్కారం జరగలేదని, ఇదే కారణంగా ఒక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే జిల్లాలో జేసీ వద్దకు వచ్చిన 1100 ఫైళ్లలో కేవలం 100 మాత్రమే పరిష్కరించి మిగిలినవి నిరక్ష ్యంతో చేశారని విమర్శించారు.భూ సమస్యలపై అసెంబ్లీ లో ఎమ్మెల్యే మాట్లాడటం పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇదే సమయంలో ఈ వ్యాఖ్యలపై స్పందించిన విసికే పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు నూతలపాటి రాజు, మాల మహానాడు మార్కాపురం జిల్లా అధ్యక్షులు గొట్టెముక్కల వెంకటేశ్వర్లు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడాల్సింది మార్కాపురం అభివృద్ధి, మెడికల్ కాలేజీ, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి, జిల్లా ఆసుపత్రిలో సిబ్బంది పెంపు వంటి ప్రజా సమస్యలపై అని, అలాంటి విషయాలను పక్కనబెట్టి నిజాయితీగా పనిచేస్తున్న జాయింట్ కలెక్టర్‌పై ఆరోపణలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఒక అధికారిని బలిపశువు చేయడం దారుణమని, ఎమ్మెల్యే తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రెండు విభిన్న వాదనలతో మార్కాపురం ప్రజల్లో అసలు నిజం ఏమిటన్న సందేహాలు తలెత్తుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## శ్రీశైలం వెళ్లే భక్తులకు రెండో రోజు పెద్ద బొమ్మలాపురం గ్రామస్తుల ఉచిత అన్నదానం





**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు పెద్ద బొమ్మలాపురం గ్రామస్తులు శుక్రవారం రెండో రోజు కూడా ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువత కలిసికట్టుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భారీగా భక్తులు చేరుకుంటుండడంతో మార్గమధ్యంలో శ్రీశైలం రోడ్డులో బోడే నాయక్ తండ వద్ద వందలాది మంది భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ భక్తులకు సేవ చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వార్ల కృపతో ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు కూడా గ్రామస్తుల సేవా భావాన్ని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.భక్తి,సేవా, సహకార భావనల సమ్మేళనంగా బొమ్మలాపురం గ్రామస్తుల ఉచిత అన్నదాన కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తుంది.

## 15,16న శ్రీ అక్కమ్మ తల్లి ఉత్సవాలు



**వెలిగండ్ల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రామగోపాలపురం పంచాయతీలోని కవ్వంపాడు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ అక్కమ్మ పేరంటాల తల్లి(వెంకటప్పస్వామి) ఉత్సవాలు ఈనెల 15వ తేదీ ఆదివారం 16వ తేదీ సోమవారం రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని రాత్రికి శ్రీ అక్కమ్మ పేరంటాల తల్లి(వెంకటప్పయ్య స్వామి) ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, పాటకచ్చేరి పలు సంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ 16వ తేదీ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు పొంగళ్ల కార్యక్రమం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. తరలివచ్చే భక్తులకు అన్నదానం, అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## తిరుమల లడ్డు పాపం కూటమి ప్రభుత్వానిదే

**- గాయపడిన కోట్లాది హిందువుల మనోభావాలు - వైసీపీ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి**



**కందుకూరు ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**
కందుకూరు వైసీపీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు.కందుకూరు వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డు కల్తీపాపం కూటమి ప్రభుత్వానిదేనన్నారు.కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసింది కూటమి ప్రభుత్వమేనన్నారు.ఈ విషయంపై వైయస్సార్సీపీ నాయకులు మాట్లాడితే ఇళ్లపై దాడులు చేయడం, జైళ్లలో పెట్టించడం దారుణమన్నారు.సుప్రీంకోర్టు సిట్ దర్యాప్తు చేసి లడ్డులో ఎటువంటి జంతువు కొవ్వు కలవలేదని రిపోర్ట్ ఇచ్చిందన్నారు.అయినా అనుకూల మీడియాతో ప్రజలని నమ్మించడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు.గతంలో ప్రభుత్వ బోర్డు సభ్యులుగా పనిచేసిన పలువురు ప్రస్తుత అధికారపార్టీ ఎమ్మెల్యేలు లడ్డులో కల్తీలేదన్న వాస్తవాలు వివరిస్తున్నట్లు తెలిపారు.అయినా వినకుండా తిరుమల లడ్డుని రాజకీయ లబ్ధికోసం కూటమి ప్రభుత్వం వాడుకుంటుందని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం శ్రీవేంకటేశ్వర స్వామిని రాజకీయంగా ఉపయోగిస్తుందన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.అనంతరం కందుకూరు రాజకీయాల గురించి ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గం నుంచి స్థానిక నేతలందరి సహకారంతో ఎమ్మెల్యేగా గెలవనున్నట్లు తెలిపారు.

## అభివృద్ధిని స్వాగతిస్తాం - అవినీతిని ఎండగడతాం

**- రేషన్,గ్రావెల్,మద్యం మాఫియా ఆపాల్సిందే !**

**- కందుకూరు నియోజకవర్గ అవినీతిపై నిప్పులు చెరిగిన బుర్రా**



**కందుకూరు ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**
కందుకూరు నియోజకవర్గంలో అవినీతిని సహించబోమని కందుకూరు వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు.స్థానిక వైసీపీ కార్యాలయంలో శుకృవారం నియోజకవర్గ పరిశీలకులు సత్యనారాయణరెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.పేదలకడుపుకొడితే సహించేదిలేదన్నారు. తిరుమల లడ్డు కల్తీపాపం కూటమి ప్రభుత్వానిదే అన్నారు,అనంతరం ఆయన నియోజకవర్గంలో అవినీతి జరుగుతుందని నిప్పులు చెరగారు.అభివృద్ధిపై చర్చకు రమ్మంటున్నారని పరోక్షంగా ఎమ్మెల్యేని ఉద్దేశించి మాట్లాడారు.అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. స్వాగతిస్తామన్నారు.కందుకూరు పట్టణంలో డివైడర్లు వేసి,దానికి పచ్చలైట్లు వేసి,పచ్చ తోరణాలుకట్టి ఇదేఅభివృద్ధి అని ప్రచారం చేసుకుంటున్నారు. కందుకూరు పట్టణంలో స్వర్గీయ సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో రామతీర్థం మంచి నీటిని సొకర్యం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి హయంలో ప్రతి గ్రామంలో శాశ్వత సచివాలయ భవనాలు,రైతు భరోసా కేంద్రాలు,హెల్త్ సెంటర్లను,ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ది చేకూర్చడం అభివృద్ధికాదా అని ప్రశ్నించారు.అలాగే వేలకోట్లతో రామాయపట్నం పోర్టును65శాతం తమ ప్రభుత్వంలోనే పూర్తి చేయడం జరిగిందన్నారు.మిగిలిన పనిని పూర్తిచేయడంలో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ముందుకు సాగిన పరిస్థితి లేదని ఆయన విమర్శించారు.

**కందుకూరు నియోజకవర్గం అవినీతిమయం :**
కందుకూరు నియోజకవర్గంలో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా అవినీతిలో కూరుకుపోయిందన్నారు.రేషన్ మాఫియా విచ్చలవిడిగా రాజ్యమేలుతుందన్నారు.ప్రతిగ్రామంలో మద్యం బెల్టుషాపులుకు అడ్డూఆపూలేదన్నారు. గ్రావెల్‌ను ఇసుకను ఇష్టారాజ్యంగా అమ్ముకుంటున్నారిని ఆరోపించారు. ఈ విషయాన్ని మీ ఆనుకూల పత్రికలే పుంఖానుపుంఖాలుగా వార్తా కథనాలు రాస్తున్నట్లు పేపర్ కటింగ్స్‌ను ప్రదర్శించారు.పేదల బియ్యం పక్కదారి పడుతుందని తాను ఎన్నోసార్లు హెచ్చరించినట్లు తెలిపారు. అయినా సరిచేసుకోకుండా తనపై ఎదురుదాడికి దిగుతున్నట్లు ఆరోపించారు.ఇందులో బావాబామర్దులు దందాలు ఆపాలన్నారు.తనను వారానికొకసారి కందుకూరు వచ్చిపోతున్నట్లు వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు.తాను వ్యాపారస్తుడనన్నారు. తద్వారా సంపాయించుకున్న డబ్బుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు.అప్పుతెచ్చి అక్రమాలకు తెరతీయలేదన్నారు.రేషన్ అక్రమ రవాణాలో ఎన్ఫోర్స్మెంట్ డిటీతో ఓ మిల్లు ఓనర్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణను వినిపించారు.పేదల పక్షాన మా పోరాటం కొనసాగుతుందన్నారు.నియోజకవర్గంలో రేషన్‌మాఫియా గ్రావెల్ మాఫియా,లిక్కర్ మాఫియా,పేకాట శిబిరాలు ఆపాల్సిందేనన్నారు.వీటిని ప్రోత్సహిస్తున్న బావా బామర్దిలట్యాక్స్ దందాలు ఆపాల్సిందేనని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎటువంటి అవినీతి జరిగినా ఎత్తిచూపుతాము. ఎదల పక్షాన పోరాడుతాం వెనక్కి తగ్గేది లేదని మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ ఘాటుగా వివరించారు.

## మరమ్మత్తులకై విద్యుత్ సరఫరా నిలిపివేత



**వేటపాలెం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
సబ్ స్టేషన్, ఫీడర్ లైన్ల మరమ్మత్తు పనులు చేపట్టనున్నందున 14వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పి.వేదవ్యాస్ తెలిపారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కెపాల్ కాలనీ, దేశాయిపేట, రామనగర్, వేటపాలెం, అనుమల్లిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాల్సిందిగా తెలియజేశారు.

## బాల్య వివాహాలు నిర్మూలించాలి

**తాళ్లూరు, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**
బాల్య వివాహాలను నిర్మూలించాలని తూర్పు గంగవరం పీ హెచ్ సీ వైద్యాధికారిణి కె. మోనిక తెలిపారు. మండలంలోని బొద్దికూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల బాలికలలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు సుబ్బారావు,సిబ్బంది చంద్రశేఖరబాబు,ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యాంజలి 2.0 మండల స్థాయి శిక్షణా కార్యక్రమం



**వేటపాలెం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**
విద్యాంజలి 2.0 మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల, విద్యాకమిటీ చైర్మన్‌ల శిక్షణా కార్యక్రమం శుక్రవారం వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విజయవంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ, కోర్సు డైరక్టర్ కే.శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సమావేశంలో స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజినితో పాటు మండలంలోని 46 ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, విద్యా కమిటీ చైర్మన్‌లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. పాఠశాల మౌలిక వసతులు, బోధనా సౌకర్యాలు మెరుగుపరుచుకోవడానికి విద్యాంజలి పోర్టల్ ఏ విధంగా ఉపయోగపడుతుంది, వాలంటీర్స్‌ను ఎలా రిజిస్టర్ చేసుకోవాలి, పాఠశాలలను బలోపేతం చేయడానికి వారి సేవలను ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనే విషయాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమానికి గుమ్మా శ్రీనివాసావు, ఎం.రవికుమార్ రిసోర్సు పర్సన్‌గా వ్యవహరించారు.

CLASSIFIED

**PASSPORT LOST**
Passport was lost in Bus, I was travelling from Botlagudur to Pamur in bus journey on 30-01-2026, bearing number is **W5129175** issued on the name of **KOTAPATI RAMYA** S/o. **RAVINDRABABU KOTAPATI,** R/o. H.NO.6-201, Botlaguduru Village, Pamur mandal, Markapuram district Pin:523110, A.P. If anyone find it, please inform at the following mobile number : 94933 17029

## ఓం నమశ్శివాయ కనిగిరి ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

**కనిగిరి, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీ ప్రజలకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కనిగిరి పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడు కృపతో ప్రతి ఇంటా శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. శివనామ స్మరణతో మనసుకు ప్రశాంతత కలుగుతుందని, యువత సమాజ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఐక్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు. కనిగిరి పట్టణ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో మహాశివరాత్రి వేడుకలను జరుపుకుని సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు.

## కనిగిరి ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

### - దేవకి చెంచయ్య జువెలరీస్

**కనిగిరి, ప్రభాతవార్త**

కనిగిరి ప్రజలకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దేవకి చెంచయ్య జువెలరీస్ నిర్వాహకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు దేవకి శ్రీనివాసులు, దేవకి రాజీవ్ మాట్లాడుతూ పరమశివుడి అనుగ్రహంతో కనిగిరి ప్రజలందరికి ఆరోగ్యం, ఆయుష్షు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. శివనామ స్మరణతో ప్రతి కుటుంబంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని కోరుతూ, పట్టణ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని అభిలాషించారు.

### మహాశివరాత్రి సందర్భంగా కనిగిరి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన పువ్వాడి నాగరాజు

**కనిగిరి, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పువ్వాడి నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడి కృపతో ప్రతి కుటుంబంలో శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగగా పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తిభావంతో పండుగను జరుపుకుని ఐక్యంగా ముందుకు సాగాలని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, అలాగే ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో కనిగిరి నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కనిగిరి ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండదండలుగా నిలవాలని ఆయన కోరారు. కనిగిరి ప్రజలందరికి మరోసారి మహాశివరాత్రి శుభాభినందనలు తెలియజేశారు.

### కనిగిరిలో అసైన్డ్‌భూముల ఆక్రమణలపై ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలి

### - డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

**కనిగిరి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గంలో సుమారు 175 ఎకరాల అసైన్డ్ భూములను కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో కనిగిరి భూ సమస్యలపై మాట్లాడిన ఆయన,ఈ విషయంపై గతంలో స్పందన(గ్రీవెన్స్) కార్యక్రమాల్లోను, రెవెన్యూ సదస్సుల్లోను ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికి సంబంధిత అధికారులు సిబ్బంది లేరు, విచారణకు సమయం పడుతుంది అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. వెనుకబడిన ప్రాంతంగా భావించి కనిగిరికి అధికారులు రావడంలో ఆసక్తి చూపకపోవడం ఇప్పటికే ఉన్న తక్కువ సిబ్బందితో పనులు ముందుకు సాగకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని కనిగిరి రెవెన్యూశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అన్యాక్రాంతమైన పేదల అసైన్డ్‌భూములను రక్షించి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన గోపాల్ సిండికేల్ అధినేత పవన్‌కుమార్

**కనిగిరి, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కనిగిరి ప్రజలకు గోపాల్ సిండికేట్ అధినేత పవన్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగగా పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తి భావంతో పండుగను జరుపుకుని సమాజంలో ఐక్యత, సౌహార్ధత పెంపొందించాలని ఆయన సూచించారు. కనిగిరి ప్రజలందరికి మరోసారి మహాశివరాత్రి శుభాభినందనలు తెలియజేశారు.

## కనిగిరి ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన శ్రీ విష్ణు ట్రేడర్స్ అధినేత రాచపూటి వెంకటేశ్వర్లు

**కనిగిరి, ప్రభాతవార్త**

కనిగిరి ప్రజలకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ విష్ణు ట్రేడర్స్ అధినేత రాచపూటి వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడి అనుగ్రహంతో ప్రతి ఇంటా శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగగా పేర్కొన్నారు. కనిగిరి ప్రజలందరూ భక్తి భావంతో పండుగను జరుపుకునిసుభిక్షంగా ఉండాలనికోరుతూ,సమాజంలో ఐక్యత,సౌభ్రాతృత్వం పెంపొందాలని ఆకాంక్షించారు. కనిగిరి ప్రజలకు మరోసారి మహాశివరాత్రి శుభాభినందనలు తెలియజేశారు.

### కనిగిరి ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన పల్నాటి భాస్కర్‌రెడ్డి

**కనిగిరి, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త పల్నాటి భాస్కర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడి కృపతో ప్రతి కుటుంబంలో శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నిమయ నిష్ఠలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగగా పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తి భావంతో పండుగను జరుపుకుని సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించాలని సూచించారు. కనిగిరి ప్రజలకు మరోసారి మహాశివరాత్రి శుభాభినందనలు తెలియజేశారు.

### కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన తమ్మినేని వెంకటరెడ్డి

**కనిగిరి, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తమ్మినేని వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడి కృపతో ప్రతి కుటుంబంలో శాంతి, సుఖసంతోసాలు నెలకొనాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగగా పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తి భావంతో పండుగను జరుపుకుని ఐక్యతతో ముందుకు సాగాలని, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. కనిగిరి ప్రజలకు మరోసారి మహాశివరాత్రి శుభాభినందనలు తెలియజేశారు.

### కనిగిరి ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన ఎస్‌వి గోవర్ధన్‌రెడ్డి, పులి శాంతి

**కనిగిరి,ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వైసీపీ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు ఎస్‌వీ గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరమశివుడి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగగా పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తి భావంతో పండుగను జరుపుకుని ఐక్యతతో ముందుకు సాగాలని, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. కనిగిరి ప్రజలకు మరోసారి మహాశివరాత్రి శుభాభినందనలు తెలియజేశారు.

### కనిగిరి ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన మూలే బాలిరెడ్డి

**కనిగిరి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

కనిగిరి ప్రజలకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎంబీఆర్ ఫంక్షన్ హాల్ అధినేత, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మూలే బాలిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివుడి అనుగ్రహంతో ప్రతి ఇంటా శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగగా పేర్కొన్నారు. ప్రజలందరూ భక్తి భావంతో పండుగను జరుపుకుని సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించాలని సూచించారు. కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు మరోసారి మహాశివరాత్రి శుభాభినందనలు తెలిపారు.



**అద్దంకి కాకాని పాలెంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామచంద్రస్వామి వారికి మాఘమాస బహుళ ఏకాదశి శుక్రవారం సందర్భంగా స్వామివారికి జరిగిన అభిషేక దృశ్యములు**

నాగులుప్పలపాడు ,ప్రభాతవార్త

## కొర్లమడుగులో శివరాత్రి మహోత్సవాలు

**దర్శి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**





దర్శి మండలంలోని కొర్లమడుగు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత సోమేశ్వర స్వామి వారి 53వ వార్షిక కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఆలయ ధర్మకర్త శ్రీ కలవకొలను వెంకట సుబ్బయ్య శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం ఈ ఆలయం పురాతనమైందని, ఆలయానికి చాలా చరిత్ర ఉందని ఆయన తెలిపారు. ఈ పురాతనమైన శివాలయం భక్తులకు కొంగుబంగారమై, దైవంగా సంతాన ప్రదాతగా,కోర్కెలు తీర్చు శ్రీ సోమేశ్వర స్వామి వారిని దర్శించితరించాల్సిందిగా ఆలయకమిటీసభ్యులు తెలియజేశారు. 15వ తేదీ మహాశివరాత్రి రోజు ఉదయం 6గంటల నుండి ఒంటి గంట వరకు మహన్యాస పూర్వకంగా రుద్రాభిషేకం జరుగును. సాయంత్రం నాలుగు గంటలకు గ్రామోత్సవం స్వామివారి ఊరేగింపు నిర్వహించబడుతుంది. రాత్రి 9గంటలకు శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరుగును.రాత్రి 12గంటలకు లింగోద్భాకాలాభిషేకం జరుగును.భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని తమ తమ కోర్కెలు తీర్చుకోవాల్సిందిగా ఆలయం కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. శివరాత్రి పర్వదినం రోజు ఉదయం 9గంటల నుండి రాత్రి 1గంటల వరకు అన్న ప్రసాద వితరణ జరుగును.

## ప్రసన్నాంజనేయస్వామి హుండీ లెక్కింపు

**అద్దంకి , ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది.మొత్తం 30,41,065 రూపాయలు హుండీ ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో ఇఒ తిమ్మానాయుడు, చైర్మన్ మురళీ సుధాకరరావు, పాలకమండలి సభ్యులు నూతిప్రసాద్,నాగమ్మ,పద్మజ, కోటేశ్వరమ్మ,సుబ్బారావుతోపాటు బ్యాంకు సిబ్బంది.పోలీస్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వాసవీ,వనితా మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి సందర్బంగా మెగా లక్కీడ్రా

### - పెద్ద ఎత్తున బహుమతులు - ఆలయ నిర్మాణం కొరకు నిధులు వినియోగం

**అద్దంకి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి, వేలమూరిపాడు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయ నిర్మాణం కొరకు మెగా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 26తేదిన శ్రీరామనవమి సందర్భంగా వేలమూరిపాడు గ్రామంలో ఈ లక్కీ డ్రాను నిర్వహిస్తారని వెల్లడించారు. అయితే మొత్తం 1,116మంది సభ్యులతో ఒక్కొక్కరినుండి 1,116 రూపాయలను సభ్యత్వ రుసుంగా తీసుకొనున్నట్లు వివరించారు. మొత్తం 9 బహుమతులు వుంటాయని, వీరికి బహుమతులకు పోను మిగిలిన నిధులతో ఆలయ నిర్మాణం అభివృద్ధి కొరకు వినియోగిస్తారని ఈ కార్యక్రమంతా పారదర్శకంగా జరుగుందని, రోటరీ క్లబ్, వేలమూరిపాడు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ అందజేత

**అద్దంకి, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**



మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలురల ఉన్నత పాఠశాల అద్దంకి పదవ తరగతి 50 మంది విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ మానవత సభ్యుడు త్రివిక్రమ ఎంటర్ప్రైజెస్ ప్రొప్రయిటర్ తాత సురేష్ సౌజన్యంతో చైర్మన్ పాకనాటి మధుసూదన్ రెడ్డి, హెచ్‌ఎం బసవయ్య, ప్రెసిడెంట్ పేరం సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోనుగుంట శ్రీనివాసరావు, కోశాధికారి బి నాగార్జున, సభ్యులు భాష, ఉపాధ్యాయులు విద్యార్థులు కు అందజేశారు.

## అసెంబ్లీని సందర్శించిన కొరిశపాడు విద్యార్థులు

### - స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రి గొట్టిపాటితో భేటీ

**అద్దంకి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను వీక్షించేందుకు ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం, తమ్మవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శుక్రవారం అసెంబ్లీనిసందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీస్పీకర్ రఘురామ కృష్ణంరాజు,రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. "విద్యార్థి దశ నుండే విద్యార్థులలో రాజకీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఇలాంటి సందర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన చట్టసభలు ఎలా పనిచేస్తాయి, ప్రజల సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయి అనే అంశాలను ప్రత్యక్షంగా చూడటం ద్వారా విద్యార్థులకు మంచి అవగాహన కలుగుతుందని ఆయన తెలిపారు.సందర్భంగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, వారిని ఉన్నత లక్ష్యాల దిశగా పయనించాలని ఆకాంక్షించారు. తమ నియోజకవర్గ మంత్రి సమక్షంలో అగ్రనేతలను కలవడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.తమ్మవరం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు మొత్తం 44 మంది వుండగా, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పి ప్రసాద్, జి.అరుణ కుమారి, జి మాధవిలతలు వీరి వెంట వున్నారు

### శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో మంత్రి ఆనం, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డితో కలిసి

## పాల్గొన్న దేవకి వెంకటేశ్వర్లు

**కనిగిరి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం తరుపున దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి గురువారం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమంలో బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ రమేష్ నాయుడు పాల్గొన్నారు.అలాగే వాసవి సత్ర సముదాయాల అధ్యక్షుడు, శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యుడు దేవకి వెంకటేశ్వర్లు, ఇతర సభ్యులు హాజరయ్యారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రికి తీర్థప్రసాదాలు, శేష వస్త్రం, వేద ఆశీర్వచనం అందజేశారు. ముందుగా ఆలయ మర్యాదలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించాలని మంత్రి ఆలయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత న్యూట్రిషన్ శిక్షణ

**కనిగిరి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**





నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థులు, గృహిణులు,వ్యాపారుల కోసం ఐడియల్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో ఉచిత న్యూట్రిషన్ శిక్షణను ఈ నెల 14 వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు డైరక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.ఈ శిక్షణ వారం రోజుల పాటు కొనసాగుతూ, థియరీతో పాటు ప్రాక్టికల్ ట్రైనింగ్ కూడా అందించబడుతుందని ఆయన పేర్కొన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారు ఎవరైనా ఈ ఉచిత శిక్ష అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు.ఈ శిక్షణ కాలంలో న్యూట్రిషన్ వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు అలాగే న్యూట్రిషన్ కోర్సు నేర్చుకోవడం వల్ల పొందే ఆదాయ మార్గాలు, బాడీ చెకప్ ఏ విధంగా చేస్తారు. శరీరంలో ఎంత నీరు ఉంది,ఎంత ఫ్యాట్ ఉంది, చర్మంలో కొవ్వు స్థాయిలు, ఎత్తు బరువుల నిష్పత్తి, శరీరంలో కండరాల శాంత ఎంత ఉందో గుర్తించడం అన్నింటిని సులభంగా నేర్పించడం జరుగుతుందన్నారు.శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 9441126340 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

## విద్యుత్‌కు అంతరాయం

**సంతనూతలపాడు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం చిలకపాడు విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మత్తులు కారణంగా ఈనెల 14న శనివారం నాడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యాశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ టి.సంతోష్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా మండలంలోని మద్దులూరు,వేములపాడు, గొర్లమెట్ట,చిలకపాడు,గంగవరం,గుమ్మలంపాడు,ఎనికపాడు, బొడ్డువారి పాలెం, తక్కెళ్ళపాడు గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అంతరాయాన్ని గమనించాల్సిందిగా మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ టి.సంతోష్ కోరారు.

## శ్రీశైలం శిఖరం దృశ్య పునర్జన్మల విద్యుతే

**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**





శ్రీశైలం శిఖరం దృశ్య పునర్ జన్మదిన విద్యతే అన్న మాటే ఈ క్షేత్ర మహిమను చాటుతుంది. అంటే శిఖరాన్ని దర్శించిన వారికి మళ్లీ జన్మ ఉండదని భక్తుల నమ్మకం. శిఖరేశ్వర స్వామి ఆలయం శ్రీశైలం పర్వతశ్రేణులలో అత్యంత ఎత్తైన శిఖరంపై వెలసి ఉంది. ఈ శిఖరమే శ్రీపర్వతముగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ వీర శంకర స్వామి స్వయంభు లింగముగా వెలసినట్లు పురాణాలు చెబుతున్నాయి.స్కంద పురాణము,శివపురాణములు వివరముగా చెబుతున్నాయి.సర్వపాపాలు నశిస్తాయి.మోక్షము సిద్ధిస్తుంది. ఇక్కడ నుండి నంది కొమ్ముల సందులో నుండి శ్రీశైలంలోని గోపురం నుండి మల్లికార్జున లింగం కనిపిస్తుందని భక్తుల విశ్వాసం. ఇది చూసిన వారికి పునర్జమ్మ ఉండదని పురాణాలు చెబుతున్నాయి. ఆదిశంకరాచార్యులు ఈ ప్రాంతాన్ని దర్శించి శివ తత్వాన్ని లోకానికి చాటి చెప్పారు. అర్జునుడు పాశుపశాస్త్రం పొందిన ప్రదేశం ఇదేనని భారత భగవత కథనాలు చెబుతున్నాయి. శిఖరేశ్వరుని దర్శించుకునేందుకు భక్తులు సుదీర్ఘ కాలినడక ప్రయాణం చేస్తారు. మహాశివరాత్రి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శిఖరంపై నిలబడి చుట్టూ కనిపించే నల్లమల అరణ్య దృశ్యం ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్తుంది. పాప క్షయము జరిగి జన్మజన్మల బంధనాల నుంచి విముక్తి కలుగుతుందని నమ్మకం. అందుకే శిఖర దర్శనం జీవితానికి పరమ సార్థకం అంటారు. శిఖరేశ్వర స్వామి దర్శనం అంటే కేవలం ఆలయ దర్శనమే కాదు అహంకార శిఖరాన్ని అధిగమించి శివ సాక్షాత్కారానికి చేరుకునే ప్రయాణంగా భావిస్తారు. శిఖరేశ్వరం దర్శించే భక్తులు కొండపై వెలసిన రోలులో నువ్వులు, బెల్లము వేసి రోకలితో తిప్పుతారు. రోలు స్థిరమైన రాయి. రోలును పార్వతీదేవి శక్తికి సాంకేతికంగా భావిస్తారు. రోకలి కదిలే పరికరం. రోకలిని పరమేశ్వరుని చైతన్యంగా సూచిస్తారు. ఈ రెండింటి సంగమం శివ- శక్తుల ఐక్యమం సూచిస్తుంది. భక్తుడు తన అహంకారాన్ని రోలు రోకలితో ముద్ద చేసినట్టు మనసును మర్దనం చేసి పవిత్రం చేసుకోవాలనే భావన ఇందులో ఉంది. నువ్వులు(తిలలు) పవిత్రత, శాంతి, పాప క్షయాన్ని సూచిక. శైవ సాంప్రదాయంలో తిలాభిషేకం, తిల నైవేద్యం ద్వారా పాప పరిహారం లభిస్తుందని విశ్వాసం. తిలాలు సూక్ష్మమైనవి కావడం వల్ల జీవాత్మక యొక్క సూక్ష్మ స్వరూపమును సూచిస్తాయి. బెల్లం, మాధుర్యము,సామ్యత, సానుకూలతకు సాంకేతికము, భక్తుడు తన జీవితంలో మాధుర్యాన్ని, మంచితనాన్ని పెంచుకోవాలని సాంకేతికంగా సూచిస్తుంది. నువ్వులు బెల్లం కలిపి నైవేద్యం సమర్పించడం ద్వారా కఠినత(తిలము)లో మాధుర్యము(బెల్లం) కలగాలి అనే తాత్పర్యము వ్యక్తమవుతుంది. శకరేశ్వరం దర్శనం మనసులోని దుర్గుణాలను మర్దనము చేసి పాపాలను తొలగించి, జీవితం మాధుర్యంతో నింపుకొని శివ- శక్తి అనుగ్రహం పొందాలి.

## 108 అంబులెన్సు ఉద్యోగులకు ఆర్థిక పెంపుదల

**సంతమాగులూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



ఏపీ 108 అంబులెన్స్ సర్వీస్ లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఈఎంటి, పైలెట్లకు జీతాలు పెంపుదల చేయడంతో 108 వాహనసిబ్బంది రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం జీతంకు అదనంగా ప్రతి ఉద్యోగికి నెలకు 2000 రూపాయలను పెంచటంతో పాటు 5సం నుండి10సంలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమెటిక్ స్లాబ్ అప్గ్రేడేషన్ చేయాలని నిర్ణయించటం తో వారికి మరింత ఆర్థిక వెసులుబాటును అందించారు.108 అంబులెన్సు ఉద్యోగులకు అందించిన ఆర్థిక పెంపుదలను ఈ.యం.టి, పైలెట్లు అందరూ హర్షించారు. సంతమాగులూరు ఈ.యం.టి షేక్ ఖాదర్ మస్తాన్ అన్నారు. సంతమాగులూరు 108 సిబ్బంది కలిసి శుక్రవారం ఉదయం అంబులెన్సు ఎదుట నిల్చొని థాంక్యూ సిఎంసార్, థాంక్యూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ పి బాలకృష్ణ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ చైతన్య చక్రవర్తి పర్యవేక్షణలో మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ. యం.టి చెన్నయ్య, షేక్ ఖాదర్ మస్తాన్, అశోక్, పైలట్‌లు శ్రీకాంత్, నాగరాజులు పాల్గొన్నారు.

## సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన అద్దంకి 108 సిబ్బంది

**అద్దంకి , ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**



ఏపీ 108 అంబులెన్స్ సర్వీస్‌లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఈఎంటి, పైలెట్లకు జీతాలు పెంపుదల చేయడం తో 108 వాహన సిబ్బంది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం జీతంకు అదనంగా ప్రతి ఉద్యోగికి నెలకు 2000 రూపాయలను పెంచటంతో పాటు 5 సం నుండి 10 సంలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమెటిక్ స్లాబ్ అప్గ్రేడేషన్ చేయాలని నిర్ణయించటంతో వారికి మరింత ఆర్థిక వెసులుబాటును అందించారు.108 అంబులెన్సు ఉద్యోగులకు అందించిన ఆర్థిక పెంపుదలను ఈ.యం.టి, పైలెట్లు అందరూ హర్షించారు. అద్దంకి 108 సిబ్బంది కలిసి శుక్రవారం ఉదయం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో అంబులెన్సు ఎదుట నిల్చొని థాంక్యూ సిఎం సార్, థాంక్యూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అద్దంకి మండలానికి చెందిన జిల్లా కార్యదర్శి హరిబాబు,గ్రీవెన్స్ సభ్యులు కోటేశ్వరరావు, ఈఎంటి దివ్య, పైలెట్ క్రాంతి తదిరులు పాల్గొన్నారు.

## అద్దంకిలో ఎపి బార్ ఎలక్షన్ పోలింగ్

### - ఓటు హక్కు వినియోగించుకొన్న 66 మంది సభ్యులు





**అద్దంకి,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**

ఎపి స్టేట్ బార్ ఆసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి, పోలింగ్ పక్రియ శుక్రవారం జరిగింది. అద్దంకి కోర్టు భవనాల ప్రాంగణంలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియకు పిఒగా యడవల్లి శ్రీనివాసరావు వ్యవహరించగా, నలుగురు ఎజెంట్లుగా వ్యవహరించారు. అద్దంకి బార్ ఆసోసియేషన్‌లో 69 మంది సభ్యులు వుండగా, 66 మంది తమ ఓటు హక్కును వినియోగంచుకున్నారు.

## పేకాట రాయుళ్ళు అరెస్టు

**అద్దంకి, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**



స్థానిక గుర్రాలకాలనీలో పేకాట ఆడుతున్న 6 గురు వ్యక్తులను అద్దంకి పట్టణ సి.ఐ. ఎ.సుబ్బరాజు ఆధ్వర్యంలో పలువురుపోలీస్ సిబ్బంది ఆదుపులోకి తీసుకున్నారు.వీరి వద్ద నుండి 4190రూపాయలు నగదు,పేకలను స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు పోలీసులు వీరిని ఆదుపులోకి తీసుకున్నారు.

## రైల్వే స్టేషన్ కొరకు మసీదులో ప్రార్ధనలు

**అద్దంకి, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**



అద్దంకిలోని భవానీ సెంటర్‌లోగల మసీదు నందు అద్దంకి - రైల్వేస్టేషన్ సాధన సమితి అభ్యర్ధన మేరకు ముస్లీం సోదరులు ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు మానికొండ రవిశంకర్, పిట్టల మధుసూధనరావుతోపాటు అద్దంకి పట్టణ ముస్లీం సోదరులు, మాజీ కౌన్సిలర్ బాషాతోపాటు పలువురు పాల్గొన్నారు.

## మహిళా పారిశుధ్య కార్మికురాళ్ళకు ఘన సన్మానం

**చీరాల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



చీరాల ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్, ఈవినింగ్ వాకర్స్ స్మార్ట్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవంను నిర్వహించారు. ఏడుగురు పురపాలక సంఘం మహిళా పారిశుధ్య కార్మికురాలను ఘనంగా సత్కరించి నూతన వస్త్రములను బహుకరించారు. ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ మాట్లాడుతూ సరోజిని నాయుడు కవయిత్రి, భారత స్వాతంత్ర్య సమరయోధురాలు, రాజకీయ నాయకురాలు, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అనేక సార్లు జైలుకి వెళ్లి వచ్చారన్నారు. వితంతుల పునర్వివాహం కొరకు పోరాడిన మహోన్నత వ్యక్తి 147వ జయంతి జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, సుధాకరరావు, సుభాషిణి, భానుకుమారి, లాల్, పూర్ణ, నారాయణ, మధు, మురళీకృష్ణ, రవి, రాముడు, తుకారాం, రమణారావు తదితర వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై దాడికి అమెరికా సన్నాహాలు!

# అతిపెద్ద విమాన వాహక నౌకను మధ్య ప్రాచ్యంవైపు తరలిస్తున్న యుఎస్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 13:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకుంటున్న వేళ, ట్రంప్ ప్రభుత్వం తమ సైనిక శక్తిని ప్రదర్శిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక అయిన యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్‌ను కరేబియన్ సముద్రం నుంచి మధ్యప్రాచ్యం వైపు తరలిస్తోంది. ఇరాన్ పై సైనిక ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ చర్య తీసుకున్నట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొం టున్నాయి. ఇరాన్‌తో అణు కార్యక్రమం పై చర్చలు విఫలమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే హెచ్చరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం ఒమన్ వేదికగా ఇరు దేశాల మధ్య పరోక్షంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు కొలిక్కి రాకపోతే దాడులకు దిగేందుకైనా సిద్ధమేనని అమెరికా సంకేతాలిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో ఇప్పటికే యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక సమూహం మోహరించి ఉంది. ఇప్పుడు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరనుండటంతో ఆ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు శక్తివంతమైన విమాన వాహక నౌకలు అందుబాటులో ఉంటాయి. కరేబియన్‌లో ఉన్న జెరాల్డ్ ఫోర్డ్ స్ట్రైక్ గ్రూప్ అట్లాంటిక్ మహాసముద్రం, మధ్యధరా సముద్రం మీదుగా పర్షియన్ గల్ఫ్ వైపు పయనిస్తోంది. ఈ నౌకతో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ ప్రూయాన్స్, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి అత్యాధునిక డిస్ట్రాయర్లు కూడా ఈ బృందంలో ఉన్నాయి. ఈ విమానవాహక నౌక మే నెల ఆరంభం వరకు మధ్యప్రాచ్యంలోనే ఉండే అవకాశం ఉందని, దీంతో దీని మోహరింపు కాలం 10 నెలలకు పొడిగించవచ్చని తెలుస్తోంది. గతంలో వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించేందుకు అమెరికా చేపట్టిన సైనిక చర్యలో జెరాల్డ్ ఫోర్డ్ నుంచే యుద్ధ విమానాలు పాల్గొన్నాయని నివేదికలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని తీవ్రతరం చేసేందుకే అమెరికా ఈ చర్య తీసుకుందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ భారీ యుద్ధ నౌక తరలింపు పశ్చిమాసియాలో కొత్త ఆందోళనలకు దారితీస్తోంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

# అమలులోకి 'పిఎం - రాహత్'



## - రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స
## - వినూత్న పథకానికి ప్రధాని ఆమోదం
## - కర్తవ్యభవన్ 1,2 సేవాతీర్థ సముదాయాలను జాతికి అంకితం చేసిన ప్రధాని

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** భారతదేశ పరిపాలన వ్యవస్థలో ఒక చారిత్రాత్మక మార్పుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ శ్రీకారం చుట్టారు. దశాబ్దాల కాలం నాటి పాత మౌలిక సదుపాయాలకు స్వస్తి పలుకుతూ.. అత్యున్నత నిర్ణయాధికార సంస్థలన్నింటినీ ఒకే చోటకు చేరుస్తూ నిర్మించిన కర్తవ్య భవన్1, కర్తవ్య భవన్2, సేవా తీర్థ సముదాయాలను ఆయన జాతికి అంకితం చేశారు. ఇప్పటివరకు సెంట్రల్ విస్టాలోని వివిధ ప్రాంతాల్లో చెల్లాచెదురుగా ఉన్న కార్యాలయాలను ఇప్పుడు ఒకే ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లోకి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా.. ప్రధానమంత్రి కార్యాలయం, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్, క్యాబినెట్ సెక్రటేరియట్. దీనివల్ల శాఖల మధ్య సమన్వయం పెరగడమే కాకుండా పరిపాలనా పరమైన జాప్యం తగ్గి నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం కలుగుతుంది. అనంతరం నూతన పరిపాలనా కేంద్రం సేవా తీర్థలో తన కార్యాలయంలో కొలువుదీరిన ప్రధానమంత్రి మోడీ తనదైన శైలిలో పాలనా ముద్ర వేశారు. కేవలం భవనాల మార్పు మాత్రమే కాదు సామాన్యుడి మేలు చేకూర్చే దిశగా ప్రధాని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జనహితమే లక్ష్యంగా కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. రైతులు, మహిళలు, యువత, సామాన్య పౌరుల జీవితాల్లో వెలుగులు నింపేలా నాలుగు ప్రధాన పథకాలకు ఆయన ఆమోదం తెలిపారు. వాటిలో భాగంగానే ప్రమాదాల బారిన పడిన పౌరులను ఆదుకునేందుకు పిఎం రాహత్ పథకాన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ పథకం కింద ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందుతుంది. సకాలంలో వైద్యం అందక ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదనే లక్ష్యంతో ఈ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. అలాగే మహిళా సాధికారతలో భారత్ మరో మైలురాయిని అధిగమించింది. 3 కోట్ల మంది మహిళలను లఖ్పతి దీదీలుగా మార్చాలనే లక్ష్యాన్ని ఏడాది ముందే చేరుకోవడంతో, ప్రధాని ఈ లక్ష్యాన్ని ఇప్పుడు రెట్టింపు చేశారు. మార్చి 2029 నాటికి 6 కోట్ల మంది మహిళలను లఖ్పతి దీదీలుగా తీర్చిదిద్దాలని కొత్త లక్ష్యాన్ని నిర్దేశించారు. వీటితోపాటు అన్నదాతలకు అండగా ఉండాలనే లక్ష్యంతో వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించేందుకు ప్రధాని భారీ కేటాయింపులు చేశారు. గతంలో రూ.1 లక్ష కోట్లుగా ఉన్న వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని రూ.2 లక్షల కోట్లకు రెట్టింపు చేస్తూ సంతకం చేశారు. దీనివల్ల గ్రామాల్లో కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వేగవంతం కానుంది. భారత యువతలోని సృజనాత్మకతను ప్రోత్స హిం చేందుకు స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ఆమోదం తెలిపారు. రూ.10,000 కోట్ల భారీ కార్పస్‌తో ఈ నిధిని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా డీప్ టెక్నాలజీ, అధునాతన తయారీ రంగాల్లో కొత్త ఆలోచనలతో వచ్చే యువ పారిశ్రామికవేత్తలకు ఇది గొప్ప వరంగా మారనుంది. వీటితోపాటు పర్యావరణ హితానికి పెద్దపీట వేస్తూ ఈ సముదాయాలను 4స్టార్ జిఆర్ఐహెచ్ఎ గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించారు. ఇది దాదాపు 2.26 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దీనిని సుమారు రూ.1,189 కోట్ల వ్యయంతో నిర్మించారు. భవన అవసరాల కోసం సోలార్ ప్యానెల్స్, ఇతర ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం. అత్యాధునిక నీటి రీసైక్లింగ్, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలు. డిజిటల్ ఇంటిగ్రేషన్, స్మార్ట్ యాక్సెస్ కంట్రోల్స్, అత్యున్నత స్థాయి నిఘా వ్యవస్థలు వంటివి ఉంటాయి. కర్తవ్య భవన్1, 2 భవనాల్లో రక్షణ, ఆర్థిక, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, న్యాయ శాఖలతో సహా మొత్తం 11 కీలక మంత్రిత్వ శాఖలు కొలువుదీర నున్నాయి. పౌరుల సౌకర్యార్థం ఇందులో కేంద్రీకృత రిసెప్షన్, పబ్లిక్ ఇంటర్‌ఫేస్ జోన్‌లను ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రజలు తమ సమ స్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తప్పుతుంది. ఈ నిర్ణయాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం సేవా స్ఫూర్తి అన్నారు.

## న్యాయమూర్తులపై 8600కిపైగా ఫిర్యాదులు

### పార్లమెంటులో న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** దేశంలో పనిచేస్తున్న ప్రస్తుత న్యాయమూర్తులపై ఇప్పటివరకూ 8600వరకూ ఫిర్యాదులు వచ్చినట్లు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం ప్రకటించింది. 2016 నుంచి ఇప్పటివరకూ మొత్తం 8600కిపైగా ఫిర్యాదులు వచ్చినట్లు న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్‌మేఘ్‌వాల్‌వెల్లడించారు. 2024లోనే అత్యధికంగా 1170 ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. అంతర్గత వ్యవస్థల ద్వారా ఈ న్యాయమూర్తులపై ఫిర్యాదులను విచారణ చేస్తామని మంత్రి వివరించారు. 1997 మేనెలలో సుప్రీంకోర్టు రెండు తీర్మానాలను కూడా ఆమోదించింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు నిర్దేశించిన కొన్ని ప్రామాణికాలకు అనుగుణంగా ఈ విచారణ ఉంటుంది. ఇన్‌హౌస్ విచారణలే ఉంటాయని, జడ్జిలపై సరైన నిర్ణయం కూడా ప్రకటించడం జరుగుతుందని, అంతర్జాతీయంగా ఆమోదించిన విలువలనే న్యాయవ్యవస్థలో కూడా అమలు చేయడం జరుగుతుందని అన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులపై వచ్చే ఫిర్యాదులను కేవలం సుప్రీం ప్రధానన్యాయమూర్తి మాత్రమే స్వీకరిస్తారు. అలాగే హైకోర్టుల్లోని చీఫ్‌జస్టిస్‌లు హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చే ఫిర్యాదులు పరిశీలిస్తారు. ఉన్నతస్థాయి న్యాయవ్యవస్థలో వచ్చే ఫిర్యాదులపై కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పర్యవేక్షణ వ్యవస్థ సిపిజిరామ్స్ ద్వారానే పరిశీలన పరిష్కారం ఉంటుందని మంత్రి వివరించారు. వీటన్నింటినీ కేవలం సిజెఐ, లేదా హైకోర్టుల న్యాయమూర్తులవద్దకు పంపించడం జరుగుతుందన్నారు.

# ప్రధానిగా తారిక్‌రహమాన్ ఎంపిక లాంఛనమే!

### భారత్‌తో బిఎన్పీ వైఖరిపైనే ఇపుడు అంతటా చర్చ



**ఢాకా, ఫిబ్రవరి 13:** బంగ్లాదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) భారీ విజయం సాధించింది. దీంతో ఈ పార్టీ తరఫున తారిఖ్ రహమాన్ ప్రధానిగా ఎన్నిక ఏకపక్షం కానున్నది. ఒకప్పుడు దేశ బహిష్కరణకు గురైన తారిఖ్ బంగ్లాదేశ్ తిరిగొచ్చిన కొద్ది రోజుల్లోనే ఆయన ప్రధాని పదవి చేపట్టబోతుండటం విశేషం. తారిఖ్ రహమాన్ 17 ఏళ్ల దేశ బహిష్కరణకు గురై, బ్రిటన్‌లో ఉన్నారు. గత ఏడాది డిసెంబర్లో దేశానికి తిరిగొచ్చారు. రహమాన్ బంగ్లా మాజీ ప్రధాని ఖలిదా జియా తనయుడు. ఆమె అధికారంలో ఉన్న 2002-06 కాలంలో రహమాన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించి, అవినీతికి పాల్పడ్డాడని ఆరోపణలొచ్చాయి. దీంతో తన తల్లి ప్రభుత్వం కూలిపోయిన తర్వాత అతడిపై అవినీతి ఆరోపణలు రావడంతో 2007లో అప్పటి ప్రభుత్వం అరెస్టు చేసింది. 17 నెలలు జైలులో ఉన్నాడు. తర్వాత దేశ బహిష్కరణకు గురి కావడంతో బ్రిటన్ వెళ్లిపోయారు. తన తల్లి మరణంతో 17 ఏళ్ల తర్వాత గత ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్ తిరిగొచ్చాడు. ఈ సందర్భంగా అతడికి ఘన స్వాగతం లభించింది. ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తన తల్లి మరణం తర్వాత ఆయన ఆ పార్టీ బాధ్యతలు చేపట్టారు. గురువారం జరిగిన ఎన్నికల్లో పాల్గొని విజయం సాధించారు. తన పార్టీని విజయపథంలో నడిపించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత బీఎన్‌పీ అధికారంలోకి వచ్చింది. డార్క్ ప్రిన్స్‌గా పిలిచే అతడు తన తల్లి ప్రధానిగా ఉన్నప్పుడు షాడో పీఎంగా వ్యవహరించారు. బీఎన్‌పీ గతంలో ఇండియాతో వ్యతిరేక వైఖరి అవలంబించింది. ఆమె తల్లి ప్రధానిగా ఉన్న సమయంలో ఇండియాకు వ్యతిరేకంగా చాలా చర్యలు తీసుకుంది. భారత వ్యతిరేక శక్తులకు ఆమె ఆశ్రయం ఇచ్చారనే ఆరోపణలున్నాయి. వ్యాపార, వాణిజ్య పరమైన అంశాలు, జల వివాదాల్లో ఇరు దేశాల మధ్య అనేక విభేధాలు తలెత్తాయి. ఇప్పుడు ఆ పార్టీ ఎలా వ్యవహరిస్తుంది అనేది కీలకం. ఈ అంశంపై తారిఖ్ భిన్నంగా వ్యవహరించవచ్చని విశ్లేషకుల అంచనా. సమ్మిళిత బంగ్లాదేశ్ అంటూ ఆయన కొత్త నినాదం అందుకున్నారు. అంటే ఎవరితో శతృత్వం లేకుండా వ్యవహరిస్తామని చెప్పారు. దీంతో ఆయన ఇండియాతో ఎక్కువ విబేధాలు తెచ్చుకోకపోవచ్చని అంచనా. ఇండియాకు బంగ్లాదేశ్‌తో ఇప్పుడు సంబంధాలు బలపడటం చాలా కీలకం. రెండు దేశాల మధ్య దాదాపు 4వేల కిలోమీటర్ల సరిహద్దు ఉంది. సరిహద్దు భద్రత, శాంతి భద్రతలు, వ్యాపార, వాణిజ్య సంబంధాలు, బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రత వంటి అనేక అంశాల్లో ఇరు దేశాలు సమన్వయంతో పని చేయాల్సి ఉంది.

# డబ్బులు తీసుకోండి.. గట్టిగా 'విజిల్' వేయండి :విజయ్



**సేలం, ఫిబ్రవరి 13:** ఎన్నికల షెడ్యూల్ రాకముందే తమిళనాడు రాజకీయాలు రసవత్తరంగా మారాయి. టీవీకే పార్టీకి రాజకీయాల్లో అనుభవం లేదంటూ ప్రత్యర్థుల నుంచి వస్తున్న విమర్శలపై నటుడు, ఆ పార్టీ అధినేత విజయ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. తమకు దోపిడీల్లోనూ అనుభవం లేదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అధికార డీఎంకేపై విజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సేలంలో శుక్రవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో విజయ్ మాట్లాడుతూ నా ఓటు నా హక్కు. ఎవరూ దాన్ని కొనలేరు అంటూ ప్రతిజ్ఞ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో అనేక మంది వచ్చి మీకు వేల రూపాయలు ఇస్తారు. అది మీ డబ్బే దాన్ని తీసుకోండి. సొమ్ము తీసుకున్న తర్వాత గట్టిగా విజిల్ వేయండి అని విజయ్ తన పార్టీ గుర్తును ప్రస్తావించారు. ఈ పోరాటం డీఎంకే, టీవీకే మధ్యనే ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విజయ్ ఆరోపించారు. హామీలపై ప్రభుత్వం ప్రజలకు అసత్యాలు చెబుతూనే ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని మహిళలకు భద్రత ఉందంటూ సీఎం గొప్పలు చెబుతున్నారని, అయితే వారిపై నేరాలు ఎందుకు పెరుగుతున్నాయని టీవీకే చీఫ్ ప్రశ్నించారు. తాను ఏ పార్టీని దెబ్బతీయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి రాలేదని, రాష్ట్ర ప్రజల కోసం మాత్రమే వచ్చానని స్పష్టంచేశారు. రాజకీయాల్లో అనుభవం గురించి వచ్చిన విమర్శలపై మాట్లాడుతూ నా రాజకీయ అనుభవంపై అనేక మంది ప్రశ్నిస్తున్నారు. నన్ను ప్రశ్నించేవారికి దోపిడీల్లో కూడా అనుభవం ఉంది. కానీ మాకు అందులో కూడా అనుభవం లేదు అని కౌంటర్ ఇచ్చారు.

# చూపు కోల్పోయిన పాక్ మాజీ పిఎం ఇమ్రాన్‌ఖాన్

## జైలులో సాధారణ ఖైదీ కంటే దారుణ పరిస్థితి..



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 13:** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ జీవితం జైలులోనే ముగిసిపోయేలా ఉంది. అడియా జైలులో ఉన్న ఆయన ఆరోగ్యం ఇప్పటికే క్షీణించగా.. ప్రస్తుతం కంటిచూపు కూడా మందగించినట్టు కోర్టు నియమించిన మధ్యవర్తి (అమికస్ క్యూరీ) నివేదిక పేర్కొంది. ఒంటరిగా ఓ గదిలో నిర్బంధించి, ఉద్దేశపూర్వకంగా, అమానవీయంగా, చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపింది. ఈ మేరకు పాకిస్థాన్ సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీ సల్మాన్ సఫ్దర్ రూపొందించిన పూర్తిస్థాయి నివేదికలో భయానక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదిక ప్రకారం అనేక నెలలుగా ఆయన ఆరోగ్య సమస్యల గురించి జైలు అధికారులు పట్టించుకోకపోవడంతో కుడి కంటిచూపు 85 శాతం కోల్పోయారు. మాజీ ప్రధానిని ఒంటరిగా నిర్బంధించడం, సకాలంలో వైద్యసౌకర్యం అందజేయకపోవడం, కుటుంబ సభ్యులను కలవకుండా నిరోధించడం, న్యాయసహాయకులకు అనుమతి ఇవ్వకపోవడం వంటి దారుణమైన అంశాలను నివేదిక బయటపెట్టింది. ఈ పరిస్థితికి ప్రభుత్వం, పాకిస్థాన్ సైన్యమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. దాదాపు మూడు, నాలుగు నెలల కిందట అంటే గతేడాది అక్టోబరులో తన కంటి చూపు సాధారణంగా ఉండేదని అమికస్ క్యూరీకి ఇమ్రాన్‌ఖాన్ వివరించారు. ఆ తర్వాత నుంచి క్రమంగా తగ్గిపోయిందని, ఈ విషయం గురించి జైలు సూపరింటెండెంట్‌కు పదేపదే చెప్పినా ఎటువంటి స్పందన రాలేదని తెలిపారు. ఈ నిర్లక్ష్యం కారణంగా కుడి కంటిచూపు పూర్తిగా పోయిందని పేర్కొన్నారు. జైలులో మాజీ ప్రధాని మంత్రి పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని, ఆరోగ్య పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని లాయర్ సఫ్దర్ తన నివేదికలో ఆరోపించారు. 2023 అక్టోబరులో అడియాలా జైలుకు బదలీ అయినప్పటి నుంచి, ఇమ్రాన్‌ఖాన్ దాదాపు రెండు సంవత్సరాల నాలుగు నెలలుగా ఏకాంత నిర్బంధంలో ఉన్నారని నివేదిక ధ్రువీకరిస్తుంది. పలు అనారోగ్య సమస్యలు వేధిస్తున్నాయని, వ్యక్తిగత వైద్యుడ్ని చికిత్సకు అనుమతించలేదని ఇమ్రాన్ చెప్పారు. తన కుటుంబసభ్యులను కలవడానికి కూడా నిరాకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త జైలు సూపరింటెండెంట్ వచ్చిన తర్వాత తన భార్యను వారానికి ఒకసారి కలవడానికి అనుమతిస్తున్నారని ఇమ్రాన్ అన్నట్లు నివేదికలో పొందుపరిచారు.

# తమిళనాడులో స్టాలిన్ ఎన్నికల వరాలు!



**చెన్నై, ఫిబ్రవరి 13:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార డీఎంకే ప్రభుత్వం మహిళలకు మరో ఆకర్షణీయ కానుక అందించింది. కలైంజ్ఞర్ మహిళా హక్కుల పథకం కింద 1.31 కోట్ల మంది లబ్ధిదారులకు ముందస్తు మూడు నెలల ప్యాకేజీని విడుదల చేసింది. ముందస్తుగా రూ.3,000తో పాటు వేసవి ప్రత్యేక ప్యాకేజీ కింద మరో రూ.2,000 మొత్తం రూ.5,000 లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. ముఖ్యమంత్రి స్టాలిన్ సోషల్ మీడియాలో ఈ వివరాలు వెల్లడించారు. ఎన్నికల సాకుతో ఈ సాయాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్టాలిన్ విపక్షాలపై మండిపడ్డారు. ఈ కారణంగానే, ముందస్తుగా నిధులు విడుదల చేశామని తెలిపారు. మళ్లీ గెలిస్తే ప్రస్తుతం ఇస్తున్న నెలవారీ రూ.1,000 సాయాన్ని రూ.2,000కు పెంచుతామని హామీ ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఇచ్చే సామాజిక భద్రతా పింఛన్లను రూ.1,200 నుంచి రూ.2,000కు పెంచుతామని తెలిపారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఈ ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరగనున్నాయి. 2021లో డీఎంకే 133 స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

## ఏనుగుల దాడిలో ఆరుగురు దుర్మరణం

**రాంచీ, ఫిబ్రవరి 13:** జార్ఖండ్‌లోని హజీరాబాగ్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం ఏనుగుల దాడిలో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం చెందినట్లు అక్కడి అధికారులు ప్రకటించారు. ఒక చిన్నారి తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. మరణించిన వారిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారున్నట్లు అధికారులు తెలిపారు. ఆ రాష్ట్రంలో కొద్ది రోజులుగా ఏనుగుల దాడులు తీవ్రతర మయ్యాయి. ఏనుగుల గుంపులు గ్రామంలోకి చొరబడి ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ఒక ఏనుగుల గుంపు చుర్చూ బ్లాక్ ప్రాంతంలోని గోండ్వార్ గ్రామంలోకి ప్రవేశించి ప్రజలపై దాడి చేశాయి. ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో గాయపడిన ఆరుగురు శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు.

## సంక్షిప్తంగా..

### రణ్‌వీర్, రోహిత్‌శెట్టిలకు బిష్ణోయ్‌గ్యాంగ్ బెదరింపులు



**ముంబయి, ఫిబ్రవరి 13:** బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్‌వీర్‌ను, అతడి దగ్గర పనిచేస్తున్న వారినీ చంపేస్తానని బిష్ణోయ్ అనుచరుడి పేరుతో ఓ దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి ని కూడా ఇదే తరహాలో బెదిరించాడు. ఈ మేరకు వాట్సాప్‌లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం. ఈ బెదిరింపు సందేశంతో బాలీవుడ్ లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు.

తన డిమాండ్లను అంగీకరించకపోతే ఆ సెలెబ్రిటీలతోపాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు. భవిష్యత్తులో ఏడు తరాలకు గుర్తుండి పోయేలా హత్య జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు.

### విజయ్ ర్యాలీలో గుండెపోటుతో ఒకరి మృతి

**చెన్నై, ఫిబ్రవరి 13:** సినీ నటుడు, టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. తమిళనాడులోని సేలంలో జరిగిన ఎన్నికల ర్యాలీకి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. విజయ్ మాట్లాడుతుండగా ఓ వ్యక్తి స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడిని మహారాష్ట్రకు చెందిన సూరజ్(37)గా గుర్తించారు. ఉపాధి నిమిత్తం అతడు కొన్నేళ్ల క్రితం కుటుంబంతో సహా సేలానికి వచ్చాడు. కొంత కాలంగా అతడు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. మరోవైపు కరూర్ తొక్కిసలాట వంటి పరిస్థితులు తలెత్తకుండా విజయ్ ర్యాలీల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

### లోధా డెవలపర్స్ రాజేంద్ర లోధా అరెస్ట్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** లోధా డెవలపర్స్ లిమిటెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీ మాజీ డైరెక్టర్ రాజేంద్ర లోధాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. మనీల్యాండరింగ్ కేసులో అతన్ని ఈడీ అదుపులోకి తీసుకున్నది. కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో సభ్యుడిగా ఉన్న సమయంలో రాజేంద్ర లోధా సుమారు 85 కోట్ల అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మనీల్యాండరింగ్ కేసులో రాజేంద్ర లోధాను కస్టడీలోకి తీసుకునేందుకుగురువారమే ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎల్‌డీఎల్ కంపెనీకి కావాలనే ఆయన సుమారు 85 కోట్ల నష్టానికి కలగచేసినట్లు లోధాపై ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో క్రైం బ్రాంచ్ కేసులో ఆయన్ను అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన జుడిషియల్ కస్టడీలో ఉన్నారు.

### పంజాబ్ మాజీ సిఎం అమరీందర్ ఆయన కుమారుడికి ఇడి నోటీసులు



చండీఘర్, ఫిబ్రవరి 13: పంజాబ్‌మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ బిజెపి నాయకుడు కెప్టెన్ అమరీందర్‌సింగ్, ఆయన కుమారుడు రణీందర్‌సింగ్‌లకు సమన్లు జారీచేసిన ఈడీ అధికారిని చెన్నైకు బదిలీచేయడం ఇపుడు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగించింది. ఫెమా చట్ట నిబంధనలు ఉల్లంఘించారన్న కేసులో ఏజెన్సీ అదనపు డైరెక్టర్ జలంధర్‌లోపనిచేస్తున్న 2009 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి రవితివారిని బదిలీచేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జలంధర్‌లో 2023 సెప్టెంబరులోచేరిన తివారిని చెన్నైకు బదిలీచేసారు.

ఆయన స్థానంలో దినేష్ పచౌరిని నియిమంచారు. గురు,శుక్రవారాల్లోనే రణిందర్, అమరీందర్‌లు హాజరుకావాలని సమన్లుజారీచేసిన సంగతి తెలిసిందే.



# భారత్‌లో రోల్స్ రాయిస్ విస్తరణ ప్రణాళికలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** రోల్స్ రాయిస కంపెనీ ఇండియాలో తన వ్యాపార విస్తరణ ప్రణాళికలు అమలుచేస్తోంది. యుద్ధ విమానాల తయారీకి సంబంధించిన ఏరో ఇంజిన్లను అభివృద్ధి చేసేందుకు ఆ కంపెనీ ఆసక్తి ప్రదర్శిస్తున్నది. రక్షణ, పౌరవిమానయాన, ఎనర్జీ రంగాల్లోనూ రోల్స్ రాయిస్ కంపెనీ తన భాగస్వామ్యాన్ని విస్తరించనున్నది.

భారత్‌కు అవసరమైన 120 కిలో న్యూటన్ క్లాస్ యుద్ధ విమాన ఇంజిన్‌ను అభివృద్ధి చేయనున్నామని, దీని కోసం యూకే ప్రభుత్వంతో సహా భారత్ ఆసక్తిగా ఉన్నట్లు కంపెనీ తన ప్రకటనలో చెప్పింది. కో డెవలప్మెంట్‌లో భాగంగా పూర్తి స్థాయిలో టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. ఐపీ ఓనర్‌షిప్ కూడా ట్రాన్స్‌ఫర్ కానున్నది. ఈ నేపథ్యంలో రోల్స్ రాయిస్ సీఈవో టుఫాన్ ఎరిగిన్ బిల్‌జిక్ ప్రధాని మోదీని కలిశారు. భారత్ ప్రగతిలో భాగస్వామ్యం కావాలనుకుంటున్నట్లు రోల్స్ రాయిస్ సీఈవో తెలిపారు.

# హసీనా అప్పగింతకు భారత్‌పై బిఎన్పీ ఒత్తిడిపెంచే ఛాన్స్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో బిఎన్పీ అనూహ్య విజయం సాధించిన వేళ ఆపార్టీ ప్రభుత్వం ఏర్పాటుచేస్తే భారత్‌పై తన వ్యూహాలు మారుస్తుందన్న ఊహాగానాలుపెరిగాయి. ప్రధానంగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలన్న ఒత్తిడిని పెంచవచ్చన్న భావన వ్యక్తం అవుతోంది. సీనియర్ బిఎన్‌పి నేత సలాహుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ చట్టపరమైన విధానాలతో తమ పార్టీ ప్రబుత్వం హసీనాను వెనక్కు రప్పించేందుకు కృషిచేస్తుందని అన్నారు. మా విదేశాంగమంత్రి ఇప్పటికే ఆమెను స్వదేశానికి రప్పించేందుకు కస రత్తులు ప్రారంభించారని, మేం ఆ కార్యాచరణకు మద్దతిస్తామని చెప్పారు. చట్టపరమైన అప్పగింతనే తాము స్వాగతిస్తామన్నారు. రెండు దేశాల విదేశాంగమంత్రిత్వశాఖల మధ్య ఈ వివాదం నడుస్తోందన్నారు. అధికారం నుంచి దిగిపోయినప్పటినుంచి బంగ్లాలో జరిగిన తిరుగుబాటుతో హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. 2025 నవంబరులోనే బంగ్లా ప్రత్యేకట్రిబ్యునల్ ఆమెపరోక్షంలో మరణశిక్ష విధిం చింది. 2024 నిరసనలను హింసాత్మకంగా అణిచివేసిన నేరాలు ఆమెపై నమోదుచేసి ఆమె పరోక్షంలోనే విచారణజరిపి మరణశిక్ష విధించారు

# బిఎన్పీ విజయంపై తారిక్ రెహమాన్‌కు ప్రధానిమోడీ ఫోన్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** బంగ్లాదేశ్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత తారిక్ రహ్మాన్‌కు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. గురువారం బంగ్లాదేశ్ 13వ జాతీయ పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. మాజీ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాత జరిగిన తొలి ఎన్నికలు ఇవే. వెలువడుతున్న అనధికారిక ఫలితాల ప్రకారం 17 ఏళ్ల ప్రవాసం తర్వాత ఇటీవలే దేశానికి తిరిగి వచ్చిన తారిక్ రహ్మాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ పార్టీ 300 స్థానాల పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీని కైవసం చేసుకుంది. ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. "బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎన్‌పీని ఘన విజయపథంలో నడిపించినందుకు మీకు నా హృదయపూర్వక అభినందనలు.





## హంస, యాళీ వాహనాలపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం స్వామి అమ్మవార్లుహంస, యాళీవాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో ఏర్పాట్లలో ఆలయాధికారులు సిబ్బంది నిమగ్నమై ఏర్పాట్లను పరుగులు పెట్టిస్తున్నారు. ఉదయం స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా అలంకరించారు. రాజేష్, సూరి గురుకుల్స్ స్వామి అమ్మవార్లతో పాటు పంచమూర్తులను చక్కగా ముస్తాబు చేయగా చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఓ డి.బాపిరెడ్డి హారతులిచ్చి గ్రామోత్సవానికి తరలించారు. వివిధ వాయిద్య బృందాలతో భక్తుల్ని గుర్రాలు కల్పిస్తూ ఉత్సవాన్ని శివయ్య గోపురం, రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. స్వామి వారిని బంగారు హంస వాహనంపై, అమ్మవారిని బంగారు యాళీ వాహనంపై ప్రతిష్ఠించారు. స్వామి అమ్మవార్ల ముందు వినాయకుడు, వల్లీదేవ సేన సమేత సుబ్రమణ్య స్వామి, కన్నప్ప వెళుతుండగా కోలాటాల బృందాలు కోలాటాలతో భక్తులను ఆకర్షించారు. ఉత్సవాలను టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, దఫేదార్ రాజులు పర్యవేక్షించారు. ఊరేగింపు సందర్భంగా సిఐ ప్రకాష్‌కుమార్ సూచనలతో ట్రాఫిక్ గోవింద వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డిలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలను దారి మళ్ళించారు. గ్రామోత్సవం తేరువీధి, నెహ్రూ వీధి, సినిమావీధి, బాబూ అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల గుండా సాగింది.



## పుష్ప ప్రియుడు శ్రీశైలం మల్లన్న

శ్రీశైలం ప్రాజెక్టు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: మహాశివరాత్రిని పురస్కరించుకుని సనాతన దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహించబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజైన శ్రీ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. తరువాత యాగశాలయందు శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు చేశారు. లోకకల్యాణం కోసం జపాలు, పారాయణలు నిర్వహించారు. మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, నిత్యహవనాలు, రుద్రహోమం, చండీహోమం ఆగమ శాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి. సాయంకాలం ప్రదోషకాల పూజలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు, హోమాలు జరిపించబడుతాయి. శుక్రవారం రాత్రి శ్రీస్వామి అమ్మవార్లకు పుష్ప పల్లకీసేవ జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక పూజలు జరిపారు. తదుపరి పుష్పపల్లకి మేళతాళాలతో శ్రీ స్వామి అమ్మవార్లను తోడ్కొని వచ్చి వివిధపుష్పాలతో అలంకరించబడిన పుష్ప పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ఈ విశేషసేవలో ఎర్రబంతి, పసుపు బంతి, తెల్లచేమంతి, పసుపు చేమంతి, కనకాంబరాలు, డచ్ రోస్, అశోక పత్రాల మాల, కాగడాలు, గ్లాడియేలస్, అస్పెర్ గ్రాస్, జబ్రా, కార్నేషన్, ఆర్కిడ్స్, నందివర్ధనం, గరుడవర్ధనం పుష్పాలను వినియోగించడం జరిగింది.

## ముగిసిన బార్ కౌన్సిల్ ఎన్నికల పోలింగ్

- 23 పోస్టులకు 143 మంది పోటీ
- 16 నుంచి ఓట్ల లెక్కింపు

విజయవాడ కార్పొరేషన్/ గుంటూరు (లీగల్), ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించారు. బార్ కౌన్సిల్‌లో 18 జనరల్, 5 మహిళ సభ్యుల పోస్టులకు గాను రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 143 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. గత కౌన్సిల్లో సభ్యులుగాఉన్న 19మంది తిరిగి పోటీ చేశారు. ఉదయం 10.30 నిమిషాల నుండి ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఎన్నిలల్లో పోటీలో నిలబడిన అభ్యర్థులతో పాటు పలువురు న్యాయవాదులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవి శేషసాయి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. సాధారణ ఎన్నికల కంటే హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. ఎవరి స్థాయిలో వారు తమకు అవకాశం ఉన్న మేరకు శతవిధాల న్యాయవాదుల నుండి ఓట్లు రాబట్టుకునేందుకు కృషి చేశారు. మునుపెన్నడూ లేనంతగా ఈసారి ఎన్నికలలో అత్యధికమంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలువురు అభ్యర్థులు న్యాయవాద ఓట్లు కోసం రాజకీయ నాయకుల మద్దతు కూడా తీసుకోవటం కొసమెరుపు. మద్యం, ధనం కూడా ప్రవాహమై పారాయి. కొన్ని ఓట్లు పదివేల రూపాయలు పైచిలుకు పెట్టి కూడా కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ నెల 16న అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆవరణలో కౌంటింగ్ మొదలవుతుందని న్యాయవాద వర్గాలు తెలిపాయి.

# శ్రీకాళహస్తి అభివృద్ధిలో పరుగు

## రూ.30 కోట్ల కైలాసగిరి రోడ్డును వర్చువల్‌గా ప్రారంభించిన డి.సిఎం పవన్‌కల్యాణ్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాత వార్త: కూటమి ప్రభుత్వంలో ఆధ్యాత్మిక చింతన కల్గిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం శ్రీకాళ హస్తీశ్వరాలయం రూ.30 కోట్లతో రెండు దశల్లో నిర్మించిన 22కిలోమీటర్ల సిమెంటు రోడ్డును వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సందేశమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 42 ఆలయాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. మహాశివరాత్రి హిందూ ధర్మానికి, సనాతనాచారానికి అనుగుణంగా జరుపుకుంటున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి పంచభూత లింగాల్లో ఒకటైన వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో కైలాసగిరి ప్రదక్షిణకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఇది సత్యవ్రతభాస్కర క్షేత్రం కాబట్టి తాను ఒక సారి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటానని పవన్ కల్యాణ్ వివరించారు. సనాతన ధర్మపరిరక్షణలో అందరికంటే ఒక అడుగు ముందుండే వ్యక్తి చంద్రబాబు నాయుడు అన్నారు. అలాంటి నాయకుని సారధ్యంలో పనిచేయటం తన అదృష్టమన్నారు. శ్రీకాళహస్తిలోని కైలాసగిరి పర్వతపంక్తులో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించటం తన అధృష్టమన్నారు.

**5821 ఆలయాలకు ధూపదీప నైవేద్యాలకు నిధులు:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేవాదాయశాఖకు అనం రామనారాయణరెడ్డిని మంత్రిగా నియమించారని ఆయనకు ఆలయాల పట్ల మంచి పట్టు ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని 5821 ఆలయాలకు ధూప దీన నైవేద్యం పథకంలో ఒక్కొక్క ఆలయానికి నెలకు రూ.10వేలు చొప్పున నిధులు విడుదల చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. 2017 పుష్కరాల సందర్భంగా పురాతన ఆలయాల పరిరక్షణలో భాగంగా 495 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.608 కోట్లు నిధులు కేటాయించి పనులు చేపట్టినట్లు వివరించారు. ఏజెన్సి ప్రాంతాల్లో వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీవాణి ఆలయాల పేరిట టిటిడి ఆర్థిక సహాకారంతో 5వేల ఆలయాలకు రూ.750 కోట్లు కేటాయించినట్లు, ఇప్పటికే 697 ఆలయాలకు రూ.113.25 కోట్లు నిధులు మంజూరు చేస్తూ అనుమతులివ్వటం ఒక్క కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం అన్నారు. 1561 ఆలయాలకు పాలక మండళ్లు నియమించాల్సి ఉంటే 1,002లకు నియమించామన్నారు. గోదావరి పుష్కరాల పేరిట 31 ప్రధాన ఆలయాలను రూ.37 కోట్లతో అభివృద్ధి చేస్తూ 'ఆంధ్రప్రదేశ్‌ను ఆధ్మాత్మిక ఆంధ్రప్రదేశ్'గా తిర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ కార్యదర్శి జవహర్‌లాల్ శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, తిరుపతి ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు హాజరు కాగా సిమెంటు రోడ్డును ప్రారంభించారు. వర్చువల్ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తీశ్వరాలయ ఆలయ చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, హస్తకళల అభివృద్ధి బోర్డు చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.

# శ్రీముఖలింగేశ్వర ఉత్సవాల్లో లోపాలు ఉండకూడదు

- చక్రతీర్థ స్నానాలపై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన విశాఖపట్నం రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ

శ్రీకాకుళం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం, శ్రీముఖలింగం గ్రామంలోని ప్రసిద్ధ శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుండి 18 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి లోపాలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. ఆదివారం జరిగే శివరాత్రి వేడుకలతో పాటు, ముఖ్యంగా (ఫిబ్రవరి 18)వంశధార నది పరివాహక ప్రాంతంలో నిర్వహించనున్న చక్రతీర్థ స్నానాలు లక్షలాది మంది భక్తులను ఆకర్షించే అవకాశమున్నందున, అక్కడ భద్రతా ఏర్పాట్లు, రాకపోకల నియంత్రణ, క్యూలైన్ వ్యవస్థ, బ్యారికేడింగ్, అత్యవసర మార్గాలు, పార్కింగ్ స్థలాలు తదితర అంశాలను రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, గర్భగుడి క్యూలైన్లు, చక్రతీర్థ ఘాట్ ప్రాంతం, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను సమీక్షించారు. ఇతర శాఖలతో సమన్వయం చేస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు, స్పెషల్ పార్టీ ఫోర్స్, రోప్ పార్టీ, లా అండ్ ఆర్డర్ సిబ్బందితో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి నిరంతర నిఘా ఉంచుతున్నామని తెలిపారు. పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ద్వారా మార్గదర్శకాలు, వైద్య శిబిరాలు, త్రాగునీటి సదుపాయాలు, సముచిత లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 18న స్వామివారి ఉత్సవ విగ్రహాలు నంది వాహనంపై ఆలయం నుండి బయలుదేరి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంశధార నది



పరివాహక ప్రాంతానికి చేరుకుని చక్రతీర్థ స్నానాలు నిర్వహించనున్న నేపథ్యంలో మార్గమధ్యంలో ఇరువైపులా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, భక్తుల నియంత్రణకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రశాంతంగా స్నానాలు జరిగేలా సమగ్ర కార్యాచరణ రూపొందించామని అధికారులు పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శివరాత్రి, చక్రతీర్థ స్నానాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశమున్నందున తగిన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు, రెవెన్యూ, ఆలయ అధికారులు పరస్పర సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. బందోబస్తు కార్యాచరణ వివరాలు రేంజ్ ఐజికి జిల్లా ఎస్పీ వివరించారు. భక్తులు పోలీసు సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో పోలీసు, రెవెన్యూ, ఆలయ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# న్యాయమే గెలిచింది!

- మూడేళ్ల పోరాటంలో జాహ్నవి కుటుంబానికే న్యాయం
- అమెరికాలో 2023 జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జాహ్నవి
- పోరాట ఫలితం రూ.262 కోట్లు పరిహారం
- మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం కుంబలనూరు క్యాంప్ వాసి



కోసిగి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: న్యాయం అనేది అందరికి సమానమేనని దానిని ఆశ్రయించిన వారికి తప్పకుండ న్యాయ దేవత కరుణిస్తుందని జాహ్నవి సంఘటన ద్వారా బయట పడింది. మూడేళ్లు దేశం కానీ దేశంలో న్యాయపోరాటం చేసిన జాహ్నవి(23) కుటుంబం ఎట్టికేలకుపరిహారం అందించాలని అమెరికా కోర్టు తీర్పు చెప్పింది. దీంతో అమెరికా డాలర్లు 29 మిలియన్ డాలర్లు అందించాలని, భారత దేశ కరెన్సీ ప్రకారం అయితే రూ.262 కోట్లను జాహ్నవి కుటుం బానికి అందించాలని తీర్పు వెలువడింది. మారుమూల గ్రామం కౌతాళం మండలం కంబలనూర్ క్యాంప్ నుండి ఉన్నత చదువుల కోసం జాహ్నవి గత 2021వ సంవత్సరంలో అమెరికాలోని సౌత్ అలేఖ్య నార్తు ఈస్టన్ యూనివర్సిటీలో మాస్టర్సు డిగ్రీ కోసం అక్కడికి వెళ్లింది. కాగా అక్కడనే చదువుకుం టున్న జాహ్నవి 2023 జనవరి 23న రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురైంది.. వేగంగా వచ్చిన అక్కడి పోలీసు పెట్రోలింగ్ వాహనం ఈమెను ఢీ కొనడంతో తీవ్ర ప్రమాదానికి గురై అక్కడే ప్రాణాలు కోల్పోయింది. అయితే ఈ ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్‌డేవ్ ఈ సంఘటనను తేలికగా తీసుకుని రోడ్డు ప్రమాదాలు సహజమే ఈమె మృతికి విలువ లేదంటూ వ్యాఖ్యలు చేసారు. అంతేకాక గట్టిగ అడిగితే 11 వేల డాలర్లు ఇస్తు సరిపోతుందనే మాట అప్పట్లో దుమారం రేపింది. ఈ అనుచిత వ్యాఖ్యలు దేశంలో అందరికి ఆగ్రహానికి గురిచేసింది. ఆమె ప్రాణానికి విలువ తేదన్నట్టుగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. భారతీయులే కాకుండా అమెరికా పౌరులు కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.. ఈ వ్యాఖ్యలకు పరిహారంగా అప్పుడే ఉద్యోగం కోల్పోయిన ఆ అధికారికి మళ్లీ నేడు ధర్మాసనం తీర్పు ఒక చెంప పెట్టులాంటిదని అమెరికాలోని భారతీయ విద్యార్థులు పేర్కొంటునా న్నరు.

**జాహ్నవి కుటుంబ నేపథ్యం:** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజక వర్గంలోని కౌతాళం మండలం నదీతీర ప్రాంతమైన కుంబలనూరు క్యాంప్ వారి నివాసం. విజయలక్ష్మి స్కూల్ టీచర్ కాగా, తండ్రి శ్రీకాంత్ పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ తమకు ఉన్ న ఇద్దరు ఆడ పిల్లలను చదివిస్తునా న్నరు. అయితే ఉన్నతంగా తన పిల్లలు చదవాలని ఇద్దరు దంపతులు ఆదోనికి తమ మకాం మార్చారు. ఆదోనిలో తిరుమల నగర్‌లో నివాసం ఉంటున్న వారు తన పెద్ద కుమార్తె జాహ్నవిని ఉన్నత చదువులు కోసం 2021లో అమెరికాకి పంపారు. ఉన్నత చదువుల కోసం వెళ్లిన తన కుమార్తె రెండేళ్లకే మృతి చెందిన సంఘటనను తండ్రి జీర్ణించుకోలేక పోయాడు. ఈ విషయంలో సియాటెల్ సిటీ అధికారులే తన కుమార్తె మరణానికి కారణమని 110 మిలియను డాలర్లు పరిహారంగా చెల్లించాలని జాహ్నవి కుటుంబం 2024 సెప్టెంబరులో కోర్టులో దావా వేసింది.

**జాహ్నవి మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి మృతి:** కోర్టులో వేసిన దావా ఎన్నాళ్లకు తీర్పు వస్తుందోనని కుమిలి, కుమిలి జాహ్నవి తండ్రి ఈ నెల 11వ తేదిన ఆదోనిలోని తిరుమల నగర్‌లో మృతి చెందాడు. తీవ్ర విషాదంలో ఉన్న ఈ కుటుంబంలో తల్లి విజయలక్ష్మితో పాటు చెల్లెలు మాత్రం ఇంట్లో ఉనా న్నరు. గురువారం తండ్రి మూడో రోజు కర్మకాండ చేస్తుండగానే వీరి కుటుంబానికి రూ.262 కోట్లు పరిహారం వచ్చినట్లు సమాచారం రావడం విశేషం. అయితే ఈ విషయం ఇంకా ఈ కుటుంబానికి తెలియలేదు. త్వరలోనే బాధిత కుటుంబానికి భారత ఎంబసీ ద్వారా ఈ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రూ.10 వేల లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ డిటి



- పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో సోదాలు
- నిందితుడు అరెస్టు... కోర్టుకు తరలింపు

పులివెందుల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో అవినీతి ముసుగు చీలింది. శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి, లంచం స్వీకరిస్తున్న డిప్యూటీ తహసిల్దార్ నాగేంద్ర కుమార్ బాబును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన జిల్లాలో సంచలనం రేపింది. కడప ఏసీబీ డీఎస్పీ సీతారామారావు నేతృత్వంలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో, పదివేల రూపాయలు లంచంగా స్వీకరిస్తున్న సమయంలో అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి నగదు మరియు సంబంధిత ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. మసీదు భూముల కేసులో లంచం డిమాండ్‌తో బాధితుడు, ఏసీబీ అధికారులు ఉచ్చు బిగించారు. చక్రాయపేట మండలంలోని ఖాద్రియ మసీదుకు చెందిన సుమారు 40 ఎకరాల ఈనామ్ భూములు కొందరు వ్యక్తులు ఆక్రమించి, తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకుని పట్టాదారు పుస్తకాలు పొందినట్లు ఫిర్యాదు వచ్చింది.కుమార కాలువ గ్రామానికి చెందిన కరీముల్లా 2024లో జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా ఫైల్ ప్రాసెస్ చేస్తామని చెప్పిన డిప్యూటీ తహసిల్దార్ నాగేంద్ర కుమార్ బాబు పాసుబుక్కులను రద్దు చేసి భూములను తిరిగి మసీదు పేరున మార్చాలంటే పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు దీంతో బాధితుడు ఏసీబీ అధికారు లను సంప్రదించగా, అధికారులు ఉచ్చుపన్ని కార్యాలయంలోనే లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్నారు. అదుపులోకి తీసుకున్న నాగేంద్ర కుమార్ బాబును ఈ సంఘటనలో ఇంకా ఏ అధికారుల ప్రమేయం ఉందో అనే విషయం మీద ఏసీబీ డీఎస్పీ విచారిస్తున్నారు. అరెస్టు చేసిన డిప్యూటీ తహసిల్దార్ నాగేంద్ర కుమార్ బాబును విచారణ అనంతరం కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

## ఆర్టీసీ డిపోలు ప్రై'వేటు'కు వాస్తవం కాదు

సచివాలయం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ప్రజలకు పర్యావరణహిత, కాలుష్య రహిత బస్సులతో మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం "పీఎం ఈ-బస్సు సేవ" పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని 11నగరాల్లో 12డిపోల్లో 750ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించిన టెండర్లలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 750బస్సులు సరఫరా చేయడానికి ఎలక్ట్రిక్ బస్సు తయారీదారులైన మెస్సర్స్ పినాకిల్ మొబిలిటీ పుణె" వారిని ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా 750బస్సులు మెయింటెనెన్స్, చార్జింగ్ కొరకు సివిల్, ఎలక్ట్రికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటిస్ ఏర్పాటు చేయడానికి సంబంధించిన పనులు ఏపిఎస్ఆర్టీసీ చేపట్టడం జరుగుతుంది. సివిల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో 60శాతం ఎలక్ట్రికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కొరకు అయ్యే ఖర్చులో 100శాతం కేంద్ర ప్రభుత్వం ఏపిఎస్ఆర్టీసీకి గ్రాంటుగా అందజేయడం జరుగుతుంది. సెలెక్ట్ చేసిన 12డిపోల్లో సివిల్ వర్క్స్ కొరకు టెండర్ ప్రక్రియ ప్రారంభించబడింది. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ డిపోల్లో ఏపిఎస్ఆర్టీసి సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ పనులు ప్రారంభిస్తారు. అదేవిధంగా సెలెక్ట్ చేసిన ఈ డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతో పాటు డిజిల్ బస్సులు కూడా సమాంతరంగా ఆపరేట్ చేయడం జరుగుతుందని ఎపిఎస్ ఆర్టిసి ఒక ప్రకటనలో తెలిపింది.

## అగ్రిగోల్డ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిన వారికి ఊరట

విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: అగ్రిగోల్డ్ పై క్రిమినల్ కేసులు నమోదు కాకముందు ఆ సంస్థ వేసిన లేఔట్లలో ప్లాట్లు కొనుక్కొని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వారి స్థలాల్ని జప్తు నుంచి మినహాయిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం యథాతథంగా పునరుద్ధరించింది. ఆ ప్లాట్ల యజమానులకు వైకాపా ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దిదంది. అగ్రిగోల్డ్‌కు చెందిన 16,857.81 ఎకరాల భూమి 82,207.08 చదరపు గజాల స్థలాలను జప్తు చేస్తూ 2015 ఫిబ్రవరి 20న అప్పటి తెదేపా ప్రభుత్వం జీవో 23 జారీ చేసింది. ఆ భూముల్లో పలు చోట్ల అగ్రిగోల్డ్ లేఔట్లు ఉన్నాయి. వాటిల్లో ప్లాట్ల కొనుగోలు కోసం పలువురు చందాదారులు అగ్రిగోల్డ్‌పై కేసులు నమోదు కాక మునుపే పూర్తిగా డబ్బులు చెల్లించి స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అలాంటి ప్లాట్లను జప్తు నుంచి మినహాయిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లోనే ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే వైకాపా అధికారం చేపట్టాక ఆ మినహాయింపును తొలగిస్తూ 2021 ఫిబ్రవరి 9న జీవో 19లో సవరణ ఉత్తర్వులిచ్చింది. దీంతో బాధితులైన ప్లాట్ల యజమానులు తమ సమస్యను ఇటీవల సీఐడీ అధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లటంతో వారు స్పందించారు. తాజాగా జప్తు నుంచి మినహాయింపు లభించడంతో ప్లాట్ల యజమానులకు ఊరట దక్కనుంది.

## కన్న తల్లిని సజీవదహనం చేసిన కూతురు

సత్తెనపల్లి (పల్నాడుజిల్లా), ఫిబ్రవరి 13, ప్రభాతవార్త: సత్తెనపల్లిలో అనుమానాస్పద మృతి కేసు కాస్తా.. హత్య కేసుగా మారిన వైనమిది. కన్నతల్లిని కుమార్తె చంపిందని విచారణలో పోలీసులు ఆశ్చర్యపోయారు. సత్తెనపల్లి 8వ వార్డులోని క్రిస్టియన్ పేటలో ఈ నెల 8న ఒంటరి మహిళ రమాదేవి ఒళ్లంతా కాలిన గాయాలతో సజీవ దహనమైంది.పోలీసులు మరణ సమాచారాన్ని కుమార్తెకు తెలియజేసినా ఆమె సరైన రీతిలో స్పందించక పోవడంతో పోలీసులు ఒకింత అనుమానించారు. సీసీ కెమేరాల ఫుటేజీతో రమాదేవి చనిపోయిన సమయంలో ఆమె కుమార్తె అక్కడే ఉందని పోలీసులు నిర్ధారించుకున్నారు. మృతురాలి కూతురు కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకుని వెంటనే విచారించారు. కుటుంబ గొడవలతో తానే తల్లిని చంపానని ఆ కుమార్తె పోలీసులు ఎదుట ఒప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. తల్లికి టీలోటాబ్లెట్లువేసి ఆమె మత్తులోకి వెళ్లిన తర్వాత చీరలు ఒంటి పైవేసి పెట్రోలుతో నిప్పంటించిందని తెలిసింది. తల్లిని చంపేంత పగ కుమార్తెకు ఎందుకు వచ్చింది? వారి మధ్య అంతకు ముందు ఏం జరిగింది? అనే విషయాలపై పోలీసులు విచారణ చేపట్టారు.



## సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి రూ.1.10 కోట్ల బంగారం బహూకరణ

అద్దంకి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అద్దంకి మండలం, సింగరకొండలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి వారికి బంగారం కిరీటం కొరకు చీరాలలోని కొత్తపేటకు చెందిన ముప్పవరపు సుధీర్‌కుమార్, ధర్మపత్ని ప్రత్యూషలు 1.10కోట్ల విలువ కలిగిన 6 బంగారు బిస్కెట్లను శుక్రవారం ఆలయ సహాయ కమీషనర్ ఎం.తిమ్మానాయుడు,చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, పాలకమండలి సభ్యులకు అందజేశారు. స్వామివారికి బంగారు కిరీటం తయారు కొరకు మంగళగిరికి చెందిన స్వర్ణకారుడు కాటూరి సుబ్బారావుకు ఆలయ సహాయ కమీషనర్ దాతల సమక్షంలో వెంటనే అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలిసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేరు మార్పుతో ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే యత్నం

## - పాకలలో ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో పిసిసి చీఫ్ షర్మిల

సింగరాయకొండ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను బలహీనపరచే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఏపీ పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల పేర్కొన్నారు. కొండేపి నియోజకవర్గం, సింగరాయకొండ మండలంలోని పాకల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల ఉపాధి కల్పించే లక్ష్యంతో అమలు చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఈ ఉపాధి హామీ పథకాన్ని విబి జీ రాంజీ పేరుతో నూతన చట్టం ద్వారా మార్పులు చేసి అమలు చేయాలనుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన విధంగా ఉపాధి హామీ నిధులు నేరుగా పేదల ఖాతాల్లో జమ కావడంతో బీజేపీకి చెందిన నాయకులు, కాంట్రాక్టర్లకు అవకాశం లేకుండా పోవడంతోనే పథకాన్ని బలహీనపరచే యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.కాంగ్రెస్ హయాంలో ఉపాధి హామీ నిధులను రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రం మంజూరు చేసేదని పేర్కొన్నారు. ప్రస్తుతం నూతన చట్టం ప్రకారం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు.గతంలో గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామ అవసరాలకు అనుగుణంగా రోడ్లు, చెరువుల పూడికతీత, పారం పండ్స్ గుంటలు, పొలం పనులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు ఉపాధి హామీ ద్వారా చేపట్టేవారని వివరించారు. ఈ పథకం గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు.ఉపాధి హామీ పథకాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని షర్మిల స్పష్టం చేశారు. అనంతరం యాత్ర దర్శికి బయలుదేరి వెళ్లింది.ఉపాధి హామీ కూలీలు తమ సమస్యలను



వెల్లడిస్తూ పనికి తగ్గ వేతనం అందడం లేదని, ఆరు రోజులు పని చేస్తే మూడు రోజులకు మాత్రమే కూలి ఇస్తున్నారని, జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసినా పదేళ్లు గడిచినా మంజూరు కాలేదని వాపోయారు.ఈ కార్యక్రమంలోకొండేపి ఇంచార్జి శ్రీపతి సతీష్, స్టేట్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ శ్రీపతి ప్రకాశం, జనరల్ సెక్రటరీ ఇదా సుధాకర్ రెడ్డి, ప్రకాశం జిల్లా ఇంచార్జ్ తాటి కొండ వెంకటేశ్వర్లు,ఓబీసీ స్టేట్ చైర్మన్ శొంఠి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ సైదా షేక్, మండల్ ప్రెసిడెంట్ షేక్ నాయబ్ రసూల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష

## దూరవిద్య ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: దూరవిద్య ద్వారా ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లుచేయాలని ఎన్టీఆర్ జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణకు సన్నద్ధతపై శుక్రవారం వివిధశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ మాట్లాడుతూ మార్చి 2వతేదీ నుండి 13వతేదీ వరకు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా విజయవాడ డివిజన్లో 603, నందిగామ 882, తిరువూరు 369, మొత్తం 1854 మంది విద్యార్థులు ఈపరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. ఇందుకోసం 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామని, పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేయటంతోపాటు, బందోబస్తు, భద్రతా చర్యలు, సిసి కెమెరాల నిఘా విషయంలో పోలీసుశాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పరీక్షల్లో అక్రమాలను నిరోధించడానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో హాజరయ్యేందుకు ప్రజారవాణా అధికారులు బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్ అవాంతరాలు రాకుండా చూడాలని, తాగునీరు అందుబాటులో ఉంచటంతోపాటు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఆర్వో లక్ష్మీనరసింహం, డిఈఓ ఎల్.చంద్రకళ, డియంహెచ్ఓ డాక్టర్ యం.సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

### నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈనెల 17వతేదీన చేపట్టే జాతీయనులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లాకలెక్టర్ లక్ష్మీశ పిలుపు నిచ్చారు. నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ వివిధశాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 5లక్షల మందికి నులిపురుగుల నివారణ మందులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఏడాది నుండి రెండేళ్ళ చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు 200 యంజి డోస్ ఇవ్వాలని, మిగిలిన వారికి 400 యంజి సింగిల్‌డోస్‌లో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 17వతేదీ మాత్రలు తీసుకోని వారికి ఈనెల 24వతేదీ మాత్రలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తుంటే ఎందుకు స్పందించారు: హైకోర్టు

విజయవాడ, జనవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: విశాఖజిల్లా, భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలకు వ్యతిరేకంగా తీరానికి సమీపంలో కాంక్రీట్ గోడ నిర్మాణం జరుగుతోందని తెలిసి కూడా చర్యలు తీసుకోని అధికారులపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇలాంటి అధికారులను రక్షించేందుకు జీవీఎంసీ కమిషనర్ ప్రయత్నిస్తున్నారని అభిప్రాయపడింది. బాధ్యులైన అధికారుల వివరాలివ్వాలని కోరితే కమిషనర్ ఇవ్వకపోవడాన్ని ఆక్షేపించింది. వాళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. అలాగే గోడ కూల్చడం ద్వారా పోగైన వ్యర్థాలను మూడు వారాల్లో తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశాలిచ్చింది. భీమునిపట్నం పరిధిలోని సీఆర్ జెడ్1 ప్రాంతంలో సముద్రానికి అతిసమీపంలో మాజీ ఎంపి విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డి అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్పీ శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు చేయడంపై జనసేన కార్పొరేటర్ పిఎల్వీఎన్ మూర్తి యాదవ్ వేసిన పిల్పై తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్రం విడిపోయిన తర్వాత వెనుకబడిన ప్రాంతాలు మరింత నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయని, ఇలాగే కొనసాగితే ఈ ప్రాంతాలలో ప్రజల నుండి తీవ్రమైన తిరుగుబాటు వస్తుందని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. వేదిక నాయకులు శుక్రవారం కడపలో సమావేశమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల గురించి చర్చించి సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా వెనక బడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నేతలు మాట్లాడుతూ.. 2026-27 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వెనుక బడిన అభివృద్ధి ప్రాంతాల్లో ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ కల్పన చేయాలని, నీళ్లు, నిధులు, నియామకాలు అన్ని ప్రాంతాలకు సమానంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 60 సంవత్సరములుగా పేద ప్రజల పండగ నిలబడిన ఆర్డీటికి ఎఫ్‌సిఆర్ఏ రెన్యువల్ చేయాలని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం-2005ను పునరుద్ధరించాలని, విభజన చట్టంలో పొందుపరిచిన బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని వెనుకబడిన ప్రాంతాలకు అమలు చేయాలని కోరుతూ వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రాంతాలలో జాతాలు నిర్వహించి ప్రజలను సంఘటితం చేయాలని కడపలో జరిగిన రాష్ట్ర స్థాయివేదిక సమావేశంలో తీర్మానించినట్లు వేదిక నేతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బి.నారాయణ, కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షులు కేవీ రమణ, జి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా వృద్ధాప్య, వితంతు పింఛన్లు

● విధివిధానాలు రెడీ ● త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ ● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో కొత్తగా వృద్ధాప్య. వితంతు పింఛన్లు ఇచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నట్లు శాసనమండలిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వీటి కోసం ఇప్పటికే విధివిధానాలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు త్వరలోనే కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుందని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ ప్రారంభం కాగానే అర్హులైన వారికి దరఖాస్తు చేసే అవకాశం కల్పించనున్నారు. దీనిపై అధికారిక నోటిఫికేషన్ త్వరలో విడుదల కానుందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందే పెన్షన్ల పెంపు హామీ ఇచ్చింది. అన్నట్లుగానే సూపర్ సిక్స్ లో భాగంగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లను 4 వేలకు పెంచారు. అలాగే దివ్యాంగుల పెన్షన్లను 6 వేలకు పెంచారు. అనంతరం అనర్హుల ఏరివేత కోసం భారీ కసరత్తు చేశారు. దీంతో పెన్షన్ల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మళ్లీ అర్హులకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం విధివిధానాలను ఖరారు చేస్తోంది. త్వరలోనే దరఖాస్తుల ప్రక్రియను సచివాలయాల ద్వారా ప్రారంభించబోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

# స్వర్ణాంధ్ర దిశగా పర్యాటకం

● గడిచిన 18 నెలల్లో రూ.20,088 కోట్ల పెట్టుబడులు, 1.22 లక్షల ఉద్యోగాల సృష్టి ● మంత్రి కందుల దుర్గేష్




విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: "నేషనల్ ట్రావెల్ మార్ట్" కేవలం ఒక సమావేశం కాదు.. ఇది ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఒక సరికొత్త అధ్యయనానికి నాంది అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న ఈ మెగా టూరిజం మార్ట్‌లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, గిరిజన ప్రాంతాలు, వారసత్వ ప్రదేశాలు, ఎకోఅడ్వెంచర్ టూరిజంను ప్రదర్శించడం, దేశీయ పర్యాటకాన్ని పెంచడమే లక్ష్యంతో టూర్ ఆపరేటర్లు, హోటల్ గ్రూప్‌లు, ట్రావెల్ నిపుణులతో నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధిలో టూర్ ఆపరేటర్ల ప్రాముఖ్యతను వివరిస్తూ టూర్ ఆపరేటర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి దుర్గేష్ వ్యాఖ్యలతో హర్షధ్వానాలు వెల్లువెత్తాయి.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేవలం ఆధ్యాత్మిక వారసత్వానికే కాకుండా, పరివర్తన, ఆవిష్కరణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని అన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగలి వెంకయ్య పుట్టిన ఈ నేల పట్ల రాష్ట్రం గర్వపడుతోందని తెలిపారు. కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నూతన పర్యాటక పాలసీ 2024 29, పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా, సబ్సిడీలు, ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, స్టాంపు డ్యూటీ మినహాయింపులతో ఇన్వెస్టర్లకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కేవలం 18 నెలల్లో రూ.20,088 కోట్ల విలువైన 117 ప్రాజెక్టులకు ఒప్పందాలు జరిగాయని, దీని ద్వారా 1,22,637 ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమమైందని వెల్లడించారు. తద్వారా హోటల్స్, రిసార్ట్స్, థీమాటిక్ పార్క్ లు తదితరాలు పెద్దఎత్తున ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకు వచ్చారన్నారు. కేవలం ఖఈజ్ ఆఫ్ డూయింగ్ఖి మాత్రమే కాకుండా, ఖిస్పీడ్ ఆఫ్ డూయింగ్ఖి ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు.

**భవిష్యత్తు ప్రణాళికలు:** విశాఖ నుండి అరకు వరకు త్వరలో కారవాన్ టూరిజం ప్రారంభిస్తామని, గ్రామీణ సంస్కృతిని పరిచయం చేసేలా హోమ్‌స్టేలు, బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ పాలసీ, టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో రాబోయే మైస్, ఫిల్మ్ టూరిజం పాలసీలు అసెట్‌లైట్ మోడల్ పెట్టుబడులకు ఊతమిస్తాయని భావిస్తున్నామన్నారు. రాష్ట్రం కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా ఎకో, అడ్వెంచర్, క్రూయిజ్, రివర్, అగ్రి, హెరిటేజ్, మెడికల్ మరియు వెల్ నెస్ టూరిజంకు పెద్దపీట వేస్తోందని వివరించారు. మన రాష్ట్రం పర్యాటక రంగంలో ఒక ఖిస్టార్టప్ఖి లాంటిది. ఇక్కడ వేగం, కొత్త ఆలోచనలు, అద్భుతమైన వృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఛత్తీస్‌గఢ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నీలూశర్మ, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ, ఏపీటీప సీఈవో ఆమ్రపాలి కాట, ఛత్తీస్ గడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ వివేక్ ఆచార్య, ఏపీటీడీసీ ఈడీ పద్మావతి, ఏపీటీప డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఏడీటీవోఐ ప్రెసిడెంట్ వేద్ ఖన్నా, విజయ్ మోహన్, స్వామినాయుడు, మహాపాత్ర, టూర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లకు సమయం పరిమితం

విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో నూతన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.ప్రశ్నోత్తరాల సమయాన్ని గాని, జీరో అవర్‌నుగాని గంటకు పరిమితం చేసారు. సమయ పాలన చట్టసభలో అవసరమని స్పీకరు తెల్చిచెబుతున్నారు. శుక్రవారం ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేసారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో పలు అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు బదులిచ్చారు. పెందుర్తి నియోజకవర్గంలో మినీ జెట్టి నిర్మాణంపై పంచకర్ల రమేశ్ బాబు ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. జువలదిన్నె, మచిలీపట్నం వంటి ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయని వివరించారు. పనులు లేని సమయంలో రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి పని కల్పించామన్నారు. విశాఖపట్నం హార్బర్ చాలా దారుణంగా తయారైందని అన్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అధునాతన పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. సాగరమాల కార్యక్రమం ద్వారా మత్స్యకారులను న్యాయం చేస్తామన్నారు. కాకినాడ ఫిషింగ్ హార్బర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముత్యాలమ్మపాలెం జెట్టి నిర్మాణానికి సరైనదని ప్రభుత్వం రిపోర్టు కూడా ఇచ్చిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జీరో అవర్లో పలువురు సభ్యులు స్థానిక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో తాగునీటి సమస్యను స్థానిక ఎమ్మెల్యే కాకర్ల రమేష్ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఎన్టీఆర్ సుజల పథకం కింద 331 ఆవాసాలకు నీరందించే ప్రాజెక్టు పనులు ఏళ్ల తరబడి ప్రారంభం కాలేదని చెప్పారు. ఇందుకోసం రూ.8.5 కోట్లు మంజూరు చేశారని, ఈ ప్రాజెక్టును రద్దు చేసి, కొత్తది ప్రారంభించడమా లేక దీనినే పూర్తి చేయడమా అనే అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రస్తావించారు. జాప్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యవేడు నియోజకవర్గం పరిధిలోని కె.బి పురం రాయల చెరువు కట్ట తెగిపోవడం కారణంగా ముంపునకు గురై వెయ్యి ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల్లో కొద్ది మందికి ఇప్పటికీ పరిహారం చెల్లించలేదని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గతంలో రైతులు ఆందోళనలు చేసిన సమయంలో వారిపై కేసులు పెట్టడంతో అనేక మంది రైతులు గ్రామాలను వదిలి ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారని, ఈ కేసులను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తరాంధ్ర సృజల స్రవంతి పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎస్ సన్యాసి రాజు ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు పుష్కలంగా నీరు అందుతుందని తెలిపారు. పార్వతీపురం జిల్లాలోని రెవిన్యూ కార్యాలయాల్లో ఉండాల్సిన రెవెన్యూ రికార్డులు గత వైసిపి ఎమ్మెల్యేల ఇళ్లలో ఉన్నాయని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. గత ఎమ్మెల్యేలు, ఆయా మండల తహశీల్దారు సంతకాలను ఫోర్జరీ చేశారని, ఈ అంశంపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలో గత ప్రభుత్వం ప్రజల భూములను 220గా నమోదు చేసిందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చెప్పారు. వీటిని పరిశీలించి జాబితాలోని వాస్తవంగా లేని వాటిని తొలగించి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. శ్రీకాళహస్తి నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరారు. సాగర్ ఎడమ కాల్వ నుంచి రాష్ట్రానికి అందాల్సిన వాటా ప్రకారం తెలంగాణ అధికారులు నీటిని విడుదల చేయడం లేదని మైలవరం ఎమ్మెల్యే . వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సీజన్లో 14 టిఎంసీలు విడుదల చేయాల్సి ఉండగా 1.6 టిఎంసిలు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. జలవరుల శాఖ మంత్రి తెలంగాణ మంత్రితో చర్చించి సమస్య పరిష్కరించాలని కోరారు. మదనపల్లె జిల్లాలోని వక్స్ భూముల్లో 100 షెడ్లను గత ప్రభుత్వంలో తొలగించారని, వక్స్ ఆస్తులు అన్యాక్రాంతం చేశారన్నారు. వక్స్ బోర్డులో రూ.3 కోట్ల నిధులు దుర్వినియోగం అయిన ఘటనపై విచారణ నిర్వహించాలని కోరారు. ఏలూరు నగరంలో టిడ్కో ఇళ్లు రద్దు చేసి 1 సెంటు స్థలం కేటాయించారని, ఆ లబ్దిదారులందరికీ 2 సెంట్లు స్థలం కోటాయించాలని ఎమ్మెల్యే బడేటి రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు.

## పిజిఆర్ఎస్ ఫిర్యాదుల్లో 61 శాతం రెవెన్యూకు సంబంధించినవే

### - రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

విజయవాడ, జనవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న ఫిర్యాదుల్లో 61 శాతం రెవెన్యూకు సంబంధించినవి ఉన్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ సదస్సులు, ఫిర్యాదుల పరిష్కారంపై ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, ధూళిపాళ్ల నరేంద్ర అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. వైఎస్సార్సీపీ హయాంలో రికార్డులు మార్చిన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు అనగాని తెలిపారు. ఫ్రీ హోల్డర్ భూముల విషయంలో మంత్రి వర్గ ఉప సంఘం వేశామని, చట్ట వ్యతిరేకంగా జరిగిన వాటిని గుర్తించి సరిచేస్తామని ఆయన చెప్పారు. ఆ తప్పిదాలు ఇంకా వెంటాడుతున్నాయి: రీసర్వేలపై కూడా లక్షా 70వేల ఫిర్యాదులు వచ్చాయన్నారు. జేసీల దగ్గర ఉన్న అధికారాలు ఆర్డీఓ, ఎమ్మార్వోకు ఇచ్చి వేగంగా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. రెవన్యూ సదస్సులు పెడుతున్నా ఇంకా ఎందుకు సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యేలు గట్టిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన తప్పిదాలు ఇంకా వెంటాడుతున్నాయని, ఫ్రీ హోల్డ్ భూములుకు సంబంధించి జిల్లా కలెక్టర్‌లు వాగులు వంకలు ఇష్టానుసారంగా మార్చారని ఆరోపించారు. లిటిగేషన్ ఉన్న భూములను వైఎస్సార్సీపీకి చెందిన మాజీ శాసనసభ్యులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు ఫ్రీహోల్డ్, ఈనాం భూముల గురించిన అన్ని అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలనలు జరుతున్నాం. ప్రతీ నెల సంబంధిత అధికారులతో చర్చలు జరిపి చర్యలు చేపడుతున్నాం. పేదవారికి ఎలాంటి నష్టం జరగకుండా చూసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. వైఎస్సార్సీపీ హయాంలో రికార్డులు మార్చిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఫ్రీ హోల్డర్ భూముల విషయంలో మంత్రివర్గ ఉపసంఘం వేశాం. చట్ట వ్యతిరేకంగా జరిగిన వాటిని గుర్తించి సరిచేస్తామని తెలిపారు.

### శాసనసభలో మూడు బిల్లులు ఆమోదం

శాసనసభలో ఇవాళ మూడు బిల్లులకు ఆమోదం లభించింది. మున్సిపల్ చట్టంలో సవరణలు చేస్తూ రెండు బిల్లులను ప్రవేశ పెట్టారు. మంత్రి నారాయణ శాసనమండలిలో ఉండటంతో ఆయన బదులు మంత్రి టీజీ భరత్ ఈ బిల్లులు ప్రవేశ పెట్టారు. విద్యుత్తు చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ఈ మూడు బిల్లులు ఎలాంటి చర్చ లేకుండానే అసెంబ్లీలో ఆమోదం పొందాయి.

## దాచాలంటే దాగవులే గణాంకాల్లోకి గుట్టు

### సగం పూర్తయిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే

పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ఒక వ్యక్తికి, తన కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలు డిజిటలైజేషన్ చేయడం ద్వారా ప్రభుత్వానికి చేరబోతున్నాయి. దీనికి సంబంధించి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పేరుతో గత ఏడాది డిసెంబర్ నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని వేగంగా నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో వ్యక్తిగత సమాచారంతోపాటు కుటుంబ స్థాయిని కూడా సమగ్రంగా ప్రభుత్వానికి అందించనున్నారు. గ్రామస్థాయిలో జీఎస్‌డబ్ల్యూఎస్ (స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు) సిబ్బందినీ, పంచాయితీ సిబ్బందితో కలిపి ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సర్వే కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలు 20 ప్రశ్నల రూపంలో సంధించి వాటికి సంబంధించిన ఆధారాలు, కొన్ని ధ్రువీకరణ పత్రాలతో సహా డిజిటలైజేషన్ చేస్తున్నారు. యాప్‌లో వివరాలన్నీ ఆధార ఓటిపి ద్వారా సమర్పిస్తున్నారు. పూర్తిస్థాయి వివరాలను సదరు వ్యక్తి తప్పనిసరిగా చెప్పవలసి ఉంటుంది. డిసెంబర్లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈరోజుకి 50శాతం మాత్రమే పూర్తయినట్టు తెలుస్తుంది. ఈ సర్వే పూర్తిచేయడంలో రాష్ట్రవ్యాప్తంగా నంద్యాల జిల్లా 71 శాతంతో అగ్రస్థానంలో ఉండగా అల్లూరి సీతారామరాజు జిల్లా 32 శాతంతో చివరి స్థానంలో ఉంది. పశ్చిమగోదావరి జిల్లా 52 శాతం, ఏలూరు జిల్లా 62 శాతం పూర్తి చేసుకున్నాయి. ఈ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో పౌరుల ప్రాథమిక సమాచారం, సామాజిక సమాచారం, విద్య నైపుణ్యం సమాచారాలతో పాటు ఉపాధి జీవనోపాధి విభాగాల్లో ప్రశ్నలు రూపొందించారు. అంతేకాక ప్రభుత్వాన్ని నుంచి పొందిన ధ్రువపత్రాలను కూడా యాప్లో పొందుపరుస్తున్నారు. ఈ సర్వే కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించడమే కాకుండా అవి ఎప్పటికప్పుడు ప్రభుత్వ డొమైన్ లోనికి డంపు అయ్యేలా డిజైన్ చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వే కి సంబంధించి పూర్తి ప్రశ్నల జాబితాను, వెరిఫికేషన్ విధానాన్ని ఆన్లైన్లో అందుబాటులో ఉంచారు వీటి ద్వారా పౌరులు సిద్ధంగా ఉండడానికి వెసులుబాటుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సచివాలయ సిబ్బందికి పంచాయతీ సిబ్బందికి మధ్య సమన్వయం లోపించడంతో ఈ సర్వే కొన్నిచోట్ల మందకొడిగా సాగుతుందని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు దీనికి సంబంధించి పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండల పరిషత్ అధికారి రెవిన్యూ అధికారులకు నోటీసులు సైతం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.




## శ్రీసిటీలో స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ ఆర్.సుందరం

సత్యవేడు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: భారతదేశ ఆర్థిక భవిష్యత్ దేశీయ సామర్థ్యాల బలోపేతం, ఆవిష్కరణల ఆధారిత వృద్ధి, విధాన స్థిరత్వంపై ఆధారపడి ఉంటుందని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్, ఆర్థిక నిపుణులు, స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ ఆర్.సుందరం పేర్కొన్నారు. పన్నులు, కార్పొరేట్ చట్టం, ఆర్థిక విధానంలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న ఆయన శుక్రవారం శ్రీసిటీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని పరిశ్రమల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. అతిథికి సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మారుతున్న విధానాలు, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమ వర్గాలను చైతన్యవంతులను చేయడానికి సంబంధిత నిపుణులతో తరచూ ఈ తరహా కార్యక్రమాల నిర్వహణ ప్రాముఖ్యతను వివరించారు. మారుతున్న గ్లోబల్ పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థ అనే అంశంపై ప్రసంగించిన సుందరం, ప్రధానంగా ప్రపంచ ఆర్థిక పరిణామాలు, భారత ఆర్థిక వ్యవస్థలోని నిర్మాణాత్మక బలాలను ప్రస్తావించారు. స్వావలంబన, స్వయం సమృద్ధి, బలమైన సరఫరా గొలుసులు, దేశీయ విలువ సృష్టి ప్రాధాన్యతను వివరించిన ఆయన, దేశ పురోగాభివృద్ధిలో బలమైన పరిశ్రమ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ పరిశ్రమలకు చెందిన పలువురు సీఈవోలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వరునికి ఇంద్రకీలాద్రి అమ్మవారి పట్టువస్త్రాల సమర్పణ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : దక్షిణ కాశీ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా, ఫిబ్రవరి 15న జరగనున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ వారి తరఫున శ్రీకాళహస్తీశ్వర స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సమర్పించారు. శుక్రవారం దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వి.కె. సీనా నాయక్ నేతృత్వంలో ప్రతినిధి బృందం స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొనిరాగా శ్రీకాళహస్తి దేవస్థానం ఈ.ఓ బాపిరెడ్డి, ఆలయ వేద పండితులు మరియు అర్చకులు మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు దుర్గగుడి ప్రతినిధులకు ఆశీర్వచనాలు పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

### వైభవంగా మహాశివరాత్రి మహోత్సవాలు



ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పవిత్ర మంగళ స్నానాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించే కన్నుల పండుగ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈ.ఓ వి.కె. సీనా నాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ధర్మారావు, మన్నె కళావతి, సరోజి పద్మశేఖర్, పద్మావతి ఠాకూర్, సరిత మరియు ప్రత్యేక ఆహ్వానితులు వేలగపూడి శంకర్ బాబు పాల్గొన్నారు. సాయంత్రం గణపతి పూజ, మండపారాధన, గణపతి పూజ, కలశ స్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, మూల హవన పూజలు, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిపారు.

## అమరావతి పనుల ప్రతిపాదనలపై స్క్రీనింగ్ కమిటీ

విజయవాడ.ఫిబ్రవరి13,ప్రభాతవార్తప్రతినిధి: రాజధాని అమరావతి పనుల ప్రతిపాదనలకు సంబంధించి అథారిటీ ముందుంచే ప్రతిపాదనలు పరిశీలించేందుకు కమిషనర్ కన్నబాబు ఆధ్వర్యాన కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ అథారిటీ ముందుకు వెళ్లే ప్రతిపాదనలు చాలా వరకూ ఆమోదించిన తరువాత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, అందువల్ల ముందుగానే కమిటీ నుండి అన్ని విధాలా స్క్రూటినీ చేసి అథారిటీకి పంపాలని నిర్ణయించారు. సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో న్యాయవిభాగ అదనపు సెక్రటరీ అరవింద్ రమణి, ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జంపాని శివయ్య, సలహాదారు లక్ష్మీ మ్రనాయక్, పట్టణాభివృద్ధిశాఖ ఓఎస్‌డి వెంకట సుబ్బయ్య, పబ్లిక్ హెల్త్ ఇఎన్‌సి ప్రభాకరరావు, సిడిఎంఎ డిడి చిట్టిబాబు, ఎడిసిఎల్ సిఇ ధనుంజయ్య సభ్యులుగా ఉన్నారు.

## టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా విశ్వనాథ రాజు

గుంటూరు, ఫిబ్రవరి 13 ప్రభాత వార్త ప్రతినిధి: శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్ గా గుంటూరు అటవీ సంరక్షణాధికారిగా పనిచేస్తున్న ఐ. కాశీ విశ్వనాథ రాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఫీల్డ్ డైరెక్టర్‌గా పనిచేసిన బి.విజయ కుమార్‌ను రాష్ట్ర అటవీశాఖ అధికారికి రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. విశ్వనాథ రాజు ఫీల్డ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేయనున్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ లో నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్‌ను కలిగి ఉంది. కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఈ సర్కిల్ విస్తరించి ఉంది.

## ఆర్డిటి ఎఫ్‌సిఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరించండి

### కేంద్ర హోంశాఖను కోరిన అనంతపురం ఎంపి లక్ష్మీనారాయణ



అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అనంతపురం కేంద్రంగా సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌కు సంబంధించిన ఎఫ్‌సిఆర్ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వాన్ని టీడీపీ పార్లమెంటరీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, రాజ్యసభ ఎంపీ సానా సతీష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కలిసి కేంద్ర హోంశాఖ సెక్రటరీ గోవింద్ మోహన్‌ని కోరారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాని కలిసి ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఏ పునరుద్ధరణ అంశాన్ని ప్రస్తావించగా, ఆ మేరకు హోం కార్యదర్శికి లేఖ పంపబడింది. ఆ లేఖ ఆధారంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర హోంశాఖ సెక్రటరీ గోవింద్ మోహన్‌ను శుక్రవారం ఢిల్లీలో కలిసి ఆర్‌డిటికి సంబంధించిన ఎఫ్‌సిఆర్ఏ పునరుద్ధరణను త్వరితగతిన పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. 1969 నుంచి ఆర్‌డిటి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో వివిధ రంగాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా చేస్తోందని, ప్రజలకు ఎంతో మేలు చేసిందని, రాజకీయేతర, లౌకిక సంస్థగా ఆర్‌డిటి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 2025లో కొత్తగా దాఖలు చేసిన ఎఫ్‌సిఆర్ఏ దరఖాస్తు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో ఆసుపత్రులు, విద్యా, సంక్షేమ కార్యక్రమాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొంటూ, మానవతా సేవలు కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎంపీ కోరారు.

## మనమిత్ర వాట్సాప్ ద్వారా ఇంటర్ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

విజయవాడ, ఫిబ్రవరి13,ప్రభాతవార్తప్రతినిధి: ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ కళాశాలకు చెక్ పెట్టింది. ఫీజు చెల్లిస్తే గాని హాల్ టికెట్లు ఇవ్వం అన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటర్మీడియట్ విద్యార్థులకు నేరుగా మనమిత్ర వాట్సాప్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావచ్చని ఇంటర్మీడియట్ బోర్డు విద్యా మండలి కార్యదర్శి రంజిత్ భాష శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్‌బాషా తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్‌టికెట్లు పొందొచ్చన్నారు. మొదటి సంవత్సరం వారు పదో తరగతి హాల్ టికెట్ నంబరు, ద్వితీయ సంవత్సరం వారు మొదటి సంవత్సరం హాల్ టికెట్ నంబరు లేదా ఆధార్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మనమిత్ర వాట్సప్ నంబరు 955230 0009కు హాయ్ అని మెసేజ్ పెట్టి, హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. హాల్ టికెట్లపై కళాశాల ప్రిన్సిపల్, కళాశాల స్టాంప్ అవసరం లేదని తెలిపారు.






**జింబాబ్వే ఉంచిన లక్ష్యం 170 రన్స్**
**ఆస్ట్రేలియా ఈ స్కోరును ఊదేస్తుందని అందరి అంచనా**
**పెవిలియన్‌కు క్యూకట్టిన హేమాహేమీలు**
**తీరా చూస్తే కంగారూలు 146 ఆలౌట్**

**కొలంబో:** టీట్వంటీ ప్రపంచకప్ లో ఎట్టకేలకు సంచలనం నమోదైంది.హాట్ ఫేవరేట్ ఆస్ట్రేలియాకు అనామక జింబాబ్వే షాకిచ్చింది.

# ఆస్ట్రేలియాకు షాక్‌లగా!

## టీ20 ప్రపంచకప్‌లో జింబాబ్వే సంచలనం * ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ ముజర్బానీ

23 పరుగుల తేడాతో చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ లో మెరు పులు మెరిపించిన జింబాబ్వే... బంతితోనూ చెలరేగింది.

**అదిరిన శుభారంభం**

కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో మొదట జింబాబ్వేకు దిగిన ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్, తదివనాషే చక్కని శుభారంభాన్ని అందించారు. ఆస్ట్రేలియా బౌలర్లపై విరుచుకుపడుతూ ఓవర్‌కు పది పరుగుల చొప్పున సాధిస్తూ తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. 21 బంతుల్లో 35 రన్స్ చేసిన తదివనాషే ను స్టోయినీస్ అవుట్ చేశాడు. క్రీజ్ లోకి వచ్చిన ర్యాన్ బర్ల్‌తో కలిసి బెన్నెట్ స్కోరును ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో 43 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. జింబాబ్వే స్కోరును వంద పరుగులు దాటించాడు. ర్యాన్ బర్లేతో కలిసి రెండో వికెట్ కు 70 పరుగులు, మూడో వికెట్ కు కెప్టెన్ సికిందర్ రజా కలిసి అజేయంగా మూడో వికెట్‌కు 38 పరుగులు అందించాడు. దీంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. బెన్నెట్ 56 బంతుల్లో 64 పరుగులతో, సికిందర్ రజా 25 పరుగులతో అజేయంగా నిలిచారు.

**ఆరంభం నుంచే తడబాటు**

170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఆరంభంనుంచే తడబడింది. 24పరుగులకే ఓపెనరిద్దరినీ కోల్పోయింది. మొదట కామెరూన్ గ్రీన్ ను డకౌట్ చేసి ఇవాన్స్... కాసేపటికే ట్రావిస్ హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి జింబాబ్వేకు బ్రేక్ అందించాడు. మరో అయిదు పరుగులకు మరో రెండు వికెట్లు కోల్పోయింది. టిమ్ డేవిడ్ డకౌట్ కాగా, 31 పరుగులు చేసి మాక్స్‌వెల్ అవుటయ్యాడు. ఈ రెండు వికెట్లు కూడా ముజర్బానీ ఖాతాలో చేరాయి.

**పోరాడిన మాట్ రెన్‌షా**

ఒకవైపు సహచరులు పెవిలియన్‌కు చేరుతున్నా మరో ఎండ్‌లో మాట్ రెన్‌షా ఒంటరిపోరాటం చేశాడు. జింబాబ్వే బౌలర్లను ధాటిగా ఎదుర్కొంటూ 44 బంతుల్లో 5 బౌండరీలు, ఓ సిక్స్‌తో 65 పరుగులు సాధించాడు. బ్రాడ్ ఇవాన్స్, ముజర్బానీ బౌలింగ్ ధాటికి మార్కస్ స్టోయినీస్, బెన్, నాథన్ ఇలియాస్, ఆడమ్ జంపా సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. దీంతో ఆస్ట్రేలియా మరో మూడు బంతులు మిగిలిఉండగానే 146 పరుగులకు ఆలౌటైంది. జింబాబ్వే బౌలర్లలో ముజరబ్బానీ 4 వికెట్లు,బ్రాడ్ ఇవాన్స్ మూడు వికెట్లు పడగొట్టి జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. ముజర్బానీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**సంక్షిప్త స్కోర్లు: జింబాబ్వే-169/2**(20 ఓవర్లలో) (బెన్నెట్ 64 నాటౌట్, తదివనాషే 35, ర్యాన్ 35, సికందర్‌రజా 25 నాటౌట్); **ఆస్ట్రేలియా-146 ఆలౌట్**(19.3 ఓవర్లలో) (మాట్ రెన్‌షా 65, మాక్స్‌వెల్ 31, ముజర్బానీ 4/17, బ్రాడ్ ఇవాన్స్ 3/23)

# కోలుకున్న అభిషేక్ శర్మ, పాక్‌తో మ్యాచ్‌కు రెడీ



**న్యూఢిల్లీ:** చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ తో ఆదివారం తలపడనున్న టీమిండియాకు గుడ్ న్యూస్ అందింది. కడుపు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ కోలుకున్నాడు. పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడే అవకాశాలున్నట్లు టీమిండియా ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తెలిపాడు. ప్రసుత్తం అభిషేక్ ఆరోగ్యం బాగానే ఉందని, ప్రాక్టీసులో కూడా చేశాడని వెల్లడించాడు. టోర్నీ ఆఫ్ ది మ్యాచ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలిపాడు.

## మహిళల ఆసియా కప్

# భారత్‌పై 7 వికెట్లతో యుఎఇ విజయం




**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. పసికూన యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ) చేతిలో రాధయాదవ్ సారథ్యంలోని భారత జట్టు ఖంగుతింది. దాంతో ఈ టోర్నీని ఘోర పరాజయంతో ప్రారంభించింది. యూఏఈతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన టీమిండియా 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇషా ఒజా(72 నాటౌట్, 2/30) ఆల్‌రౌండ్ షోతో భారత్ పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 130 పరుగులు చేసింది. అనుష్క శర్మ(45 బంతుల్లో 7 ఫోర్లతో 47), తనూజ కన్వార్(25 బంతుల్లో 5 ఫోర్లతో 34) మినహా, మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ రాధా యాదవ్(7) తీవ్రంగా నిరాశపర్చింది. యూఏఈ బౌలర్లలో సమైరా ధరింధర్కా(3/40) మూడు వికెట్లు తీయగా, వైష్ణవే మహేష్(2/13), ఇషా ఒజా(2/30) రెండేసి వికెట్లు పడగొట్టారు. కొట్టే సురక్ష, అతిగే సిల్వా చెరో వికెట్ తీసారు. అనంతరం యూఏఈ 19.2 ఓవర్లలో 3 వికెట్లకు 131 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ ఇషా ఒజా(61 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 72 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించింది. సమైరా(31 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 34) కీలక ఇన్నింగ్స్ ఆడింది. భారత బౌలర్లలో రాధా యాదవ్, ప్రేమ రావత్, తనూజ కన్వార్ తలో వికెట్ తీసారు. కాగా భారత్ సెమీఫైనల్ చేరాలంటే తదుపరి రెండు మ్యాచ్‌లను మెరుగైన రన్‌రేట్‌తో గెలవాలి. లేదంటే లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమిస్తోంది

# క్వార్టర్ ఫైనల్లో దియా, మనుష్ జోడీ



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కాంటెండర్ చెన్నై 2026టోర్నమెంట్‌లో భారత్ టాప్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ దియా చిటాలే-మనుష్ షా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. మరో భారత్ టాప్ సీడ్ పురుషుల డబుల్స్ కలయిక మానవ్ తక్కర్- మనుష్ షా ద్వయం తొలిరౌండ్లోనే ఓడిపోయారు. ఈ టోర్నీలో షా-దియా కొరియా, రిపబ్లిక్‌కు చెందిన ఓహ్ సెయుంగ్వాన్-కిమ్ సియోంగ్జిన్‌లను ఓడించారు. తర్వాత హోమ్ ఫేవరెట్ జట్టు 42 నిమిషాల్లో 3-2 (10-12, 11-6, 12-10, 5-11, 12-10) తేడాతో విజయం సాధించింది. మొదటి రౌండ్ పోరులో కజకిస్తాన్‌కు చెందిన ఇస్కోందర్ ఖార్కి-సర్వినోజ్ మిర్కాదిరోవాను 11-8, 11-6, 11-7 తేడాతో ఓడించిన భారత వైల్డ్ కార్డ్స్ పయాస్ జైన్-సింద్రెలా దాస్‌లను ఎదుర్కోనున్నారు. మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో 15 ఏళ్ల దివ్యాంశి భౌమిక్ కొరియా ప్లేయర్ ర్యూ హన్నాపై చేతిలో పోరాడి ఓడింది.

# అర్జెంటీనా చేతిలో భారత్ చిత్తు

## పురుషుల ప్రో లీగ్ హాకీ

**న్యూఢిల్లీ:** పురుషుల ప్రో లీగ్ 2025-26, రూర్కెలా లెగ్‌లో అర్జెంటీనా చేతిలో భారత్ 0-8 తేడాతో ఓడిపోయింది. టోమస్ డొమెనె (15వ నిముషం, 20, 26, 60), టోమస్ రూయిజ్ (14), లూసియో మెండెజ్ (22), ఇగ్నాసియో ఇబారా (25), నికోలస్ డెల్లా టోర్రే (30) గోల్స్ చేశారు. భారత్ మొదటి క్వార్టర్ చివరిలో పెనాల్టీ స్ట్రోక్ లభించడంతో ఆతిథ్య జట్టుకు తొలి గోల్ చేసే అవకాశం లభించి గోల్ చేసింది. రూయిజ్ తొలి క్వార్టర్‌లో డొమెనే సూరజ్ కర్కేరాను అధిగమించి జట్టుకు 2-0 తో ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. భారత్ రెండవ క్వార్టర్‌ను అర్జెంటీనాపై ఒత్తిడి పెంచుతూ ప్రారంభించింది. శిలానంద్ లక్రా మరియు హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు పెనాల్టీ కార్నర్‌లను సాధించడంలో రాణించినా కానీ ఆతిథ్య జట్టు తమ మొదటి గోల్‌ను పూర్తిగా సాధించలేకపోయింది. అర్జెంటీనాపై ఒత్తిడిని తెచ్చినా దాన్ని అధిగమించి లూసియో మెండెజ్ ద్వారా నాల్గవ గోల్‌ను జోడిం ఆధి క్యాన్ని పెంచుకుంది. ఇబార్రా ఐదవ గోల్, ఆ తర్వాత డొమెనే హ్యాట్రిక్‌తో మరో గోల్, డెల్లా టోర్రే కూడా స్కోర్‌షీట్‌లో నిలవడంతో అర్జెంటీనా 7-0 ఆధిక్యంతో మొదటి అర్ధభాగాన్ని ముగించింది. రెండవ అర్ధభాగంలో భారత్ శిలానంద్ లక్రా, ఆదిత్య లాలేజ్ గోల్స్‌కు దగ్గరగా వచ్చినా థామస్ శాంటియాగో గోల్ చేయడంతో అర్జెంటీనా అగ్రస్థానంలో నిలిచింది. చివరి క్వార్టర్‌లో భారత్ కు మూడో పెనాల్టీ కార్నర్ లభించినా విఫలమయ్యారు.




## ఆర్యాన్ష్, సోహైబ్ హాఫ్ సెంచరీలు

# కెనడాపై యుఎఇ విజయం






**న్యూఢిల్లీ:** టీ ట్వంటీ ప్రపంచకప్‌లో యూఏఈ తొలి విజయం నమోదుచేసింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కెనడాపై అయిదు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 150పరుగులు చేసింది.హార్ష్ థాకర్ 50పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. నవ్‌నీత్ 34 పరుగులతో రాణించాడు. జునైద్ సిద్ధిఖీ 5వికెట్లు తీసి కెనడాను కట్టడిచేశాడు.

అనంతరం 151 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 19.4 ఓవర్లలోనే అయిదు వికెట్లు కోల్పయి అందుకుంది. 66 పరుగులకే నాలుగు టాప్ ఆర్డర్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ యూఏఈని ఆర్యాన్ష్ శర్మ, సోహైబ్ ఖాన్ ఆదుకున్నారు. అర్ధసెంచరీలతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆర్యాన్ష్ 53 బంతుల్లో 6 బౌండరీలు, మూడు సిక్స్‌లతో అజేయంగా 74 పరుగులు సాధించాడు. 5 వికెట్లు తీసిన జునైద్ సిద్ధిఖీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

# సెన్సెక్స్, నిఫ్టీల్లో రూ.7లక్షల కోట్లు ఆవిరి

## ఎఐ ప్రభావంతో ఐటి షేర్లు భారీ పతనం



**వాణిజ్యం**

**ముంబయి, ఫిబ్రవరి 13:** ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ స్టాక్స్‌లో నెలకొన్న భారీ ప్రతికూలత వారాంతంలో కూడా కొనసాగింది. ఎఐ అమలుతో మార్కెట్లలోని ఐటి కంపెనీలకు భారీ విఘాతం కలిగింది. మేజర్ ఐటి కంపెనీల షేర్లుఐదుశాతం వరకూ ఇంట్రాడేలో నష్టం జరిగింది. దిగువ స్థాయిలో జరిగిన కొన్ని కొనుగోళ్లు మార్కెట్లకు కొంత కలిసొచ్చింది. నిఫ్టీ ఐటి సూచీ ఇప్పటికీ 1.50శాతం దిగజారింది. ఐటిస్టాక్స్‌లో నిరంతర అమ్మకాలు కొనసాగాయి. గ్లోబల్‌ధోరణులు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీసింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీలు రెండూ కూడా 1.3శాతం చొప్పున క్షీణించాయి. సెన్సెక్స 1038 పాయింట్లు క్షీణించి 82,627 పాయింట్లవద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ కూడా 336 పాయింట్లు క్షీణించి 25,471వద్ద స్థిరపడింది. అమ్మకాల ఒత్తిడి ఎక్కువ కనిపించింది నిఫ్టీ 50లో కనీసం 44 విభాగాలు నష్టాల్లోనే కొనసాగాయి. ఇన్వెస్టర్లు సుమారు ఏడులక్షలకోట్ల సంపదను నష్టపోయినట్లు తేలింది. బిఎస్‌ఇలో నమోదయిన కంపెనీల విలువలు సుమారు 465.37 లక్షలకోట్లుగా ఉంది. అదే ముందురోజు ట్రేడింగ్‌ముగిసేనాటికి 472.50 లక్షలకోట్లుగా ఉందని తేలింది. ప్రైవేటు బ్యాంకులు, మెటల్స్, ఇంధన షేర్లుకూడా అమ్మకాల జోరులో వెనక్కితగ్గాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 1.58 శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.50శాతం క్షీణించింది. పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.10శాతం 6.679వద్దముగిసాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతోరూపాయి మారెం విలువలు 90.65వద్ద కదలాడింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ఏప్రిల్2 సెటిల్‌మెంట్‌నాటివి 0.74శాతం క్షీణించి రూ.153.970గా నడిచింది. నిఫ్టీలో మెటల్ సూచీ 3.31శాతం క్షీణించింది. హిందాల్కో 6.08శాతం, నేషనల్ అల్యూమినియం కంపెనీ 5.42శాతం, హిందూస్థాన్ కాపర్ 5.16శాతం జింక్ 4.91శాతం, వేదాంత 4.11శాతం, జిందాల్ స్టెయిన్‌లెస్ 4.10శాతం, ఆదాని ఎంటర్‌ప్రైజెస్ 383శాతం వెల్‌స్పన్ కార్ప్ 3.63 శాతం, ఎన్‌ఎండిసి 342శాతం క్షీణించాయి. ఇంజినీర్స్ ఇండియా 11.64శాతంపెరిగింది. ఇక ఓఎన్‌జిసి 3.17శాతం, మోనాసా కన్స్యూమర్ 0.82శాతం లాభపడ్డాయి.




# టొరెంట్ ఫార్మా నికరలాభం రూ.635కోట్లు

**ముంబయి, ఫిబ్రవరి 13:** టొరెంట్ ఫార్మాక్యూటికల్స్ సంస్థ నికరలాభం 26.2శాతంపెరిగింది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.635 కోట్లు ఆర్జించినట్లుప్రకటించింది. ఇదే కంపెనీ గత ఏడాది ఇదే కాలానికిగాను రూ.503 కోట్లు ఆర్జించింది. కంపెనీ రాబడులు రూ.1798 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది కంటే 14శాతం పెరిగాయి. బ్రెజిల్ దేశపు రెవెన్యూ రూ.371 కోట్లుగా ఉంది. 27శాతంపెరిగింది. అమెరికా రాండులు 321కోట్లుగా ఉంటే 19శాతం పెరిగింది. జర్మనీదేశంలో అమ్మకాల రాబడులు రూ.304 కోట్లుగా ఉన్నట్లు కంపెనీ తెలిపింది. అన్ని విదేశీ మార్కెట్లలోను తాము గణనీయంగా వృద్ధిని నమోదుచేసినట్లు కంపెనీ ప్రకటించింది. టొరెంట్ ఫార్మా తాత్కాలిక డివిడెండ్ ప్రతి వాటాను రూ.29గా ప్రకటించింది. ఈ డివిడెండ్‌ను 2026 మార్చి 5 నాటికి పంపిణీ చేయాలిని నిర్ణయించినట్లు తెలిపింది. టొరెంట్ కంపెనీషేర్లు బిఎస్‌ఇలో శుక్రవారం 4074.05గా ట్రేడింగ్ కొనసాగింది.

# డాలరుతో రూపాయి మారకం 90.64



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** డాలరుతో రూపాయి మారకం విలువలు మూడు పైసలు క్షీణించి 90.64 రూపాయలవద్ద నమోదయింది. వారాంతంలో అమెరికన్ కరెన్సీ విదేశీ మార్కెట్లలో పటిష్టం అయితే దేశీయ ఈక్విటీల్లో కొంతమేర ప్రతికూలంగా నడిచింది. ఫోరెక్స్ ట్రేడర్లు వివరాల ప్రకారం రూపాయి స్వల్పంగా క్షీణించిందని వర్ధమాన దేశాల మార్కెట్ కరెన్సీలపరంగా చూస్తే రూపాయి కొంతమేర సానుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజి మార్కెట్‌లో డాలరుతోరూపాయి మారకం విలువలు 90.69వద్ద ప్రారంభించి ఇంట్రాడేలో 90.60వరకూ వెళ్లింది. ఒకదశలో అత్యంత కనిష్టంగా 90.79కి కూడా క్షీణించినట్లు తేలింది. చివరికి రూపాయి ట్రేడింగ్ ముగింపులో 90.64వద్ద ట్రేడ్ అయింది. ముందురోజు రూపాయి17 పైసలు బలపడి 90.61గా నిలిచింది. రిస్క్‌సెంటిమెంట్ మరింతగా రూపాయి క్షీణతకు దోహదంచేసింది. ఎఐ కారణంగా పరిశ్రమల్లో సురక్షిత పెట్టుబడుల స్థావరాల్లోకి పెట్టుబడులు మళ్లిపోయాయి. డాలర్‌సూచీని చూస్తే ఆరు కరెన్సీల్లో 0.10శాతం ఎగువన 97.01గా నిలిచింది. బ్రెంట్ ముడిచమురు పరంగా చూస్తే 0.04శాతం దిగువన అంటే బ్యారెల్‌కు 67.49 డాలర్లుగా నడిచింది. సంస్థాగత ఇన్వెస్టర్లు కూడా ఈక్విటీల్లో 108.42కోట్లపెట్టుబడులు పెట్టినట్లు కనిపించింది. రిటైల్‌ద్రవ్యోల్బణం కూడా జనవరి నెలలో 2.75శాతంమేర నమోదయి కొంత మార్కెట్లకు సానుకూల వాతావరణం కల్పించింది.

# ముంబయి బోరివాలిలో యాపిల్ రెండో స్టోర్



**ముంబయి, ఫిబ్రవరి 13:** ఐఫోన్ తయారీ కంపెనీ యాపిల్ తన కొత్తస్టోర్‌ను ముంబయిలోని బోరివాలిలో ప్రారంభిస్తోంది. మొత్తంగా చూస్తే భారత్‌లో ఆరోస్టోర్ ప్రారంభిస్తోంది. ముంబయిలోనే రెండోస్టోర్‌గా చెపుతున్నారు. మొదటి స్టోర్‌ను ముంబయి, రెండో ఢిల్లీలోను గత ఏడాది ఏప్రిల్‌లోప్రారంభించింది. గత ఏడాది యాపిల్ హెబ్బల్‌ను బెంగళూరులోను, యాపిల్ కోరెగాంవ్ పార్క్ స్టోర్ పూణెలోను ఇటీవలే నోయిడాలోను యాపిల్‌స్టోర్లుప్రారంభించింది. ఈనెల 26వ తేదీ ముంబయిలోని బోరివాలి స్టోర్‌ప్రారంభం అవుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. నెమలిని పోలిన ఆకృతితో ఈస్టోర్‌ను ప్రారంభిస్తారు. గతంలో బెంగళూరు, పూణెలోను నోయిడాలోకూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించింది డిజైన్‌కారణంగా విశ్వాసం, సమగ్ర వివరణ, కస్టమర్లను రాబట్టుకునేందుకు ఎక్కువ వీలుంటుందని అన్నారు. యాపిల్ బోరివాలి స్టార్టప్ కమ్యూనిటీలు, బిజినెస్ సంస్థలకు ఎక్కువ లాభదాయకంగా ఉంటుందని కంపెనీ వివరించింది.

# టాప్‌గేర్‌లో ఆటోమొబైల్ సేల్స్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** దేశంలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 12.6శాతం పెరిగాయి. 4,49,616 యూనిట్లు విక్రయించారు. గత ఏడాది 3,99,386 యూనిట్లవరకూ విక్రయించిన కంపెనీ ఈసారి భారీ వృద్ధిని నమోదుచేసినట్లు ఆటోమొబైల్ ఉత్పత్తిదారుల సంఘాల సమాఖ్య సియామ్‌ప్రకటించింది. ప్యాసింజర్ వాహనాలు, త్రీవీలర్లు, టూవీలర్లు, క్వాడ్రిసైకిళ్లు వంటివి జనవరిలో మొత్తం 29,27,394వరకూ విక్రయించామని తెలిపింది. త్రీవీలర్లు పటిష్టంగా వృద్ధినమోదుచేసాయి. 30.2శాతం పెరిగి 75,725 యూనిట్లు అమ్ముడయినట్లు తెలిపింది. ప్యాసింజర్ వాహనాలు, టూవీలర్లు, త్రీవీలర్లు జనవరిలో గతంలో ఎన్నడూలేనంతగా విక్రయాలు జరిగాయని సియామ్ డైరెక్టర్‌జనరల్ రాజేష్ మీనన్ తెలిపారు. బడ్జెట్ వరాలు కొంత కలిసొచ్చాయి. దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరగలవని అంచనావేస్తున్నారు. టూవీలర్ విభాగంలో స్కూటర్ల విక్రయాలు 36.9శాతంపెరిగి 7,50, 580 యూనిట్లుపెరిగాయి. మోటారు సైకిళ్లు 20.3శాతంపెరిగి 11,26,416 యూనిట్లకు చేరాయి. మోపెడ్లు 16.1శాతంపెరిగి 48,607 యూనిట్లకు చేరాయి. త్రీవీలర్ల విభాగంలో ప్యాసింజర్ వాహణాలు 30.4శాతం పెరిగి 60,881 యూనిట్లుగా ఉన్నాయి. రవాణా వాహనాలు 33.4శాతంపెరిగి 13,374 యూనిట్లుగా ఉంటే ఈరిక్షా అమ్మకాలు మాత్రం 7.9శాతం క్షీణించి 925 యూనిట్లకు చేరాయి.




# ఓలా ఎలక్ట్రిక్ రూ.487 కోట్ల నష్టం

**బెంగళూరు, ఫిబ్రవరి 13:** విద్యుత్ స్కూటర్ల తయారీ సంస్థఓలా ఎలక్ట్రిక్ మూడో త్రైమాసికంలో రూ.487 కోట్ల నికరనష్టం చవిచూసింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.564 కోట్లు నష్టం చవిచూసిన కంపెనీ ఈఏడాది నష్టాలను తగ్గించుకోగలిగింది. 2026 రెండో త్రైమాసికంలో రూ.418 కోట్లు మేర నష్టం చవిచూసింది. సాఫ్ట్‌బ్యాంకు మద్దతున్న స్టార్టప్ కంపెనీ ఓలా కొత్తలేబర్‌కోడ్‌ల అమలు ద్వారా రూ.5.06 కోట్ల ఒకేసారి వ్యయభారం పడింది. సంస్థ రాబడులపరంగా కూడా 55శాతం క్షీణించి రూ.470కోట్లుగా ఉంది. అదే గత ఏడాది మూడోత్రైమాసికంలో 1045 కోట్లు ఆర్జించింది. రెండోత్రైమాసికంలో కూడా 32శాతం క్షీణించి రూ.690 కోట్లుగా నమోదయింది. కంపెనీ స్కూటర్ అమ్మకాల్లో భారీ క్షీణవల్లననేనని నిపుణుల అంచనా. కంపెనీ స్కూటర్ సేల్స్ రూ.32,680యూనిట్లు విక్రయించగలిగింది. స్థూల మార్జిన్ మాత్రం 34.3శాతంమేర ఉన్నట్లుతెలిపింది. అంటే 15.7 పర్సంటేజ్ పాయింట్లు మెరుగుపడిందని చెపుతోంది.కంపెనీ ఆటోమేషన్‌ను పెంచింది. ఇటీవలపెంచిన జాబ్‌కట్స్‌కూడా త్రైమాసిక నిర్వహణ ఖర్చులు రూ.250 నుంచి రూ.300 కోట్లవరకూ ఆదా అవుతాయని చెపుతోంది. కంపెనీ మొత్తం వ్యయాలు మూడో త్రైమాసికంలో రూ.714 కోట్లుగా ఉన్నాయి. ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ షేర్లు బిఎస్‌ఇలో రూ.30.9గా కొనసాగాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps